అక్టోబర్
2026

246

సంపుటి : 22 సంచిక : 5

వెల రూ. 15/-

మార్క్సిస్టు

MARXISTU

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో.....

మావో వారసత్వం : నేటి విప్లవ సిద్ధాంత, ఆచరణలో దాని ప్రాసంగికత

భారతీయ పౌరసత్వ స్వూర్తిని దెబ్బతీస్తున్న 'సర్'

ప్రజాపక్ష మేధావుల అవసరం మరింత పెరిగింది

అదో మహాద్భుతం, మరోవైపు ముంచుకొస్తున్న ముప్ప కూడా

వ్యవసాయరంలో మార్పుల్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఆరాధన రాజకీయాల నుండి బయటపడలేమా?

విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు

వాగ్దానాలు, వైరుధ్యాల మధ్య బ్రిక్స్ సదస్సు

మనకి పారిశ్రామిక విధానమేదీ?

వైద్య రంగంలో సోషలిస్టు క్యూబా విజయాలు

సిఇసి వ్యవహారం రాజ్యాంగ వ్యతిరేకం


కామ్రేడ్ ఎకె గోపాలన్ : సత్యాగ్రాహి నుంచి విప్లవకారుడిగా అసాధారణ ప్రయాణం

స్ఫూర్తి

కామ్రేడ్ ఎకె గోపాలన్

సత్యాగ్రాహి నుంచి విప్లవకారుడిగా అసాధారణ ప్రయాణం

వైరాము



అక్టోబర్ 1 ఎకెజి జయంతి

అది 1930వ సంవత్సరం... కేరళలోని కాలికట్ నుంచి పయ్యన్నూర్ వరకు కేళప్పన్ నేతృత్వంలో ఒక జాతా సాగుతోంది. దారి పొడవునా జనం గుమిగూడి స్వాగతం పలుకుతున్నారు. చొవ్వ అనే ఊరిలో ఆ జాతాకు ఘనస్వాగతం ఏర్పాటు చేసిన ఒక యువకుడు అక్కడే నిలబడి ఉన్నాడు– ఉపన్యాసాలు వింటూ, ప్రజల ఉత్సాహాన్ని గమనిస్తూ. అతని ముందు రెండు దారులు నిలిచాయి. కుటుంబ బాధ్యతలతో కూడిన సురక్షిత జీవితం ఒకవైపు. అణచివేతలో మగ్గుతున్న ప్రజల పక్షాన నిలబడే పోరాటం మరోవైపు. ఉద్యోగం పోవచ్చు. తండ్రి కోపగించవచ్చు. కుటుంబం కష్టాల్లో పడవచ్చు. అయినా, అన్యాయానికి ఎదురొడ్డి నిలిస్తే దక్కే సంతృప్తి ముందు ఆ భయాలన్నీ చిన్నవిగా తోచాయి. తెల్లవారేసరికి అతని నిర్ణయం ఖరారైంది. ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇంటివారికి చెప్పకుండా కోజికోడ్ నుంచి కన్నూరుకు చేరుకున్నాడు. అక్కడ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. అదే రోజు అరెస్టయ్యాడు. ఆ యువకుడే ఎ.కె. గోపాలన్. చరిత్రలో 'ఎకెజి'గా చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు.

అసాధారణ పోరాట యోధుడు

1904 అక్టోబర్ 1న ఉత్తర మలబార్‌లోని ఒక సంపన్న నాయర్ కుటుంబంలో జన్మించిన ఎకెజి, సామాజిక సేవలో చురుగ్గా ఉండే తండ్రి, సోదరుల ప్రభావంతో చిన్నతనం నుంచే ప్రజాజీవితం పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. లాంఛనప్రాయ చదువు పూర్తి కాక పోయినా, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఏడేళ్ల పాటు పనిచేశాడు. జాతీయోద్యమం ఆయనను ఖద్దరు ప్రచారం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి కార్యకలాపాల వైపు లాగింది. చొవ్వలో ఆ రాత్రి తర్వాత, ఎకెజి జీవితం మలుపు తిరిగింది. సత్యాగ్రహంలో పాల్గొన్న ఆయనను కన్నూర్ జైలు నుంచి వెల్లూరు జైలుకు మార్చారు. అక్కడ మొదటిసారిగా, జైలులోనే వర్గ విభజన ఎంత తీవ్రంగా ఉంటుందో కళ్లారా చూశాడు. ఒక వర్గానికి సౌకర్యాలు, మరో వర్గానికి కటిక దు:ఖం. ఈ అసమానత అతని మనసులో తీవ్ర అలజడి రేపింది. 1932లో గాంధీ, ఇర్విన్ ఒప్పందం తర్వాత విడుదలైన ఎకెజి మళ్లీ కాంగ్రెస్ ఉద్యమంలో పూర్తిగా మునిగిపోయాడు. డబ్బు లేదు. వాహన సౌకర్యం లేదు. రోజుకు 25–30 మైళ్లు నడుస్తూ, రోజుల తరబడి తిండి లేకుండా, గ్రామగ్రామాన తిరిగి జాతీయ జెండా ఎగరేస్తూ ప్రజలను చైతన్యవంతం చేశాడు. బట్టలు మార్చుకోవడానికి కూడా వీలు లేక, పది పదిహేను రోజులు ఒకే బట్టలు వేసుకున్న సందర్భాలు ఎన్నో.

గురువాయూర్ ఆలయ ప్రవేశం

కాంగ్రెస్ అస్పృశ్యతపై పోరాటం మొదలుపెట్టినప్పుడు, ఎకెజి ఆ ఉద్యమంలో పూర్తిగా నిమగ్నమయ్యాడు. కందోత్ అనే ప్రాంతంలో హరిజనుల ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్నప్పుడు ఆలయానికి సమీప దారిలో వారిని రానియ్యకుండా అగ్రవర్ణ పెత్తందార్లు అతనిపై దాడి చేశారు. స్పృహ తప్పేంత వరకూ కొట్టారు. ఆ దాడే గురువాయూర్ ఆలయ ప్రవేశ సత్యాగ్రహానికి అతిపెద్ద ప్రచారంగా మారింది. ప్రజల కళ్లు తెరిపించింది. అధికారులు ఆ దారిని అందరికీ వినియోగించుకునే హక్కు ఉందని బోర్డు పెట్టారు. ఆ తర్వాత ఎకెజి కన్నూర్ నుంచి గురువాయూర్ వరకు కాలినడకన బృందాన్ని నడిపించాడు. మార్గం పొడవునా పందలాది సభలు నిర్వహించాడు. మొదటిసారిగా పేదల్లో పేదవారైన హరిజన యువకులు కాంగ్రెస్ ఉద్యమంలో భాగమయ్యారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమం వేగంగా వ్యాపిస్తుండటంతో భయపడి 1932 జనవరిలో అణచివేత మొదలుపెట్టింది. ఎకెజితో సహా దేశవ్యాప్తంగా నేతలందరూ అరెస్టయ్యారు.

జైల్లో చిత్రహింసలు

రెండోసారి జైలు జీవితం మరింత భయానకంగా ఉంది. ఖైదీలను నిత్యం కొట్టేవారు. అదే సమయంలో ఎకెజి ఎంతోమంది విప్లవకారులను కలిశాడు. రష్యన్ విప్లవం గురించి లోతైన చర్చలు జరిపాడు. అధికారులు అతన్ని ఖైదీల్లో అలజడి రేపుతున్నాడని కడలూరు జైలుకు తరలించారు. పిచ్చివారి మధ్య ఉంచారు. మాతృభూమి స్వాతంత్ర్యం కోసం పోరాడటం పిచ్చితనమే అయితే, తాను గర్వంగా ఆ "రాజకీ య పిచ్చి"ని స్వీకరిస్తానని అయన భావించాడు. ఆరు రోజుల నిరాహారదీక్ష తర్వాత మాత్రమే అతన్ని వేరే గదికి మార్చారు. మూడోసారి అరెస్టయినప్పుడు "ప్రమాదకరమైన ఖైదీ"గా పేర్కొంటూ బళ్లారి జైలుకు తరలించారు. సంకెళ్లు వేసి, ఏకాంత నిర్బంధంలో ఉంచారు. నిరసనగా నిరాహారదీక్ష చేపడితే ముక్కు ద్వారా బలవంతంగా ఆహారం ఎక్కించారు. చివరకు వెల్లూరుకు తరలించి, 1933 చివర్లో విడుదల చేశారు.

గాంధేయ మార్గం నుంచి సోషలిజానికి

వెల్లూరు జైల్లో ఉన్నప్పుడే ఎకెజి మనసులో గాంధేయ సత్యాగ్రహం, అహింసలపై సందేహాలు మొదలయ్యాయి. బయటకు వచ్చి శాసనోల్లంఘన ఉద్యమం నెమ్మదిగా చల్లారిపోవడం చూసినప్పుడు ఆ సందేహాలు నమ్మకంగా మారాయి. రెండేళ్ల మూడు నెలల పాటు అపారమైన ధైర్యంతో సాగిన పోరాటం ఎందుకు విఫలమైందని ఆయన ప్రశ్నించుకున్నాడు. సమాధానం స్పష్టంగా ఉంది. ధనం కోల్పోయే వారు మాత్రమే త్యాగానికి వెనుకాడా రు. కానీ శరీరం తప్ప కోల్పోయేదేమీ లేని కోట్లాది పేద ప్రజలు.. వారే నిజమైన పోరాట శక్తి. వారిని ముందుపెట్టకుండా స్వా తంత్ర్యం సాధ్యం

(మిగతా 34వ పేజీలో)

ఈ సంచికలో...

1. కామ్రేడ్ ఎకె గోపాలన్: సత్యాగ్రాహి నుంచి విప్లవకారుడిగా అసాధారణ ప్రయాణం
వై రాము.....2

2. మావో వారసత్వం: నేటి విప్లవ సిద్ధాంత, ఆచరణలో దాని ప్రాసంగికత
బివి రాఘవులు.....4

3. భారతీయ పౌరసత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న 'సర్'
పరకాల ప్రభాకర్.....8

4. ప్రజాపక్ష మేధావుల అవసరం మరింత పెరిగింది
డివి కుమార్ 12

5. అదో మహోద్యుతం, మరోవైపు ముంచుకొస్తున్న ముప్ప కూడా
బృందా వాసుదేవన్.....14

6. వ్యవసాయరంగంలో మార్కుల్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఆర్ రామ్ కుమార్ 17

7. ఆరాధన రాజకీయాల నుండి బయటపడలేమా?
నదీమ్ ఎఫ్ పరాచా.....21

8. విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు
ఎంవిఎస్ శర్మ.....24

9. వాగ్దానాలు, వైరుధ్యాల మధ్య బ్రిక్స్ సదస్సు
విజయ ప్రసాద్.....27

10. మనకి పారిశ్రామిక విధానమేదీ?
అరుణ్ మైరా 29

11. వైద్య రంగంలో సోషలిస్టు క్యూబా విజయాలు
ఫైడల్ కాస్ట్రో.....31

12. సిఐసి వ్యవహారం రాజ్యాంగ వ్యతిరేకం
ఎ కోటిరెడ్డి.....32

సంపాదకుడు:
ఎస్.వెంకట్రావు
సంపాదక వర్గం:
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

ఎన్నికల కుంభకోణం

వడ్డించేవాడు మనవాడైతే చివరి బంతిలో ఉన్నా ఫరవాలేదు అనేది నానుడి. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా వరుసగా ఎన్నికల్లో గెలవడానికి సరిగ్గా ఈ సూత్రాన్నే అందిపుచ్చుకుని ఎన్నికల కమిషన్ అనే వడ్డించే వాళ్ల బృందంలో అగ్రభాగాన జ్ఞానేష్ కుమార్ అనే తనవాడిని వక్రమార్గంలో ప్రవేశ పెట్టిందని ఇటీవల ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక బయట పెట్టిన కుంభకోణం నిస్సందేహంగా రుజువు చేసింది. బిజెపికి అనుకూలంగా ఎన్నికల ప్రక్రియను తొత్తడం చేయడానికి 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను ఒక సాధనంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఉపయోగిస్తున్నారని గతం నుండీ వ్యక్తమవుతున్న అనుమానాలు నిజమేనని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి రితికా చోప్రా ఎంతో సాహసంతో నిర్వహించిన ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్ కళ్లకు కట్టింది.

మొదటిది, ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు సభ్యులు ఏకాభిప్రాయంతోగానీ, మెజారిటీ అభిప్రాయంతోగానీ నిర్ణయాలు తీసుకోవాలన్న సూత్రాన్ని తుంగలో తొక్కి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ద్వారా బిజెపికి అనుకూలంగా వ్యవహరించారు. మిగిలిన ఇద్దరు సభ్యులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ఆయన లెక్కచేయకుండా వ్యవహరించారు. గత 10 మాసాల్లో ఆయన 14 సార్లు మిగిలిన సభ్యులకు కనీసం తెలియపర్చకుండా నిర్ణయాలు తీసుకున్నారని పత్రిక వెల్లడించింది. చివరికి ఆ ఇద్దరు సభ్యులు జరుగుతున్న అప్రజాస్వామిక వ్యవహారం గురించి కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయినా మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండవది, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌లను పక్కన పెట్టి సిఇసి నేరుగా కింది స్థాయి అధికారులనుండి సమాచారం తెచ్చుకుని వ్యవహరించారు.

దేశంలో ప్రధాన ప్రజాస్వామ్య ప్రక్రియ అయిన ఎన్నికలను నిర్వహించే సంఘమే అప్రజాస్వామికంగా తయారుచేయబడింది. దాదాపు 13 కోట్ల ఓటర్లను లిస్టుల్లో లేకుండా చేయడానికి 'సర్' ప్రక్రియను ఉపయోగించుకుంది. ఇదంతా జ్ఞానేశ్ కుమార్ బుర్రలో పుట్టిన బుద్ధి కాదనీ, ఆయనను ఆ స్థానంలో కూర్చోపెట్టిన వాళ్ల ప్రయోజనం కోసమే ఆయన ఇంత బరితెగించి వ్యవహరించాని అర్థమవుతున్నది.

నిజానికి జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసి స్థానంలో కూర్చోబెట్టిన క్రమాన్ని పరిశీలిస్తే ఈ మొత్తం వ్యవహారం వెనుక మోడీ, ఆయన ప్రభుత్వం ఎంతో పకడ్బందీగా రూపొందించిన పథకం అర్థమవుతుంది. మొదట మోడీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను నియమించే ముగ్గురు సభ్యుల కొల్లీజియం కూర్పును మార్చేసింది. గతంలో ఇందులో ప్రధాన మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండేవారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధాన మంత్రి కోరుకున్న కేంద్ర మంత్రిని చేరుస్తూ 2023లో చట్టం చేసింది. దాంతో కొల్లీజియంలో ఇద్దరూ ప్రభుత్వ పక్షమే అయ్యారు. తమకు అనుకూలుడైన జ్ఞానేశ్ కుమార్‌ను నియమించుకోడానికి ఇది ప్రభుత్వం తీసుకున్న మొదటి చర్య. తదుపరి ఎన్నికల కమిషనర్లు తీసుకునే నిర్ణయాలకు గాను వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోకుండా చట్టంలో నిబంధన చేర్చింది.

అధికారంలోకి వచ్చింది మొదలు ఒక్కో రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వచ్చిన మోడీ చివరికి ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీయడం ద్వారా ప్రజాస్వామ్య మూల స్థంభాన్నే కుప్పకూల్చేయడానికి పూనుకున్నారు. దేశమంతా ఏకమై దీన్ని ప్రతిఘటించకపోతే మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం నాశనమైపోతాయి. అందుకే దేశ వ్యాపితంగా దీనిపై తీవ్రమైన నిరసన వ్యక్తమవుతున్నది. ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపై నిరసన దీక్షలకు దిగాయి. జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన పెట్టడానికి పూనుకున్నాయి. గతంలో పరీక్ష పేపర్ లీకేల వ్యవహారంలో విద్యా మంత్రిని బాధ్యుని చేస్తూ ఆయన రాజీనామా కోసం కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో యువత తిరుగుబాటు చేసింది. విద్యా మంత్రి రాజీనామా చేసే వరకు పట్టువిడువ కుండా ఆందోళన నిర్వహించింది. ఇప్పుడు కూడా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం యువత ఉద్యమిస్తున్నది. అయితే జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసినంత మాత్రాన సరిపోదు. ఆయనను పావుగా ఉపయోగించుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్నీ, బిజెపిని కూడా బాధ్యులుగా చేయాలి. ఈ సందర్భంగా ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జ్ఞానేశ్ కుమార్‌ను వెనుకేసుకు రావడం సిగ్గుచేటైన విషయం. మోడీ ప్రభుత్వ ప్రతి ప్రజా వ్యతిరేక విధానానికి మద్దతివ్వడం వల్ల వచ్చే విపరిణామాలను చంద్ర బాబు నాయుడు తప్పక అనుభవించి తీరుతారు.

ఏమైనా, ఎన్నికల సంఘం ఉదంతం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశ వ్యాపితంగా పెద్ద ఉద్యమం జరగాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తున్నది.

50వ వర్ధంతి ప్రత్యేక వ్యాసం

మావో వారసత్వం

నేటి విప్లవ సిద్ధాంత, ఆచరణలో దాని ప్రాసంగికత



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు

బివి రాఘవులు

1949లో సంభవించిన సోషలిస్టు విప్లవం తరువాత చైనా ప్రజా రిపబ్లిక్కు అద్భుతమైన పురోభివృద్ధి సాధించిన విషయాన్ని ప్రపంచ వ్యాపితంగా దాని మిత్రులు, విమర్శకులు కూడా అంగీకరిస్తున్నారు. ఈ మార్పుల మూలాలు చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) నాయకత్వంలో జరిగిన విప్లవోద్యమంలోనూ, నూతన ప్రజాతంత్ర విప్లవ విజయంలోనూ ఉన్నాయి. 1921లో సిపిసి ఆవిర్భవించింది మొదలు విప్లవోద్యమానికి నాయకత్వం వహించి నడిపించింది. చైనా ప్రజలను, దేశాన్ని అర్ధ-ఫ్యూడల్, అర్ధ వలస ఆధిపత్యం నుండి విముక్తి చేసింది. తద్వారా దేశాన్ని స్వతంత్ర, సార్వభౌమాధికార, సోషలిస్టు మార్గంలో అభివృద్ధి చెందడానికి మార్గం వేసింది.

ఈ పూర్వ రంగంలోనే మావో జెడాంగ్ నిర్వహించిన పాత్రను మనం అర్థం చేసుకోవాలి. ఆయన ప్రజావిముక్తి ఉద్యమ ఎగుడు దిగుడుల్లోనూ, కష్ట నష్టాల్లోనూ చైనా కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహించాడు. విప్లవం తరువాత సోషలిస్టు నిర్మాణపు తొలి దశకు కూడా నాయకత్వం వహించాడు. ఆ విధంగా ఆయన చైనా విప్లవోద్యమంలో ఒక గొప్ప చారిత్రక పాత్ర నిర్వహించాడు. ప్రపంచ ప్రజలకు మంచి భవిష్యత్తు కావాలని కోరుకునే వారికీ, పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించి సోషలిజంలోకి పురోగమించాలని కోరుకునే వారికీ ఆయన కృషి ఎన్నటికీ మాసిపోని ప్రాసంగికతను సంతరించుకున్నది.

అదే సమయంలో, ఆయన అనుభవం విలువైన గుణపాఠాలను కూడా నేర్పుతున్నది. ఒక వెనుకబడిన, ప్రధానంగా వ్యవసాయక దేశంలో అందునా వెలుపలి నుండి తీవ్రమైన శత్రుత్వం ఎదురవుతున్న సమయంలో ఆయన నాయకత్వంలో సోషలిజాన్ని నిర్మించడంలో జరిగిన లోటుపాట్లు మనకు అనేక పాఠాలు నేర్పుతాయి.

ఈ సందర్భంగా, 2026 సెప్టెంబర్ 9న జరిగిన మావో 50 వర్ధంతి ఆయన వారసత్వాన్ని విమర్శనాత్మకంగా అంచనా వేయడానికి సరైన అవకాశం ఇచ్చింది.

మావో చేసిన ప్రధాన కృషి

సామ్రాజ్యవాద ఆధిపత్యం, ఫ్యూడల్ అవశేషాలను ఎదుర్కొంటున్న దేశాల్లో **నూతన ప్రజాస్వామిక విప్లవ** సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడం ఆయన చేసిన ప్రధానమైన కృషిలో ఒకటి. వ్యవసాయ ప్రధాన సమాజాల్లో **రైతాంగ విప్లవ సామర్థ్యాన్ని** గుర్తించడం రెండవది. రైతాంగాన్ని సమీకరించితే కార్మికవర్గ రాజకీయ నాయకత్వంలో అది విప్లవం సాధించే ముఖ్యమైన ప్రజాశక్తి అవుతుందని మావో నిరూపించాడు. అలాగే ఆయన **విప్లవ సైనిక వ్యూహాలు** రూపొందించడంలోనూ, **ఐక్య సంఘటన** వ్యూహం అభివృద్ధిలోనూ గొప్ప కృషి చేశాడు. కార్మికవర్గం, దాని పార్టీ స్వతంత్రతను కాపాడుతూనే ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విశాల సంఘటనలు నిర్మించాడు. ఇంకా ఆయన అభివృద్ధి చేసిన **ప్రజా పంథా, గతితార్కిక విశ్లేషణ, సిద్ధాంతం-ఆచరణల ఐక్యత** అనేవి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాన్ని పరిపుష్టం చేశాయి.

అయితే, మావో వారసత్వాన్ని ఆయన చేసిన కృషి ద్వారా మాత్రమే అర్థం చేసుకోలేం. ఆయన హయాంలో ముఖ్యంగా ఆయన నాయకత్వంలోని చివరి భాగంలో జరిగిన లోపాలు, ఉల్లంఘనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. 1966-76 మధ్య జరిగిన సాంస్కృతిక విప్లవం మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) చేసిన అతి పెద్ద తప్పిదం. దాంతోపాటు మావో తన జీవితపు చివరి సంవత్సరాల్లో మరికొన్ని ముఖ్యమైన రాజకీయ, సైద్ధాంతిక తప్పిదాలు చేశాడు. వాటిలో **"మూడు ప్రపంచాల" సిద్ధాంతం,** మరీ ముఖ్యంగా ఆయన సోవియట్ యూనియన్‌ను **"సోషల్ సామ్రాజ్యవాదపు"** రూపాల్లో ఒకటిగా అభివర్ణించడం ఒకటి. ఈ రకమైన వైఖరులు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన చీలికలకు దారితీశాయి. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య ఐక్యతను తీవ్రంగా దెబ్బతీశాయి.

ఈ విస్తృత అంచనాలకు లోబడే నేను ఆయన కృషిలో నేటికీ ప్రాసంగికత గల కొన్ని అంశాల గురించి చెబుతాను.

వర్గాలు, ఐక్య సంఘటన గురించిన విశ్లేషణ

చైనా సమాజంలో విభిన్న వర్గాలు, వర్గ శక్తులను నిర్దిష్టంగా విశ్లేషించడానికి మావో అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. ఆయన రాసిన **"చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ (1926)"**, **"హ్యూనాన్‌లో రైతాంగ ఉద్యమంపై చేసిన అధ్యయనంపై నివేదిక (1927)"** అన్న రచనలు ఈ విషయంలో ముఖ్యమైనవి. మొదటి రచనలో ఆయన చైనా సమాజంలో వివిధ వర్గాలను విశ్లేషించాడు. వారి భిన్న ప్రయోజనాలను గుర్తించాడు. విప్లవంలో వారు నిర్వహించగల పాత్రలను అంచనా వేశాడు. ఇది నమ్మదగ్గ మిత్రులెవరో, ముఖ్యమైన విప్లవ శక్తులు ఏవో గుర్తించాల్సిన ప్రాముఖ్యతను తెలియజేసింది. అదేవిధంగా, రెండో రచన రైతాంగపు విప్లవ సామర్థ్యాన్ని వివరించింది. చైనా విప్లవంలో రైతాంగ విప్లవం నిర్ణయాత్మక పాత్ర వహిస్తుందని చెప్పింది.

ఈ విశ్లేషణపై ఆధారపడి, మావో ఐక్య సంఘటన వ్యూహాన్ని అభివృద్ధి చేశాడు. కార్మికవర్గం, దాని పార్టీకి సంబంధించిన స్వతంత్ర రాజకీయ, నిర్మాణ బలాన్ని నిలుపు కుంటూనే ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా విస్తారమైన పొత్తులు ఎలా పెట్టుకోవాలో ఈ వ్యూహం వివరిస్తుంది.

వైరుధ్యాల సిద్ధాంతం, గతితర్క విశ్లేషణ

గతితర్కంపై మావో చేసిన రచనలు ముఖ్యంగా 1937లో ఆయన రాసిన **"వైరుధ్యాలు"** అన్న రచన మార్క్సిస్టు గతితార్కిక భౌతిక వాదాన్ని విప్లవ ఆచరణకు జోడించింది. వైరుధ్యం అనేది అభివృద్ధికి అతి ప్రధానమైన అంశం అనీ, ఒక నిర్ధిష్ట పరిస్థితిలో విభిన్న వైరుధ్యాలన్నీ ఒకే ప్రాముఖ్యత కలిగి ఉండవనీ ఆయన చెప్పాడు.

మరీ ముఖ్యంగా, ఆయన ప్రధాన, ద్వితీయ వైరుధ్యాలకు మధ్య, ఒక వైరుధ్యంలో ప్రధాన, ద్వితీయ అంశాల మధ్య తేడాను వివరించాడు. పరిస్థితులు మారిపోతే ప్రధాన వైరుధ్యంలో మార్పు రావచ్చునని పేర్కొన్నాడు. పరిస్థితులు మారిపోయినప్పటికీ సాధారణ సూత్రాలను యాంత్రికంగా వర్తింపజేసే దానికి బదులు నిర్ధిష్ట పరిస్థితులను నిర్ధిష్టంగా విశ్లేషించడం ముఖ్యం అన్న అంశాన్ని ఈ వైఖరి నొక్కి చెబుతోంది.

అయితే, ఆయన వైరుధ్యాలను సైద్ధాంతీకరించినప్పుడు చెప్పిన ఒక అంశం – అంటే కొన్ని పరిస్థితుల్లో మిత్ర వైరుధ్యాలు శత్రు వైరుధ్యాలుగా మారవచ్చు, శత్రు వైరుధ్యాలు, మళ్లీ మిత్ర వైరుధ్యాలుగా మారవచ్చు అన్నది – లోపభూయిష్టమైనదిగానూ, ప్రమాదకరంగానూ నిరూపించబడింది. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రజల మధ్యనున్న మిత్ర వైరుధ్యాలనూ, పార్టీ లోపల భిన్నాభిప్రాయాలనూ శత్రు వైరుధ్యాలుగా మారాయని చెప్పారు. దానివల్ల తీవ్రమైన, వినాశకరమైన పర్యవసానాలు ఏర్పడ్డాయి.

ఈ సూత్రీకరణ పర్యవసానాలు చైనా వెలుపల కూడా కనిపించాయి. మన దేశంలో నక్సలైట్ గ్రూపులు దాన్ని యాంత్రికంగా వర్తింపజేశారు. విప్లవ సంస్థల మధ్య విబేధాలను శత్రు వైరుధ్యాలుగా పరిగణించారు. దాంతో ఒకరినొకరు శత్రువులుగా ముద్రవేసుకున్నారు.

సిద్ధాంతం, ఆచరణల ఐక్యత

సిద్ధాంతం, ఆచరణల మధ్య సంబంధానికి మావో గొప్ప ప్రాముఖ్యత ఇచ్చారు. **"ఆచరణ గురించి" (1937), "మన అధ్యయనాన్ని సంస్కరించుకుందాం" (1941)** అన్న రచనల్లో ఆయన సిద్ధాంతం, ఆచరణల ప్రాముఖ్యతను చక్కగా వివరించారు. జ్ఞానం అనేది ఆచరణతో

> **"గతితర్కంపై మావో చేసిన రచనలు ముఖ్యంగా 1937లో ఆయన రాసిన "వైరుధ్యాలు" అన్న రచన మార్క్సిస్టు గతితార్కిక భౌతిక వాదాన్ని విప్లవ ఆచరణకు జోడించింది. వైరుధ్యం అనేది అభివృద్ధికి అతి ప్రధానమైన అంశం అనీ, ఒక నిర్ధిష్ట పరిస్థితిలో విభిన్న వైరుధ్యాలన్నీ ఒకే ప్రాముఖ్యత కలిగి ఉండవనీ ఆయన చెప్పాడు. మరీ ముఖ్యంగా, ఆయన ప్రధాన, ద్వితీయ వైరుధ్యాలకు మధ్య, ఒక వైరుధ్యంలో ప్రధాన, ద్వితీయ అంశాల మధ్య తేడాను వివరించాడు."**



మావో జెడాంగ్

సంబంధం లేకుండా ఏర్పడదని ఆయన వాదించాడు. విప్లవ సిద్ధాంతం అనుభవం నుండే ఆవిర్భవించి తిరిగి ఆచరణకు దారితీయాలి. ఆచరణలోనే అది పరీక్షించబడి, అభివృద్ధి చెందాలి. రెండవ రచన ఈ సూత్రాన్ని పార్టీ పనికి వర్తింపజేస్తుంది. చైనా వాస్తవ పరిస్థితుల అధ్యయనం, విప్లవ ఆచరణల నుండి సైద్ధాంతిక జ్ఞాన సముపార్జనను వేరుచేయడాన్ని ఇది వ్యతిరేకిస్తుంది.

పిడివాదం, అనుభవవాదం (ఎంపిరిసిజం) రెంటినీ ఎదుర్కొనడంలో ఈ పద్ధతి ముఖ్యంగా ప్రాముఖ్యత వహిస్తుంది. పిడివాదం అంటే స్థిరపడి ఉన్న సూత్రాలను నిర్ధిష్ట పరిస్థితులను పరిశీలించకుండా వర్తింపజేయడం. అనుభవవాదం అంటే సైద్ధాంతిక సాధారణ సూత్రాలను వదిలిపెట్టి తక్షణ అనుభవం మీద ఆధారపడ్డం.

ప్రజా పంథా

వీటితో దగ్గరి సంబంధం గల మరో సూత్రీకరణ ప్రజా పంథా. దీన్ని **"ప్రజల నుండి ప్రజల వద్దకు"** అనే ఒక నినాదం కింద సంగ్రహపరిచాడు. పార్టీ ప్రజల వద్దకు వెళ్లాలి, వారి అనుభవాలను, డిమాండ్లను, ఆలోచనలను తెలుసుకోవాలి, మార్క్సిస్టు విశ్లేషణ ద్వారా వాటిని సంశ్లేషణ (సింథసైజ్) చేయాలి, వాటిని రాజకీయ కార్యక్రమాలుగా, కార్యాచరణ రూపాలుగా తయారు చేయాలి. ఆ విధానాలను తిరిగి ప్రజల వద్దకు తీసుకు తీసుకుపోయి, అమలు చేసి ఆచరణ ద్వారా పరీక్షించాలి, ఆ అనుభవాన్ని మళ్లీ తీసుకుని ఈ క్రమంలో పెట్టాలి.

మావో తను రాసిన **"నాయకత్వానికి సంబంధించిన కొన్ని సమస్యలు" (1943), "సంకీర్ణ ప్రభుత్వం గురించి" (1945)** అన్న రచనల్లో ఈ ఆలోచనలను విపులీకరించాడు. మొదటి రచన, నాయకత్వ పద్ధతి గురించి "ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే ప్రామాణిక సూత్రీకరణ చేసింది. ప్రజల్లో వెదజల్లబడి ఉన్న ఆలోచనలను పార్టీ సేకరిస్తుంది, మార్క్సిస్టు విశ్లేషణ ద్వారా వాటిని సంశ్లేషిస్తుంది. వాటిని తిరిగి రాజకీయ విధానం రూపంలో ప్రజలకు చేరుస్తుంది. రెండవ రచనలో ఆయన పరిపాలనా పరమైన, సైనిక పరమైన చర్యలకు బదులు ప్రజాబాహుళ్యం ద్వారా కార్యాచరణకు పూనుకోవాలనీ, ప్రజలను సమీకరించడంపై ఆధారపడాలనీ చెప్పాడు.

ఆ విధంగా ప్రజాపంథా అనేది విప్లవ నాయకత్వాన్ని ప్రజల చురుకైన పాత్రతో అనుసంధానిస్తుంది. పార్టీ ప్రజలనుండి విడిపోకుండా చూస్తుంది. అంతేకాకుండా అది మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రజల అనుభవాలు, పోరాటాలతో సమైక్య పరుస్తుంది.

సరైన రాజకీయ పంథా కోసం పోరాటం: మితవాద, "వామపక్ష" అతివాద పెడధోరణులు

ప్రజాపంథా సమస్య, సరైన రాజకీయ పంథాకోసం జరిగే విస్తృత పోరాటంతో

> ❝ ఒక విప్లవ కమ్యూనిస్టు పార్టీకి సరైన రాజకీయ పంథాను కనుగొనడం అనేది నిరంతర సవాలుగా ఉంటుంది. వర్గ పోరాట పరిస్థితుల్లో వచ్చే మార్పులు అన్యవర్గ ఒత్తిళ్లవల్ల మితవాద, "వామపక్ష" అతివాద పెడధోరణులకు దారితీయగలవు. అందువల్ల పార్టీ అంతర్గత చర్చలు, నిర్ధిష్ట అధ్యయనం, ఆచరణలో నిరంతరం పరీక్షించుకోవడం ద్వారా సరైన పంథాను అభివృద్ధి చేయాలి. కీలకమైన ఘట్టాల్లో చైనా కమ్యూనిస్టు పార్టీ లో మితవాద అవకాశవాదం, "వామపక్ష" పిడివాదాలను అధిగమించడంలో మావో కృష్టి చాలా సహాయ పడింది. ❞

సన్నిహిత సంబంధం కలిగి ఉంది. ఒక విప్లవ కమ్యూనిస్టు పార్టీకి సరైన రాజకీయ పంథాను కనుగొనడం అనేది నిరంతర సవాలుగా ఉంటుంది. వర్గ పోరాట పరిస్థితుల్లో వచ్చే మార్పులు అన్యవర్గ ఒత్తిళ్లవల్ల మితవాద, "వామపక్ష" అతివాద పెడధోరణులకు దారితీయగలవు. అందువల్ల పార్టీ అంతర్గత చర్చలు, నిర్ధిష్ట అధ్యయనం, ఆచరణలో నిరంతరం పరీక్షించుకోవడం ద్వారా సరైన పంథాను అభివృద్ధి చేయాలి. కీలకమైన ఘట్టాల్లో చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి)లో మితవాద అవకాశవాదం, "వామపక్ష" పిడివాదాలను అధిగమించడంలో మావో కృష్టి చాలా సహాయ పడింది.

నిజానికి, 1949కి ముందు సిపిసి చరిత్రలో ఈ పెడధోరణులకు వ్యతిరేకంగా నిరంతరాయంగా జరిగిన పోరాటమే ఒక గణనీయమైన అంశంగా ఉంది. కొమింటాంగ్ (కెఎంటి)తో తొలి ఐక్య సంఘటన కట్టినప్పుడు చెన్ దుసియు నాయకత్వంలో మితవాద పెడధోరణి బయలుదేరింది. దీనివల్ల కొమింగ్ టాంగ్‌పై అధికంగా ఆధారపడ్డం, కార్మికుల్లోనూ, రైతాంగంలోనూ స్వతంత్ర నిర్మాణపనిని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 1927లో కమ్యూనిస్టులపై కొమింటాంగ్ సాగించిన నిర్బంధకాండ ఈ బలహీనతలను బయట పెట్టింది.

1927 తరువాత, పార్టీ "వామపక్ష" పెడధోరణివైపు మళ్లింది. 1930లో లి లిసాన్ అనుసరించిన పంథా తక్షణ విప్లవ అవకాశాలను అతిగా అంచనా వేసింది. పట్టణాల్లో పెద్ద ఎత్తున తిరుగుబాట్లు చేసి నగరాలను శీఘ్రంగా స్వాధీనం చేసుకోవాలని ఇది చెప్పింది. మావో దానికి భిన్నంగా, సుధీర్ఘ పోరాటాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విప్లవ బలాన్ని నిర్మించుకోవాలన్న వ్యూహాన్ని రూపొందించాడు.

దీని తరువాత, 1931-34లో వాంగ్ మింగ్, "28 మంది బోల్షివిక్కుల" నాయకత్వంలో మరింత తీవ్రమైన "వామపక్ష" పెడధోరణి బయలు దేరింది. వాళ్లు మావో అనుసరించిన గ్రామీణ వ్యూహాన్ని విమర్శించారు. సాంప్రదాయ సైనిక పద్ధతులపై ఎక్కువగా ఆధారపడ్డారు. అయిదవ ముట్టడి క్యాంపెయిన్ సందర్భంగా వారి పద్ధతులు పెద్ద ఓటములకు దారితీశాయి. దాంతో ఎర్ర సైన్యం జియాంగ్సి స్థావరాన్ని వదిలిపెట్టి లాంగ్ మార్చ్ నిర్వహించాల్సి వచ్చింది. 1935లో జరిగిన జున్యి మహాసభలో చైనా నిర్ధిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని వర్తించాలి అని మావో ప్రవేశపెట్టిన వ్యూహాత్మక సూత్రంపై ఆధారపడి పార్టీని తిరిగి సరైన మార్గంలో పెట్టడం జరిగింది.

తదుపరి, జపాన్-వ్యతిరేక యుద్ధం సందర్భంగా మావో కొమింగ్ టాంగ్ కి దాసోహం అనడాన్నీ మరోవైపు పిడివాద వేర్పాటును..రెంటినీ వ్యతిరేకించాడు. ఆయన **"పోరాటంతో ఐక్యత"** అన్న సూత్రాన్ని ప్రతిపాదించాడు. సిపిసి స్వతంత్ర నిర్మాణ, రాజకీయ కార్యక్రమాన్ని, ప్రజా పునాదిని కాపాడుకుంటూనే జపాన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సహకరించుకోవాలని ఆయన ప్రతిపాదించాడు. భూ సంస్కరణల కార్యక్రమ సమయంలోనూ, 1945 అంతర్యుద్ధమప్పుడూ పార్టీ మితవాద, "వామపక్ష" తిప్పిదాలను సరిచేసుకుంటూ వచ్చింది. అంటే ఒకవైపు భూస్వాములు, ధనిక రైతులతో అధికంగా రాజీ పడకుండా, మరోవైపు మధ్యతరగతి రైతులపై విచక్షణా రహితంగా దాడులు చేయకుండా వ్యవహరించింది. సూత్రాలను యాంత్రికంగా వర్తింపజేయడం కాకుండా నిర్ధిష్ట పరిస్థితుల అధ్యయనం ద్వారా వర్గాల మధ్య తేడాలను గుర్తించాలని మావో గట్టిగా చెప్పాడు.

దిద్దుబాటు ద్వారా విప్లవ పార్టీని బలోపేతం చేసుకోవడం

ఈ పెడధోరణులకు వ్యతిరేకంగా జరిగే పోరాటం పార్టీలో దిద్దుబాటు ఆవశ్యకతను తెలియజేస్తోంది. 1949 విప్లవానికి ముందు చైనా కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలను సరిదిద్దుకోడానికీ, క్రమశిక్షణ బలపరుచుకోడానికీ, విప్లవ పోరాటాన్ని నడిపే తన సామర్థ్యాన్ని పెంచుకోడానికీ అనేక క్యాంపెయిన్లు చేపట్టింది.

దీనికి ఒక ముందు సూచన గుటియాన్ మహాసభ (1929). ఇందులో సైనికతత్వం, వ్యష్టితత్వం, అధికారదురహంకారం, సరైన రాజకీయ విద్య లేమి మొదలైన పెడధోరణులపై దిద్దుబాటుకు శ్రీకారం చుట్టారు. సైన్యం పార్టీ రాజకీయ నాయకత్వం కింద ఉండాలనీ, అది విప్లవ లక్ష్యాలకోసం పనిచేయాలనీ నిర్ణయించారు.

అయితే, 1949కి ముందు వచ్చిన అనుభవాలన్నిటిలోకీ ముఖ్యమైనది, యానాన్ దిద్దుబాటు ఉద్యమం (1942-44). ఇది మూడు ప్రధాన సమస్యలపై కేంద్రీకరించింది: మొదటిది, స్వీయమానసిక ధోరణి. పిడివాదం (డాగ్మాటిజం), నిర్ధిష్ట పరిస్థితుల నుండి దూరం కావడం కూడా దీనిలోకి వస్తాయి. రెండవది, వేర్పాటువాదం. ముఠాతత్వం, సమిష్టి పని విధానం లేకపోవడం వీటి కిందకు వస్తాయి. మూడవది, మూసపోత పార్టీ రచనలు, నియతవాదం (ఫార్మలిజం). అధ్యయనం, పరిశీలన, విమర్శ - ఆత్మవిమర్శ ద్వారా మార్క్సిజం - లెనినిజాన్ని చైనా నిర్ధిష్ట పరిస్థితులకు వర్తింప జేసి, పార్టీ నాయకత్వాన్నీ, ప్రజలతో సంబంధాలనూ పటిష్టం చేయాలని ఈ దిద్దుబాటు ఉద్యమం చెప్పింది.

ఈ క్రమంలో భాగంగా కార్యకర్తలు మార్క్సిజం-లెనినిజం, విప్లవ చరిత్ర, పార్టీ అనుభవాలను అధ్యయనం చేశారు. వాటి వెలుగులో వారి లోపాలు, తప్పిదాలను విమర్శనాపూర్వకంగా పరిశీలించుకున్నారు. మావో రాసిన **'మన అధ్యయనాన్ని సరిదిద్దుకుందాం, పార్టీ వని పద్ధతిని మెరుగుపరుచుకుందాం, మూసపోత రచనా పద్ధతులను వ్యతిరేకించండి, పార్టీ పనిపద్ధతినీ, ఆలోచననూ మెరుగుపరుచుకోవాలి, ఉదారవాదాన్ని ఎదుర్కోవాలి,'** వంటి రచనలు ఈ దిద్దుబాటు క్రమానికి ముఖ్యమైన సైద్ధాంతిక, ప్రత్యక్ష మార్గదర్శకత్వాన్ని సమకూర్చాయి.

ప్రత్యక్ష పనిలో దిద్దుబాటు కొనసాగింది. భూ సంస్కరణలు, 1946-48 మధ్య మళ్లీ

జరిగిన ఆంతరంగిక పోరాటం సందర్భంగా ప్రత్యక్ష పనితో దిద్దుబాటు క్రమాన్ని జతచేయడం జరిగింది. క్యాడర్‌లో నిరంకు శాధికార పద్ధతి, కమాండిజం, అవినీతి, బల హీనమైన ప్రజా సంబంధాలు, భూ సంస్కరణల అమలులో తప్పిదాలు వంటి వాటిపై విమర్శించడం జరిగింది. స్థానిక పరిస్థితులను పరిశీలించడం, రైతులనుండి నేర్చుకోవడం, ఆచరణ ద్వారా విధానాలను సరిదిద్దుకోవడం వంటి వాటిమీద కేంద్రీకరణ జరిగింది.

ఈ మొత్తాన్ని కలిపి చూస్తే, రాజకీయంగా ఐక్యంగా ఉన్న, సైద్ధాంతికంగా శిక్షణ పొందిన, నిర్మాణపరంగా క్రమశిక్షణతో ఉన్న, సుదీర్ఘకాలం పాటు విప్లవోద్యమాన్ని నడిపే సామర్థ్యం గల ఒక పార్టీని అభివృద్ధి చేయడానికి ఈ అనుభవాలు తోడ్పడ్డాయి.

సోషలిస్టు నిర్మాణం

విప్లవ విజయంతో చైర్మన్ మావో నేతృత్వంలో పీపుల్స్ డెమోక్రటిక్ ప్రభుత్వం క్రింద సోషలిస్టు నిర్మాణం అనే మహత్తర కార్యాన్ని ఎత్తుకోవడం జరిగింది. 1949 నుండి 1978 వరకు చైనా ఒక పేద, యుద్ధంతో ధ్వంసమైన వ్యవసాయ దేశం స్థాయి నుండి గణనీయమైన పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక వసతులుగల దేశంగా పరివర్తన చెందింది. ప్రభత్వ ప్రణాళిక, భూ నంస్కరణలు, సమిష్టిఆర్థిక కార్యకలాపాల ద్వారా దేశం ఉక్కు బొగ్గు, విద్యుత్, యంత్రాలు, రసాయనాలు, రవాణా, నీటి పారుదల ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో పెద్ద ముందడుగు వేసింది. వైద్యం, విద్య, సామాజిక సంక్షేమంలో గణనీయమైన పురోభివృద్ధి సాధించింది. సగటు ఆయు:ప్రమాణం 1950లో 36 సంవత్సరాల నుండి 1970లలో 64-66 ఏళ్లకు పెరిగింది. అక్షరాశ్యత గణనీయంగా పెరిగింది. గ్రామీణ ఆరోగ్య పరిరక్షణ, వాక్సినేషన్, రోగ నివారణ వైద్యాన్ని విస్తరించారు. మహిళల న్యాయపరమైన, సామాజిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. వీటితోపాటు చైనా ముఖ్యమైన శాస్త్ర-సాంకేతిక సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంది. ఆర్థిక స్వావలంబన పెంచుకుంది.

ఈ కాలంలో పునాదులు వేయకుండా తరువాతి కాలంలో చైనా శీఘ్రంగా, విస్తృతంగా అభివృద్ధి చెందడం సాధ్యం కాకపోయి వుండేను లేదా సిపిసి చేపట్టిన ఆర్థిక సంస్కరణలు మంచి ఫలితాలు ఇచ్చి వుండేను కాదు.

అయినప్పటికీ, ఈ విజయాలతోపాటు కొన్ని తీవ్రమైన లోపాలు కూడా జరిగాయి. పెద్ద ముందడుగు (1958-60) కార్యక్రమం

> **“ విప్లవ విజయంతో చైర్మన్ మావో నేతృత్వంలో పీపుల్స్ డెమోక్రటిక్ ప్రభుత్వం క్రింద సోషలిస్టు నిర్మాణం అనే మహత్తర కార్యాన్ని ఎత్తుకోవడం జరిగింది. 1949 నుండి 1978 వరకు చైనా ఒక పేద, యుద్ధంతో ధ్వంసమైన వ్యవసాయ దేశం స్థాయి నుండి గణనీయమైన పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక వసతులుగల దేశంగా పరివర్తన చెందింది. ఈ కాలంలో పునాదులు వేయకుండా తరువాతి కాలంలో చైనా శీఘ్రంగా, విస్తృతంగా అభివృద్ధి చెందడం సాధ్యం కాకపోయి వుండేను. ”**



1949 అక్టోబర్ 1న చైనా ప్రజా రిపబ్లిక్ (పిఆర్‌సి) ఏర్పడినట్లు ప్రకటిస్తున్న మావో జెడాంగ్

వినాశనకరమైన ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీసింది. సాంస్కృతిక విప్లవం (1966-76) విద్య, ఉత్పత్తి, పరిపాలన, పార్టీ, ప్రభుత్వ పనిలో తీవ్రమైన అపభ్రంశాలకు దారితీసింది. ఈ రెండు వినాశకరమైన ఘటనలు జరగకుండా ఉన్నా లేక వాటి కాలమూ, ప్రభావమూ తక్కువగా ఉన్నా సోషలిస్టు నిర్మాణ అభివృద్ధి ఇప్పటికన్నా ఎక్కువగా జరిగి ఉండేను.

సంస్కరణల తరువాత చైనా అభివృద్ధి

1978కి ముందు వేయబడిన పునాదులు చైనా సోషలిస్టు పరివర్తనకు ముఖ్యమైన స్తంభాలుగా నిలిచాయి. 2025 నాటికి చైనా జిడిపి 18.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకున్నది. తలసరి జిడిపి 13,300 డాలర్లకు చేరుకున్నది. ఆయు: ప్రమాణం 78 సంవత్సరాలకు చేరింది. మానవాభివృద్ధి సూచీలో దేశం సుమారు 0.797 పాయింట్లు (అద్యధికం 1 పాయింటు) సాధించింది. కటిక పేదరికం గణనీయంగా తగ్గింది. చైనా నేడు ప్రపంచంలో అమెరికా తరువాత రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. అనేక రంగాల్లోనూ, అనేక ఆధునిక సాంకేతికతల్లోనూ ప్రపంచ అగ్రగామిగా లేక ప్రధాన పోటీదారుగా మారింది.

ముగింపు

మొతం మీద చూస్తే, చైనా విప్లవంలోనూ తదుపరి సోషలిస్టు నిర్మాణ కాలంలోనూ మావో మార్క్సిజం అభివృద్ధిలో చాలా ముఖ్యమైన సైద్ధాంతిక, ఆచరణాత్మక కృషి చేశారు. ఈ కృషిలో అనేకం చైనా దేశం బయట కూడా ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా ప్రధానంగా వ్యవసాయ, గతంలో వలస, అర్ధవలస రాజ్యాలుగా ఉన్న దేశాల్లో విప్లవోద్యమ నిర్మాణంలో వీటి ప్రాముఖ్యత గణనీయంగా ఉంది. *

ఈ మాసం ప్రత్యేకం

భారతీయ పౌరసత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న 'సర్'



రచయిత రాజకీయ ఆర్థికవేత్త, 'ది క్రూకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా' పుస్తక రచయిత.

పరకాల ప్రభాకర్

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియ నేపథ్యంలో, భారత దేశంలో రెండు సెక్షన్ల ప్రజలు ఏర్పడనున్నారు: ఒకటి ఓటు హక్కు ఉన్నవారు, మరొకరు ఓటు హక్కు లేనివారు.

దేశంలోని ప్రస్తుత ఓటర్ల జాబితా నుండి ఇప్పటికే దాదాపు 13 కోట్ల పేర్లు తొలగించబడ్డాయని అంచనా. ఈ ప్రక్రియ పూర్తయ్యే సమయానికి, తొలగించబడిన వారి జాబితాలో మరో కోటి మంది చేరే అవకాశం ఉంది. ఇప్పటికే, సుమారు 15 కోట్ల మంది ఉన్న డీ-నోటిఫైడ్ (గతంలో నేరస్తుల జాబితాలో ఉన్నట్లు పరిగణించబడినవి), సంచార, పాక్షిక-సంచార తెగల ప్రజలలో దాదాపు 98 శాతం మంది పేర్లు ఓటర్ల జాబితాలో లేవు. మన రాజకీయ వ్యవస్థ వారి పట్ల ఉదాసీనంగా ఉంది. ఇప్పుడు 'సర్' ప్రక్రియ ఆ బహిష్కృత జనాభాకు మరో 14 కోట్లను జత చేయనుంది. వాస్తవానికి, 'సర్' ద్వారా తొలగించబడిన ఈ 14 కోట్ల మందిలో కొందరు నిజంగానే అందుబాటులో లేకపోవడం, మరణించడం, పేర్లు పునరావృతం కావడం లేదా ఇతర కారణాలు ఉండవచ్చు. ఒకవేళ ప్రజలు విదేశాలకు వలస వెళ్తే తప్ప, వారి నివాస మార్పు వల్ల దేశంలోని మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గదు. దేశం లోపలే ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మారడం వల్ల దేశ మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గకూడదు.

ఈ ప్రక్రియ మన రాజకీయ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఓటు హక్కు లేనివారు దేశ రాజకీయ వ్యవస్థకు దూరమవుతారు. వారు దేశ రాజకీయ ప్రక్రియలో పాల్గొనలేరు. వారి గొంతుక వినిపించదు. వారి ప్రాధాన్యతలు, ఆశయాలు, ఆందోళనలు, భయాలకు ఎటువంటి ప్రాముఖ్యత ఉండదు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే రాజకీయ పార్టీలు లేదా వ్యక్తులు వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. దేశ పాలన తీరుపై వారి అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలు, అంచనాలు, తీర్పులకు, మన పాలన శాసన వ్యవస్థలలో ఎన్నికైన పదవులను అధిష్టించిన వారిపై ఎటువంటి ప్రభావం ఉండదు.

భారీ స్థాయిలో తొలగింపులు

సబర్ ఇన్‌స్టిట్యూట్ (Sabar Institute) సంచలనాత్మక విషయాలను వెల్లడించింది. ఉదాహరణకు, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా నుండి తొలగించిన ఓటర్ల సంఖ్య, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో 2023 లో 1,32,024 ఓట్లు నమోదయ్యాయి. కానీ, 'సర్' ప్రక్రియ ద్వారా ఆ నియోజకవర్గ ఓటర్ల జాబితా నుండి ఏకంగా 1,47,799 మంది ఓటర్ల పేర్లను తొలగించారు. అదే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మరో అసెంబ్లీ నియోజకవర్గమైన యాకుత్‌పురాలో 'సర్' ప్రక్రియ ద్వారా 1,54,982 మంది ఓటర్ల పేర్లు తొలగించారు. అక్కడ 2023 ఎన్నికల్లో నమోదైన ఓట్ల సంఖ్య 1,40,434 మాత్రమే. మరో పరిశీలనలో తేలిన విషయం ఏమిటంటే ఢిల్లీలోని చాందినీ చౌక్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 33లో మొత్తం 909 ఓట్లకు గాను 908 ఓట్లు తొలగించారు.

కొన్ని రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లో 2.89 కోట్లు, పశ్చిమ బెంగాల్‌లో 93 లక్షలు, తమిళనాడులో 97 లక్షలు, బీహార్‌లో 65 లక్షలు, కేరళలో 24 లక్షలు, మధ్యప్రదేశ్‌లో 45 లక్షలు, రాజస్థాన్‌లో 44 లక్షలు, గుజరాత్‌లో 77 లక్షలు, కర్ణాటకలో 1.07 కోట్లు, మహారాష్ట్రలో 2.06 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 44 లక్షలు, తెలంగాణలో 73 లక్షలు తొలగించారు. హర్యానాలో దాదాపు 34 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఇది ఆ రాష్ట్ర ప్రస్తుత ఓటర్ల సంఖ్యలో 16.38 శాతానికి సమానం. జార్ఖండ్‌లో దాదాపు 16.5 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారు. గోవా, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరిలలో వరుసగా 11.78 శాతం, 22.32 శాతం, 11.67 శాతం ఓటర్ల పేర్లు తొలగించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో 19 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఢిల్లీ ఓటర్ల జాబితా 35.89 శాతం (47.5 లక్షల పేర్లు తొలగించారు). అలాగే చండీగఢ్ జాబితాలో 31.84 శాతం తగ్గించారు.

ఈ గణాంకాలు కేవలం కొన్ని రాష్ట్రాలకు సంబంధించినవి మాత్రమే. నాగాలాండ్, త్రిపుర నుండి ఇంకా సమాచారం రావాల్సి ఉంది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా సర్ ప్రక్రియ ప్రారంభించలేదు.

అయితే, కొన్ని మీడియా సంస్థలు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) వర్గాలను ఉటంకిస్తూ భిన్నమైన, తప్పుదోవ పట్టించే గణాంకాలను ప్రచురిస్తున్నాయి. ఆ గణాంకాలు, ఓటర్ల జాబితాలో కొత్తగా చేరిన వారిని పరిగణనలోకి తీసుకున్న తర్వాత వచ్చిన 'నికర' (నెట్) సంఖ్యలు మాత్రమే. అవి తొలగించబడిన మొత్తం పేర్ల సంఖ్యను ప్రస్తావించడం లేదు. భారీ స్థాయిలో జరిగిన పేర్ల తొలగింపు వాస్తవాన్ని కప్పిపుచ్చి, పరిస్థితి తీవ్రత తక్కువగా ఉన్నట్లు చూపించే ఉద్దేశంతోనే ఆ సంఖ్యలను వెల్లడిస్తున్నారు.

దీనికి కొంత సమయం పట్టినప్పటికీ 'సర్' ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాల నుండి భారీ

స్థాయిలో పేర్లు తొలగించబడుతున్న వాస్తవం ఇప్పుడు దేశానికి నెమ్మదిగా అర్థమవుతోంది.

"సర్' ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు భారత దేశంలో 11.8 కోట్ల మందిని తొలగించారు. ఇది బ్రెజిల్‌లో 2022లో జరిగిన ఎన్నికల ఓటింగ్ శాతం కంటే ఎక్కువ" అనే శీర్షికతో ఒక ప్రముఖ దినపత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ తొలగింపుల తీవ్రతను చూపించడానికి.. భారతదేశం, చైనా కాకుండా, 10 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశాలు కేవలం 14 మాత్రమే ఉన్నాయని ఆ కథనంలో పేర్కొన్నారు. 'సర్' తొలగింపుల స్థాయి, ప్రపంచం నుండి కొన్ని దేశాలను తొలగించడంతో సమానమని పాఠకులు ఊహించుకోవాలని అది కోరుతోంది.

ప్రతి దశలోనూ తొలగింపుల శాతం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కేవలం బీహార్‌లో మాత్రమే అమలు చేసిన మొదటి దశలో, తొలగింపు సుమారు 8 శాతంగా ఉంది. రెండవ దశలో ఇది 13 శాతానికి పైగా ఉండగా ప్రస్తుత, మూడవ దశలో ఇప్పటివరకు 15 శాతానికి పైగా ఉంది.

అనేక పరిశోధనాత్మక అధ్యయనాల ద్వారా, మరణించిన వారిగా జాబితాలో చేర్చబడిన చాలా మంది వాస్తవానికి బతికే ఉన్నారని ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. బీహార్ సవరణ జరిగిన వెంటనే వారిలో కొందరిని సుప్రీంకోర్టులో ప్రవేశపెట్టారు. తమిళనాడులో జరిగిన తొలగింపులపై 'ది హిందూ' పత్రిక ఒక అధ్యయనం నిర్వహించింది. మరణించిన వారిగా జాబితాలో ఉన్నవారి వయస్సు అధికారిక గణాంకాలలోని మరణాల ధోరణులకు అనుగుణంగా లేదని తేలింది. పశ్చిమ బెంగాల్‌లో మరణించిన, వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన లేదా గైర్హాజరైన వారిగా జాబితాలో తొలగించబడిన చాలా మంది ఓటర్లు స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్దకు పోటెత్తారు, నిరసన తెలిపారు.

బీహార్‌లో ప్రక్షాళన చేయవలసి ఉన్న ఓటర్ల జాబితాలో 1.32 కోట్ల నకిలీ చిరు నామాలు ఉన్నాయి. ఆ రాష్ట్రంలోని బరచట్టి అసెంబ్లీ నియోజకవర్గంలో 877 మంది ఓటర్లు ఒక గ్రామంలోని ఒకే చిరునామాలో నివసిస్తున్నట్లు చూపబడింది. పిప్రా నియోజకవర్గంలోని గలింపూర్ గ్రామంలో 509 మంది ఓటర్లు ఒకే చిరునామాలో నమోదు చేయబడ్డారు. ఆ చిరునామా తప్పు మాత్రమే కాదు, అసలు ఉనికిలోనే లేదు. రాష్ట్రంలో ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. మొత్తం 243 నియోజక

"బీహార్‌లో ప్రక్షాళన చేయవలసి ఉన్న ఓటర్ల జాబితాలో 1.32 కోట్ల నకిలీ చిరు నామాలు ఉన్నాయి. ఆ రాష్ట్రంలోని బరచట్టి అసెంబ్లీ నియోజకవర్గంలో 877 మంది ఓటర్లు ఒక గ్రామంలోని ఒకే చిరునామాలో నివసిస్తున్నట్లు చూపబడింది. పిప్రా నియోజకవర్గంలోని గలింపూర్ గ్రామంలో 509 మంది ఓటర్లు ఒకే చిరునామాలో నమోదు చేయబడ్డారు. ఆ చిరునామా తప్ప మాత్రమే కాదు, అసలు ఉనికిలోనే లేదు."



'సర్'కు వ్యతిరేకంగా పార్లమెంటు వద్ద ప్రతిపక్షాల నిరసన ప్రదర్శన

వర్గాలలో, పరిశోధనాత్మక జర్నలిస్టులు 14.35 లక్షల నకిలీ ఓటర్లను కనుగొన్నారు. రాష్ట్రంలో 'సర్' పనితీరు "విజయవంతంగా", "సంతృప్తికరంగా" ఉందని ఈసీఐ పేర్కొన్న తర్వాత ఇదంతా జరిగింది.

చొరబాటుదారులన్న వాదన

చొరబాటుదారులను లేదా విదేశీయులను ఏరివేస్తున్నామన్నది కూడా ఈసీఐ చేస్తున్న బూటకపు వాదన అని తేలింది. బీహార్‌లో అనుమానిత విదేశీయులకు వ్యతిరేకంగా మొత్తం 1,087 అభ్యంతరాలు నమోదయ్యాయి. వీటిలో కేవలం 390 మాత్రమే నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు తేలి, పరిశీలన కోసం స్వీకరించబడ్డాయి. ఆ 390 అభ్యంతరాలలో కేవలం 76 మాత్రమే ముస్లింలకు సంబంధించినవి. అలాగే, ఆ 390 అభ్యంతరాలలో 10 సీమాంచల్ ప్రాంతానికి చెందినవి కాగా, వాటిలో 5 మాత్రమే ముస్లింలకు సంబంధించినవి. ఆ 5 మందిలో ఇద్దరు అప్పటికే మరణించారు. చివరకు, కేవలం ముగ్గురు మాత్రమే విదేశీయులుగా గుర్తించబడ్డారు. అయినప్పటికీ, అనేక రాష్ట్రాల్లో వేలాది మంది చొరబాటుదారులను గుర్తించి తొలగించారనీ, వారు ఇప్పుడు పెద్ద సంఖ్యలో దేశం విడిచి పారిపోతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం మాత్రం కొనసాగుతూనే ఉంది.

ఎన్నికల కమిషన్ (ECI) (ఇసిఐ) పేర్కొన్నట్లుగా 'సర్' ప్రధాన లక్ష్యాలలో ఒకటి విదేశీయులను, పౌరులు కాని వారిని జాబితా నుండి తొలగించడం అయితే, ఈ ప్రక్రియను చేపట్టడానికి అత్యంత అర్హమైన రాష్ట్రం అస్సాం అయి ఉండాలి. భారత దేశంలో పౌరసత్వం అనేది అత్యంత వివాదాస్పద అంశంగా మారిన రాష్ట్రం ఏదైనా ఉందంటే, అది అస్సామే. కానీ విచిత్రం ఏమిటంటే, ఆ రాష్ట్రంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) కాకుండా కేవలం 'స్పెషల్ రివిజన్' (ఎస్ఆర్) మాత్రమే చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

❝ అనేక స్వతంత్ర పరిశోధకులు, పరి శోధనా సంస్థలు, మీడియా సంస్థలు, పరిశో ధనాత్మక పాత్రికేయులు ఒక విషయాన్ని నిస్సందేహంగా నిర్ధారించారు. ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు, దళితులు, ఆదివాసులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు, వలస కార్మికుల పేర్లు, గత ఓటర్ల జాబితాలోని వారి శాతానికి అనుపాతంగా కాకుండా, పెద్ద సంఖ్యలో తొలగించబడ్డాయి. ఈ వర్గాలలో, మహిళా ఓటర్ల తొలగింపు ఇంకా ఎక్కువగా ఉంది. ❞

2026 మే 27 నాటి తన తీర్పులో సుప్రీం కోర్టు "విదేశీయులుగా అనుమానించబడే అటువంటి కేసులను, వారి పౌరసత్వంపై నిర్ణయం తీసుకునేందుకు 'పౌరసత్వ చట్టం, 1955' పరిధిలోని సమర్థ అధికారికి నాలుగు వారాల్లోగా నివేదించాలి" అని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ జాబితాను సమర్థ అధికారికి సమర్పించడానికి ఎన్నికల సంఘం అంగీకరించిందని కూడా వార్తలు వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ అయి ఇప్పుడు మూడు నెలలకు పైగా గడిచింది. అయినప్పటికీ, ఎన్నికల సంఘం అటువంటి జాబితా దేనినీ ఇంకా బహిర్గతం చేయలేదు. దీనివల్ల ఓటర్ల జాబితా నుండి విదేశీయులను తొలగించడం 'సర్' లక్ష్యం అనే ఎన్నికల సంఘం వాదనపై తీవ్ర అనుమానాలు తలెత్తుతున్నాయి. 2002లో కూడా ఒకసారి 'సర్' నిర్వహించామని ఎన్నికల సంఘం పేర్కొంది. 2002లో ఓటర్లుగా ఉన్న లక్షలాది మంది ప్రజలు నేటికీ జీవించే ఉన్నారు. అయినప్పటికీ, 2002-03లో తాము ఓటరుగా అర్హులమని నిరూపించుకోవడానికి ఏ ప్రభుత్వ అధికారి దగ్గరకైనా వెళ్లినట్లు దేశంలో ఎవరికీ గుర్తులేదు.

2002లో జరిగిన సవరణ, ఇప్పుడు 'సర్' పేరుతో జరుగుతున్న దానికి పూర్తిగా భిన్నమైనది. ప్రస్తుత సవరణ మార్గదర్శకాలతో పోల్చి చూడ్డం కోసం, కార్యకర్తలు 2002 సవరణ మార్గదర్శకాలను ఇవ్వాలని సమాచార హక్కు చట్టం 'ఆర్‌టిఐ' కింద కోరారు. తమ వద్ద 2002 మార్గదర్శకాల కాపీ లేదని ఈసీఐ తెలిపింది. ఈ విచిత్రమైన స్పందన ఈసీఐ ఉద్దేశాలపై అనుమానాలను మాత్రమే రేకెత్తిస్తోంది.

ఈ విషయంలో ఈసీఐ నుండి తప్పు దోప పట్టించే మరో సమాచారం ఉంది. 2002 లో నిర్వహించిన ప్రక్రియను 'తీవ్ర స్వభావం గల ప్రత్యేక సవరణ' అని పిలిచారు. అది 'ప్రత్యేక తీవ్ర సవరణ' కాదు. అప్పటికి ఉన్న 'మాతృ జాబితా'తో సవరణలను సరిపోల్చి, పారదర్శకంగా సవరణ చేయాలని ఆ ప్రక్రియ ఈసీఐని ఆదేశించింది. ఆ 2002 మార్గదర్శకాలు, గ్రామ సభలు, వార్డు కమిటీ సమావేశాలలో ఈ ప్రక్రియను బహిరంగంగా నిర్వహించాలని నిర్దేశించాయి. 2002 సవరణలో ఏకపక్ష సవరణలకు తావు లేదు.

ఎవరి పేర్లు తొలగించబడ్డాయి?

ఈ తొలగింపులు ప్రధానంగా అధికార యంత్రాంగ నిర్లక్ష్యం వల్ల జరిగాయని, అంతేగానీ నిర్దిష్ట ప్రణాళికతో జరగలేదనీ మొదట్లో కొందరు అనుకున్నారు. అయితే ఆ అభిప్రాయానికి ఇప్పుడు తావు లేకుండా పోయింది. అనేక స్వతంత్ర పరిశోధకులు, పరి శోధనా సంస్థలు, మీడియా సంస్థలు, పరిశో ధనాత్మక పాత్రికేయులు ఒక విషయాన్ని నిస్సందేహంగా నిర్ధారించారు. ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు, దళితులు, ఆదివాసులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు, వలస కార్మికుల పేర్లు, గత ఓటర్ల జాబితాలోని వారి శాతానికి అనుపాతంగా కాకుండా, పెద్ద సంఖ్యలో తొలగించబడ్డాయి. ఈ వర్గాలలో, మహిళా ఓటర్ల తొలగింపు ఇంకా ఎక్కువగా ఉంది.

'సర్' ద్వారా ఓటర్ల పేర్లను తొలగించడం అనేది జనాభా పరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేదు. ఈ రాష్ట్రాలన్నింటిలోనూ, తుది సవరించిన ఓటర్ల జాబితాలోని ఓటర్ల సంఖ్య, ఆయా రాష్ట్రాల్లోని వయోజన జనాభా సంఖ్య కంటే తక్కువగా ఉంది. సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా నడిచే ప్రజాస్వామ్యం మనది కాబట్టి, ఒక రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్ర వయోజన జనాభాకు సమానంగా ఉండాలి. ఉదాహరణకు, ఒక రాష్ట్ర వయోజన జనాభా 100 ఉంటే, ఆదర్శవంతమైన పరిస్థితుల్లో అక్కడ ఓటర్ల సంఖ్య కూడా 100 ఉండాలి. ఆ సంఖ్య 99 లేదా 101 ఉంటే దాన్ని అంగీకరించవచ్చు. కానీ తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 70 లేదా 130 ఉండటం ఆమోదయోగ్యం కాదు. ఉత్తరప్రదేశ్‌లో 'సర్' ప్రక్రియ తర్వాత తేలిన తుది ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్ర వయోజన జనాభా కంటే దాదాపు 3 కోట్లు తక్కువగా ఉంది. బీహార్‌లో ఈ వ్యత్యాసం సుమారు 80 లక్షలుగా ఉంది.

'సర్' ప్రక్రియ వల్ల ఆందోళనకరమైన పరిణామం ఏర్పడే అవకాశం ఉంది. ఓటు హక్కు ఉన్నవారి ప్రయోజనాలు, ఆందోళనలు, ప్రాధాన్యతలను మాత్రమే రాజకీయ పార్టీలు పరిగణనలోకి తీసుకుంటాయని అర్థం చేసుకోవడం కష్టం కాదు. రాజకీయ పార్టీలకు వారే ముఖ్యం. 'సర్' ద్వారా ఓటర్ల పేర్లను తొలగించే విధానాన్ని గమనిస్తే, ఓటు హక్కును నిలుపుకునే వారిలో ఎక్కువ మంది 'సవర్ణ హిందువులు' (అగ్రవర్ణ హిందువులు) ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కాకపోయినా, భవిష్యత్తులోనైనా ఇది ఖచ్చితంగా జరుగుతుంది. ప్రస్తుత 'సర్' ప్రక్రియే చివరిది కాకపోవచ్చని మనం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం 'సర్' ప్రక్రియను సాధారణమైన దిగా చూపిస్తూ ఆమోదించేలా చేస్తున్న తీరును బట్టి చూస్తే, భవిష్యత్తులో దీనిని అడ్డుకోవడం అసాధ్యం కావచ్చు. మన రాజకీయ సమాజం నుండి 'అవాంఛిత', 'అశుద్ధ' సెక్షన్లుగా పరిగణించబడే వారిని క్రమంగా తొలగించేలా ఇలాంటి 'సర్' ప్రక్రియలు తరచుగా జరిగే అవకాశం ఉంది. అనేకసార్లు 'సర్' ప్రక్రియలు జరిగిన తర్వాత, మన రాజకీయ వ్యవస్థ నుండి ఆ 'అవాంఛిత' వర్గాలు పూర్తిగా తొలగించబడతాయి.

ఒకవేళ ఓటు హక్కును నిలుపుకున్నా సరే, హిందువులు కానివారు, సవర్ణ హిందువులు కానివారు రాజకీయంగా ఎటువంటి ప్రభావం చూపలేని అల్పసంఖ్యాక వర్గాలుగా మిగిలిపోతారు. 'సర్'ప్రక్రియ లేకపోయినప్పటికీ, కేంద్రంలోని అధికార పార్టీ ముస్లిం, క్రైస్తవ మైనారిటీ వర్గాలకు చెందిన ఒక్క సభ్యుడు కూడా లేకుండానే మంత్రిమండలిని ఏర్పాటు చేయగలుగుతోంది. మన స్వతంత్ర గణతంత్ర చరిత్రలో ఎప్పుడూ కూడా ముస్లిం, క్రైస్తవ ప్రతినిధులు లేని కేంద్ర మంత్రిమండలి ఏర్పడలేదు. 'సర్' తర్వాత కూడా, ఏవైనా మైనారిటీలు, సవర్ణేతర హిందువులకు ఓటు హక్కు మిగిలి ఉంటే, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ద్వారా వారు రాజకీయంగా ప్రాముఖ్యత లేనివారిగా చేయబడతారు. ఎన్నికల ఫలితాలలో అటువంటి అవాంఛనీయ జనాభాను అప్రస్తుతం చేయడానికి, నియోజకవర్గాల పునర్విభజనను అమలు చేయడం ద్వారా నియోజకవర్గాలను ఎలా ప్యాక్ చేసి, చీల్చాలో అస్సాం, జమ్మూ కాశ్మీర్ మార్గం చూపించాయి.

రాజకీయ వ్యవస్థ బీజేపీ మయం

ప్రస్తుత పరిస్థితి ఇలా ఉంటే ఏకరీతి పౌర రిజిస్ట్రేషన్ - 'యునిఆర్' పూర్తిగా

అమలులోకి వచ్చిన తర్వాత మన సమాజంలోని ఈ వర్గాల రాజకీయ ప్రాముఖ్యత ఎలా ఉంటుందో ఊహించుకోండి. ప్రస్తుత అధికార పక్షం హిందూ మెజారిటీ వర్గాలను తమ వెనుక భారీగా సమీకరించుకోగలదు. 'సర్' అమలు తర్వాత, దేశంలోని ఏ రాజకీయ పార్టీ అయినా పనిచేయడానికి మిగిలే ఏకైక రాజకీయ వేదిక అధికార పక్షమే అవుతుంది. అంటే మన రాజకీయ వ్యవస్థ 'హిందూ-మయం' కావడం, లేదా కచ్చితంగా చెప్పాలంటే 'సవర్ణ హిందూ-మయం' కావడం జరుగుతుంది. దీనివల్ల ప్రతి రాజకీయ పార్టీ హిందూ మెజారిటీ పార్టీగా మారిపోతుంది. కొన్ని ఎక్కువ స్థాయిలో, మరికొన్ని తక్కువ స్థాయిలో ఉండవచ్చు, కానీ ఏది ఏమైనా అవన్నీ హిందూ మెజారిటీ పార్టీలే అవుతాయి.

అప్పుడు పాచికలు పడిపోతాయి. రంగం సిద్ధమవుతుంది. దేశంలోని రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. ఆ ప్రత్యేక రాజకీయ సమాజంలోనూ, మారిన రాజకీయ రంగంలోనూ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా లేదా కనీసం ఉనికిని కాపాడుకోవాలన్నా, ప్రతి రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ (బిజెపి) లాగానే వ్యవహరించాల్సి ఉంటుంది. అవి బీజేపీ విధానాలను అనుసరించక తప్పని పరిస్థితి లో పడతాయి. బహుశా ప్రస్తుత బీజేపీ కంటే ఎక్కువగా బీజేపీ తరహాలో వ్యవహరించాల్సిన అనివార్యత కూడా ఏర్పడవచ్చు.

మధ్య, దీర్ఘకాలంలో 'సర్' పరిణామాలు ప్రతి రాజకీయ పార్టీని బీజేపీలా మార్చేస్తాయి. మరో మాటలో చెప్పాలంటే, దేశంలోని ప్రతి రాజకీయ పార్టీ బీజేపీ-మయం అవుతుంది.

మెజారిటీ వర్గానికి చెందిన మతపరమైన చిహ్నాలు క్రమంగా ప్రభుత్వ చిహ్నాల స్థాయికి చేరుకోవడం మనం ఇప్పటికే చూస్తున్నాం. మన ప్రజాస్వామ్య గణతంత్ర దేశపు నూతన పార్ల మెంటు భవనంలో, రాజరిక చిహ్నమైన 'సెంగోల్'తో కలిసి అనేకమంది హిందూ మత పెద్దలు ఊరేగింపుగా వెళ్లడాన్ని మనం కొద్ది కాలం క్రితమే చూశాము. 'వందేమాతరం'పై సుదీర్ఘ చర్చ జరిగిన కొద్ది కాలానికే, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలన్నింటిలోనూ ఆ గీతంలోని ఆరు చరణాలనూ ఆలపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ స్వాతంత్ర్య దినోత్సవం నాడు, ఎర్రకోట వద్ద మొదటిసారిగా 'వందేమాతరం' గీతాన్ని ప్రదర్శించారు. అలాగే, హిందూ గ్రంథాలు, దేవుళ్లు, పురాణాలను స్పష్టంగా సూచించే పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టడాన్ని కూడా మనం చూస్తున్నాం. ఎంజిఎన్ 'రెగా' (ఉపాధి హామీ పథకం) పేరును వివి-జి రామ్ జి (వికాస్ భారత్ - గరీబ్ కళ్యాణ్ రోజ్‌గార్ యోజన)గా మార్చడం దీనికి అత్యంత ప్రముఖ ఉదాహరణ.

> **"ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను అదుపు చేయకపోతే, అది భారతదేశాన్ని ఇజ్రాయెల్ మార్గంలోకి తీసుకువెళ్తుంది. మరో మాటలో చెప్పాలంటే, ఈ రోజు మనం చూస్తున్నది భారతదేశ రాజకీయ వ్యవస్థ క్రమంగా ఇజ్రాయెల్‌మయం కావడమే. ఈ రెండు పరిణామాలు వేగంగా చోటు చేసుకుంటున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. ఒక వైపు రాజకీయ పార్టీల బీజేపీకరణ, మరోవైపు భారత రాజకీయ వ్యవస్థ ఇజ్రాయెలీకరణ... ఈ రెండూ ఏకతాటిపై సాగుతున్నాయి."**

ఇజ్రాయెల్ లాగా మార్చాలని...

ఆందోళన కలిగించే విషయం ఏమంటే, ఈ ప్రక్రియ ఇజ్రాయెల్ రాజకీయ సంస్కృతికి దగ్గరగా ఉంది. యూదు మత చిహ్నాలను తమ జాతీయ చిహ్నాలుగా కలిగి ఉండటంలో ఆ యూదు రాజ్యం ఏమాత్రం పశ్చాత్తాపపడదు. దాని జాతీయ పతాకంపై డేవిడ్ నక్షత్రం ఉంటుంది. ఆ దేశంలోని అన్ని ప్రధాన, ఆధిపత్య, ఎన్నికల పరంగా ప్రాముఖ్యత కలిగిన రాజకీయ పార్టీలు కేవలం యూదుల ప్రయోజనాలకే సేవ చేస్తాయి. కేవలం యూదుల ఆకాంక్షలను మాత్రమే తీరుస్తాయి. కేవలం యూదుల ఆందో ళనలు, భయాలు, యూదు దురహంకార ప్రాధాన్యతలను మాత్రమే పట్టించుకుంటాయి. కీలకమైన విషయాలలో వాటి మధ్య తేడాను గుర్తించడం దాదాపు అసాధ్యం. వాస్తవానికి, అవి యూదుల మద్దతు కోసం పోటీ పడటంలోనూ, యూదుల ప్రయోజనాలను కాపాడటంలోనూ ఒకరిని మించి ఒకరు పనిచేస్తాయి. అలాగే, యూదులు కాని పాలస్తీ నియన్ల ఆందోళనల పట్ల తమ ఉదాసీనతను, వ్యతిరేకతను ప్రదర్శిస్తాయి. యూదులు కానివారి సంక్షేమం పట్ల ఆ రాజ్యం ఎటువంటి బాధ్యత వహించదు.

ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను అదుపు చేయకపోతే, అది భారతదేశాన్ని ఇజ్రాయెల్ మార్గంలోకి తీసుకువెళ్తుంది. మరో మాటలో చెప్పాలంటే, ఈ రోజు మనం చూస్తున్నది భారతదేశ రాజకీయ వ్యవస్థ క్రమంగా ఇజ్రాయెల్‌మయం కావడమే.

ఈ రెండు పరిణామాలు వేగంగా చోటు చేసుకుంటున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. ఒక వైపు రాజకీయ పార్టీల బీజేపీకరణ, మరోవైపు భారత రాజకీయ వ్యవస్థ ఇజ్రాయెలీకరణ... ఈ రెండూ ఏకతాటిపై సాగుతున్నాయి.

ఇది తన ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అందించి, మానవతా సమాజాన్ని పెంపొందిస్తానని ప్రతిజ్ఞ చేసిన లౌకిక, బహుళత్వ, సమాఖ్య రాజ్యంగా భారత దేశ భావనను విచ్ఛిన్నం చేస్తోంది. మన 1947 నాటి విధి నిర్ణయంలో నిక్షిప్తమైన భారతదేశ భావన, మన 1950 రాజ్యాంగంలో పొందు పరచబడిన రాజకీయ ఒప్పందం ఇప్పుడు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయి.

జాతీయతకు సంబంధించిన రెండు భావనలు

భారతదేశపు లౌకిక, బహుళత్వ, ప్రజాస్వామ్య భావన, ఒక శతాబ్దానికి పైగా కొందరు వ్యక్తుల నుండీ, గతాన్ని ఆరాధించే అనేక ఇతర అజ్ఞానవాద వేదికల నుండీ నిరంతర దాడులకు గురవుతూనే ఉంది. వారు బహిరంగంగా, మొండిగా అసమాన సామాజిక వ్యవస్థను సమర్థిస్తున్నారు. భారతదేశ భవిష్యత్తును దాని గతంలో వెతకడం, ఆ కల్పిత గతం నుండి ఒక కట్టుకథతో కూడిన స్వచ్ఛమైన వైభవాన్ని తిరిగి తీసుకురావడం, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రాన్ని సాంస్కృతికంగా, భాషాపరంగా, మతపరంగా ఏకరీతి దేశంగా మార్చడం వారి లక్ష్యం. భారత నాగరికతను ఒక సకల సంస్కృతుల సమాహారంగా భావించడం వారికి పడదు. భారతదేశ భావన, దేశానికి లభించిన గొప్ప సంస్కృతులు, భాషలు, జీవనశైలులు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ పద్ధతులు, ఆరాధనా విధానాలు, సమ్మేళనాల వైవిధ్యాన్ని తుడిచిపెట్టాలని వారు చూస్తున్నారు. ఏకరూప భారతదేశమే వారి దృష్టిలో ఒక "నాగరిక" రాజ్యం.

భారత జాతిపై హిందువులకే ప్రత్యేక యాజమాన్యాన్ని కల్పించి, ఆ హిందూ-యాజమాన్య జాతిని భారత భూభాగంలో ఏకైక హక్కుదారుగా చేసి, దానిని ఒక హిందూ జాతీయ రాజ్యంగా, ఒక హిందూరాష్ట్రగా

(మిగతా 23వ పేజీలో)

సంస్కృతి

ప్రజాపక్ష మేధావుల అవసరం మరింత పెరిగింది



డివి కుమార్

రచయిత షిల్లాంగ్‌లోని నార్త్-ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీ, సోషియాలజీ విభాగం మాజీ ప్రొఫెసర్

ఒక ప్రజాపక్ష మేధావి సహేతుకమైన వాదనలను ఉపయోగిస్తూ ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ప్రశ్నలను లేవనెత్తుతారు. నేడు నిరంకుశ ధోరణులు పెరగడం, ప్రజాస్వామ్య విధానాల విధ్వంసం, నిరసన తెలపడాన్ని నేరపూరితం చేయడం వంటి పరిణామాలు సంభవిస్తున్న తరుణంలో ప్రజపక్ష మేధావుల పాత్ర మరింత కీలకంగా మారింది.

'ప్రజాపక్ష మేధావి' అనే పదానికి ఒక ఆసక్తికరమైన మూలం ఉన్నది. ఫ్రెంచ్ సైన్యంలో జర్మన్ ఆర్మీకి రహస్యాలను చేరవేశాడన్న ఆరోపణలను ఎదుర్కొన్న ఆల్ఫ్రెడ్ డ్రేఫస్ అనే యూదు కెప్టెన్ వ్యవహారంలో ఈ పదాన్ని మొదట ఉపయోగించారు అని ప్రముఖ చరిత్రకారిణి రోమిలా థాపర్ వివరించారు. ఆ తర్వాత సాగిన విచారణలో అతను నిర్దోషి అని తేలింది. అతను ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలో చాలా మంది కళాకారులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు అతనికి మద్దతుగా ఏకమయ్యారు. వారినే 'ప్రజాపక్ష మేధావులు' అని తొలిగా సంబోధించారు.

ప్రజాపక్ష మేధావి అంటే ప్రాథమికంగా నాటి వర్తమాన అంశాలతో మమేకమై, తాను నిజమని, నరైనది అని నమ్మే అంశానికి మద్దతుగా ఒక స్పష్టమైన వైఖరిని తీసుకునే వ్యక్తి. అతను/ ఆమె నివసించే సమాజం మెరుగైన నివాసిత సమాజంగా మారడానికి, ఆమె/అతను సహేతుకమైన వాదనలతో నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ప్రశ్నలను లేవనెత్తాలి. ప్రజాపక్ష మేధావి అంటే సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పునాది సూత్రాలను నిరంతరం పునరుద్ఘాటించడానికి ప్రయత్నించే వ్యక్తి.

నిరంకుశ ధోరణులను నిలదీయడం

ప్రస్తుత భారతదేశంలో ప్రజాపక్ష మేధావి పాత్ర మునుపెన్నడూ లేనంత క్లిష్టమైనదిగా, ముఖ్యమైనదిగా మారింది. పెచ్చరిల్లుతున్న నిరంకుశ ధోరణులు ప్రభుత్వ అంగాలు క్రమానుగతంగా బలహీనపడడానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తి విధ్వంసానికి, నిరసన స్వరాలను అణచివేయడానికి, నేరపూరితం చేయడానికి దారితీస్తున్నాయి. 'తార్కిక వ్యత్యాసం' పేరుతో లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాయడం, ఇళ్లను (ముఖ్యంగా ముస్లింలకు చెందినవి) బుల్డోజర్లతో కూల్చివేయడం, అలాగే ఫ్రిజ్‌లలో గోమాంసం ఉంచారనే నెపంతో లేదా 'లవ్ జిహాద్' పేరుతో మనుషులను గుంపుగా దాడి చేసి చంపడం (లించింగ్) వంటి ఘటనలను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారు. ప్రజాపక్ష మేధావులు ఇప్పుడు కూడా తమ గళాన్ని విప్పకపోతే, ఇంకెప్పుడు మాట్లాడతారో ఊహించడం కష్టం. నికరమైన సత్యం పక్షాన నిలబడటం, మాట్లాడటం వారి అత్యున్నత నైతిక బాధ్యత. ప్రస్తుత కాలంలో మౌనంగా ఉండటం ఎంత మాత్రం సరి కాదు. అది చాలా ప్రమాదకరం.

ప్రసిద్ధ ఇటాలియన్ మేధావి ఆంటోనియో గ్రాంసీ రాసిన వ్యాఖ్యలను ఇక్కడ ప్రస్తావించడం సమంజసంగా ఉంటుంది. "నేను తటస్థంగా ఏమీ పట్టనట్లు ఉండేవారిని అసహ్యించుకుంటాను. ఎందుకంటే ఎల్లప్పుడూ నిష్కపటులమని చెప్పుకునే వారి రోదనలు నన్ను తీవ్రంగా చిరాకుపరుస్తాయి. జీవితం వారికి ఇచ్చిన పాత్రను వారు ఎలా పోషిస్తున్నారు, రోజువారీ నెరవేర్చాల్సిన బాధ్యతలలో వారు ఏమి నెరవేర్చారు, ముఖ్యంగా ఏమి నెరవేర్చలేదు అని నేను ప్రతి ఒక్కరినీ అడుగుతాను... నేను జీవిస్తున్నాను, నేను ఒక పక్షపాతిని. అందుకే, ఏ పక్షం వహించని వారిని నేను అనహ్యించుకుంటాను.'' గ్రాంసీ ఏం చెప్పదలుచుకున్నారంటే, ప్రజాపక్ష మేధావులు నాటి అత్యంత తీవ్రమైన సమస్యలపై ఆలోచించి తమ వైఖరిని వ్యక్తపరచాలి. ఆ పని వారు చేయకపోతే, ఇంకెవరు చేస్తారు? భారతదేశం గొప్ప మేధావులకు నెలవు. ప్రాచీన భారతదేశంలో బుద్ధుడి నుండి ఆధునిక యుగంలో బి.ఆర్. అంబేద్కర్ వరకు, తమ కాలంలోని ఆధిపత్య ధోరణులను, ఆధిపత్య వ్యవస్థలను ప్రశ్నించిన అద్భుతమైన, శక్తివంతమైన ప్రజాపక్ష మేధావులను అందించిన ఘనమైన సంప్రదాయం భారతదేశానికి ఉంది.

విద్య , శాస్త్రీయ రంగాలలో మౌనం

అయితే ప్రస్తుత కాలంలో గమనించేది ఏమిటంటే, ప్రయోజనకరమైన ప్రజాపక్ష మేధావులుగా మారడానికి అవసరమైన మేధోపరమైన, విమర్శనాత్మక శక్తి ఉన్నవారు కూడా మౌనం పాటిస్తున్నారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు, కవులు, రచయితలు, కళాకారులు, ఇతరులను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ముఖ్యంగా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల గురించి ఒకట్రెండు మాటలు చెప్పడం సమంజసంగా ఉంటుంది. ప్రజాపక్ష మేధావిగా మారడానికి ఒక విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడే కానవసరం లేదన్నది నిజమే, కానీ విమర్శనాత్మక ఆలోచనా శక్తినీ, అవసరమైన భావనాత్మక పరిజ్ఞానాన్నీ పెంపొందించుకున్న విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడు ప్రజాపక్ష మేధావిగా ప్రభావవంతంగా పనిచేయడానికి అర్హుడు. ఒక విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడు నాటి అంశాలపై విమర్శనాత్మకంగా చర్చించి – అవి అధికారంలో ఉన్నవారికి ఎంత అసంతృప్తి కలిగించినప్పటికీ – తన అభిప్రాయాలను

వెల్లడిస్తాడు. కానీ ఇవాళ మన రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పు కలిగిస్తున్న అంశాలపై వీరు సందేహాస్పద మౌనం పాటిస్తున్నారు. విశ్వవిద్యాలయ వర్గాలలో ఈ మౌనం దాదాపు సాధారణ అంశంగా మారిపోయింది. సమాజంలోని నిరుపేదలు, బలహీనులకు సంబంధించిన సమస్యలపై వారు రాయకపోతే, మాట్లాడకపోతే ఇంకెవరు మాట్లాడతారు?

సమాజంలో జరిగే చర్చలకు నిష్పక్షపాతంగా, వస్తుగతంగా కీలకమైన తమ సహకారాన్ని అందించగల ప్రముఖ శాస్త్రవేత్తలను కూడా ఉదాహరణగా తీసుకోవచ్చు. దురదృష్టవశాత్తు, వారు తమను తాము తమ ఇరుకైన, ప్రత్యేక రంగాలు, పరిశోధనలకే పరిమితం చేసుకుని, సామాజిక సందర్భాలకు దూరంగా ఒంటరి వ్యక్తులుగా మిగిలిపోతున్నారు. తమ చుట్టూ ఉన్న సామాజిక ఆందోళనలతో అనుసంధానం కావడానికి వారు ఒక రకమైన నిరాసక్తత కనబరుస్తున్నారు.

సమకాలీన చర్చలను నుసంపన్నం చేయడానికి ప్రజాపక్ష మేధావులు మనస్ఫూర్తిగా తలుచుకుంటే ఎలాంటి సహకారం అందించవచ్చో చూపించడానికి కొన్ని ఉదాహరణలు తీసుకోవచ్చు. జాతీయవాదం ఉదాహరణ తీసుకోండి. ప్రస్తుతం జాతీయవాదాన్ని పునర్మిస్తున్న తీరుపై ఎవరూ తీవ్రంగా ప్రశ్నించడం లేదు (కొద్దిమంది గౌరవప్రదమైన మినహాయింపులతో). హిందూత్వాన్ని, హిందూత్వ ఆధారిత రాజకీయ ఆయుధంగా మారుస్తున్న తీరుపై ఎలాంటి విమర్శనాత్మక విశ్లేషణా జరగడం లేదు. అలాగే, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ సూత్రాలపై ఆధారపడిన మన సమగ్ర, ప్రజాస్వామ్య, పౌర జాతీయవాదాన్ని... ప్రత్యేకమైన, నిరంకుశ , జాతీయ వర్గ (హిందూ రాష్ట్ర) జాతీయవాదంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవడం ప్రజా మేధావుల ప్రాధాన్యతలలో మొదటి స్థానంలో ఉండాలి. కానీ అలా జరగడం లేదు. యూరప్ నమూనాకు చెందిన విధ్వంసకర, ఉగ్ర జాతీయవాదం భారతదేశానికి ఎన్నటికీ పొసగదని ప్రజలకు వారు అర్థం చేయించాలి. భారతీయ జాతీయవాదానికి ప్రజాస్వామ్య, లౌకిక , సమత్వ పునాదులపై బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఘనమైన చరిత్ర ఉంది. ఆ వారసత్వాన్ని కొనసాగించాలి.

నకిలీ చరిత్రను నిలదియ్యాలి


మరొక ఉదాహరణ ఏమిటంటే – కల్పిత పురాణ గాథలకు, వాస్తవిక చరిత్రకు మధ్య ఉన్న సరిహద్దు రేఖ నిరంతరం చెరిపివేయ బడుతోంది. అయినా వృత్తివరమైన చరిత్రకారులు (మళ్ళీ కొద్దిమంది మినహాయింపులతో) మౌనంగా ఉండటానికే మొగ్గు చూపారు. విద్యావేత్తలైన చరిత్రకారులు నకిలీ చరిత్రను (వాట్సాప్ హిస్టరీ) సమర్థ వంతంగా ప్రశ్నించే తమ బాధ్యతను స్పష్టంగా నెరవేర్చడం లేదు. లేదా, ప్రజా చైతన్యాన్ని మతతత్వంగా మార్చడం అనే అంశాన్నే తీసుకోండి. నిరుద్యోగం, యువతలో అసంతృప్తి, సంతృప్తికరంగా లేని ప్రభుత్వ విద్య, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి కీలక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాలక శక్తులు మతతత్వాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారని ప్రజలకు వివరించి చెప్పాలి.

ఒకప్పుడు టీవీ ఛానళ్ల చర్చలకు ప్రముఖ మేధావులను ఆహ్వానించేవారు. వారు మన చరిత్ర, సంస్కృతి, సమాజాల గురించి వివిధ కోణాల్లో మనకు వివరించి చెప్పేవారు. ఇవాళా రేపూ అలాంటి చర్చలకు తావు లేకుండా పోయింది. ఎందుకంటే అలాంటి మేధావులను ఇప్పుడు ఆ తరహా చర్చలకు పిలవడం లేదు, లేదా అర్థవంతమైన, విషయంతో కూడిన చర్చల కంటే కేవలం వాగాడంబరానికే ప్రాధాన్యతనిచ్చే ఈనాటి టీవీ చర్చలకు వారు దూరంగా ఉంటున్నారు. ఏది ఏమైనప్పటికీ, నేటి ఎలక్ట్రానిక్ మీడియా నుండి మనం పెద్దగా ఏమీ ఆశించలేము, ఎందుకంటే అవి మునుపెన్నడూ లేని స్థాయిలో వ్యాపారీకరణకు గురయ్యాయి.

ప్రస్తుత కాలంలో 'ప్రశ్నించే మనస్తత్వాన్ని' పూర్తిగా నిరాశపరుస్తున్నారు. మన పరిపాలన, విద్య, ఆర్థిక వ్యవస్థ – ఇలా మొత్తం సమాజ స్థితిగతులపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, వాటిని దేశద్రోహంగా, ఆందోళనకరమైనవిగా ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. జైలుకు పంపుతామనే బెదిరింపులతో యథేచ్ఛగా తెగబడుతున్నారు. నిరసనను నేరపూరితం చేయడం సాధారణ విషయంగా మారింది. అయితే ఇప్పటికీ ప్రజాపక్ష మేధావులు మాట్లాడక, తమ ఉనికిని చాటుకోకపోతే, దేశంలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారతాయి. అత్యంత ప్రభావవంతమైన

(మిగతా 32వ పేజీలో)

> **"సమాజంలో జరిగే చర్చలకు నిష్పక్షపాతంగా, వస్తుగతంగా కీలకమైన తమ సహకారాన్ని అందించగల ప్రముఖ శాస్త్రవేత్తలను కూడా ఉదాహరణగా తీసుకోవచ్చు. దురదృష్టవశాత్తు, వారు తమను తాము తమ ఇరుకైన, ప్రత్యేక రంగాలు, పరిశోధనలకే పరిమితం చేసుకుని, సామాజిక సందర్భాలకు దూరంగా ఒంటరి వ్యక్తులుగా మిగిలిపోతున్నారు. తమ చుట్టూ ఉన్న సామాజిక ఆందోళనలతో అనుసంధానం కావడానికి వారు ఒక రకమైన నిరాసక్తత కనబరుస్తున్నారు."**



2016లో ఢిల్లీలోని జెఎన్‌యు విశ్వవిద్యాలయ విద్యార్థులపై ప్రభుత్వ నిర్బంధ కాండ సందర్భంగా వారితో జాతీయ వాదంపై చర్చిస్తున్న ప్రముఖ చరిత్రకారులు రొమిలా థాపర్, హర్బన్స్ ముఖియా

అదో మహాద్భుతం, మరోవైపు ముంచుకొస్తున్న ముప్పు కూడా



బృందా వాసుదేవన్

రచయిత మీడియా రంగంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. వాణిజ్య వార్తల నుండి పిల్లల కథలపరకు అనేక విషయాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం ఫ్రంట్‌లైన్ పత్రిక కన్సల్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు

'కృత్రిమ మేధ' (ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్- ఎఐ) అన్న పదం 70 ఏళ్ల క్రితం మానవ భాషా సంపదలోకి ప్రవేశించింది. అమెరికాలోని డార్ట్‌మౌత్ కాలేజీకి చెందిన జాన్ మెక్‌కార్తి, హార్వర్డ్ యూనివర్శిటీకి చెందిన మార్విన్ మిన్‌స్కీ, ఐబిఎం కు చెందిన నథానీల్ రోచ్టెర్, బెల్ టెలిఫోన్ లేబరేటరీస్‌కు చెందిన క్లాడె షానన్‌లు కృత్రిమ మేధ మీద రెండు మాసాల అధ్యయన శిబిరం నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ రోజు మనం విస్తృతంగా వాడుతున్న కృత్రిమ మేధ (ఎఐ) అన్న పదం ఆ నాడు మొదటి సారిగా వాడడం జరిగింది. మానవ విజ్ఞానానికి సంబంధించిన అన్ని అంశాలనూ యంత్రం అనుకరించడం సూత్రప్రాయంగా సాధ్యమే. నైరూప్య భావనల నుండి యంత్రాలు భాషను రూపొందించుకోవడం, నేడు మానవులు మాత్రమే చేయగలుగుతున్న సమస్యల పరిష్కారాన్ని యంత్రాలు చేయడం, ఆ విధంగా వాటినవి మెరుగుపరుచుకోవడం ఎలా చేస్తాయో చూసేందుకు ప్రయత్నాలు చేయాలని ఆ శిబిరంలో పేర్కొన్నారు.

1955-56లో ప్రారంభమైన ఈ ప్రయత్నం నేడు ఒక రూపాన్ని తీసుకుంది. మనం ఏ దుస్తులు వేసుకోవాలి, ఏం తినాలి, చివరికి ఏం ఆలోచించాలి, ఎలా ప్రవర్తించాలి అన్న విషయాలను కూడా నేడు ఎఐ పనిముట్లను (ఎఐ టూల్స్‌ను) అడుగుతున్నాం. మెక్‌కార్తీ, మిన్‌స్కీల వారసులు నేడు సింథటిక్ మేధ సృష్టిపై ప్రయోగాలు చేస్తున్నారు. సింథటిక్ మేధ అంటే అది మనుషుల్లాగానే స్వతంత్రంగా ఆలోచిస్తుంది. ప్రస్తుతం మనం సింథటిక్ మేధకు కొద్ది దూరంలో ఉన్నామని అనుకుందాం. కానీ ఇప్పటికైతే, మన దగ్గర కృత్రిమ మేధ ఉంది. అది మానవుని ఆలోచనలను అనుకరించి సమస్యలను మానవుని మెదడుకన్నా మరింత వేగంగా, మరింత సమర్ధవంతంగా పరిష్కరించగలుగుతోంది.

అయితే కృత్రిమ మేధ నేడు అవసరమైనప్పుడు సలహాలిచ్చే పాత్రకు మించి పోషిస్తున్నది. ఇప్పుడది చమురు లాగే భూగోళ రాజకీయాల్లో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతోంది. ప్రపంచీకరణ ఆర్థిక అసమానతలను రూపుమాపి ప్రపంచ ఆర్థికభూగోళాన్ని చాపలాగా సమానం చేసిందనీ, ఆయా స్థలాలకున్న సానుకూలతలను రూపుమాపేసిందని 2005లో థామస్ ఫ్రైడ్‌మాన్ వాదించాడు. కాని నేడు ప్రపంచం ఆయన చెప్పినట్లు చదునుగా లేదు. సరిహద్దులు ఇప్పటికీ చెల్లుబాటవుతున్నాయి. అన్నిటికన్నా మించి యంత్రాలపై అదుపు సాధించిన వాళ్లు నేడు మన కోసం మనం ఏం ఆలోచించాలో నిర్ణయిస్తున్నారు.

20వ శతాబ్దంలో ఇంధన భద్రత జాతీయ భద్రత ఎలా అయిందో 21వ శతాబ్దంలో కృత్రిమ మేధలో స్వావలంబన ప్రతి ఒక్కదేశానికీ సవాలుగా మారుతోంది. విదేశీ కృత్రిమ మేధ వ్యవస్థలపై ఆధారపడ్డం దిగుమతి చేసుకునే చమురు, ఆయుధాలపై ఆధారపడ్డం అంత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం అని ప్రపంచ ప్రభుత్వాలన్నీ గుర్తిస్తున్నాయి. దీంతో నేడు భద్రతా ఎజెండాలో కృత్రిమ మేధ నెంబర్ ఒన్ స్థానానికి చేరుకుంది. దీనికి ఇటీవలి చక్కటి ఉదాహరణ, అమెరికా ప్రభుత్వం ఏంథ్రోపిక్‌కు ఇచ్చిన ఆదేశం. ఏంథ్రోపిక్‌కు సంబంధించిన అత్యంత శక్తివంతమైన కృత్రిమ మేధ నమూనాలు విదేశీయులకు (చివరికి ఏంథ్రోపిక్‌కు చెందిన విదేశీ ఉద్యోగులకు కూడా) అందకుండా నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం సంస్థను ఆదేశించింది. ఆంథ్రోపిక్ ఈ ఆదేశాలను పాటించింది. కానీ ఇదంతా అపార్థం చేసుకోవడం వల్ల జరిగిందని చెబుతూ ప్రభుత్వ నిర్ణయంపై ఆ సంస్థ బహిరంగంగా అసమ్మతి తెలిపింది.

అమెరికా విదేశాంగ విధానం రానురాను అస్తవ్యస్తంగా మారిపోతున్న తరుణంలో తమ దేశాల్లో ఆర్థిక వ్యవస్థలను, ఎన్నికలను, యుద్ధాలను తీర్చిదిద్దుతున్న ఆల్గోరిథిమ్స్ ఎవరి యాజమాన్యం క్రింద, ఎవరి నియంత్రణలో ఉన్నాయి అని అన్ని దేశాలూ తీవ్రంగా ఆలోచిస్తున్నాయి. కృత్రిమ మేధ మీద సార్వభౌమాధికారం అంటే అర్థం, తమ దేశాల సరిహద్దుల లోపల కృత్రిమ మేధ రూపకల్పన, మోహరింపు, నిబంధనలపై ఆయా దేశాలే నియంత్రణ కలిగి ఉండడం. కానీ సార్వభౌమాధికారం కలిగి ఉండడం ఒక్కటే సరిపోదు. కృత్రిమ మేధ వ్యవస్థలు పారదర్శకంగా, జవాబుదారీ తనంగా, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండడం కూడా ప్రభుత్వ నియంత్రణలో భాగంగా ఉండాలి. ఇటువంటి జవాబుదారీ చెక్‌పాయింట్లు లేకపోతే కృత్రిమ మేధ అడుగడుగునా నిఘాను పెంచి, అసమ్మతిని అణచివేసి నిరంకుశ నియంత్రణకు సాధనంగా మారిపోయే ప్రమాదం ఉంది. సమాజాలు తమ స్వేచ్ఛను కోల్పోకుండా కృత్రిమ మేధను ఉపయోగించుకోవాలంటే దానిని సక్రమంగా వినియోగించుకోవడం అవసరం.


కృత్రిమ మేధ ఏం చేస్తుందో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. కృత్రిమ మేధ మనల్ని నిరుద్యోగులుగా మార్చేస్తుందా అనేది

నేడు అనేక మంది ప్రజల్లో నెలకొన్న భయం. ఇప్పటికే కృత్రిమ మేధ ప్రపంచ ఉపాధి పరిస్థితులను మార్చేస్తోంది. జర్నలిజం నుండి వస్తూత్పత్తి వరకు, కస్టమర్ సర్వీసు నుండి లాజిస్టిక్స్ వరకు అన్ని రంగాల్లో కృత్రిమ మేధ చాలా వేగంగా మానవ శ్రమను తొలగిస్తోంది. అల్గోరిథిమ్స్ వార్తా కథనాలను రాయగలవు, అడ్వర్టయిజ్‌మెంట్లను డిజైన్ చేయగలవు, చివరికి సంగీతాన్ని కూడా కంపోజ్ చేయగలవు. ఈ వ్యాసాన్ని కూడా అల్గోరిథిమ్ రాయగలదు. అందువల్ల ఇప్పుడు అసలు వాస్తవంగా సృజన అంటే ఏమిటి, సృజనకూ వాస్తవానికీ మధ్య తేడా ఉందా అన్న తాత్వికత తీవ్రంగా తలెత్తుతుంది.

ఈ సమస్యలో తత్వచింతన ఒక భాగం మాత్రమే. ఇంకో ముఖ్యమైన విషయం యాజమాన్యానికి సంబంధించింది. ఒక రచయిత కృత్రిమ మేధతో ఒక వ్యాసాన్ని తయారు చేస్తే అప్పుడు ఆ వ్యాస కర్త ఎవరు? రచయితా లేక కృత్రిమ మేధ సాధనాలు సృష్టించిన వారా? సృజన కారులు ఈ సమస్యలతో సతమతమవుతుంటే, ఇతరులు తమ ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఎందుకంటే కృత్రిమ మేధ కోడ్స్‌ను మనుషులకన్నా వేగంగా, మెరుగుగా రాయగలుగుతుంది. కస్టమర్ సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించగలుగుతుంది. మనుషులకు ఇచ్చే జీతంలో అతి కొద్ది భాగం ఖర్చు చేస్తే చాలు కృత్రిమ మేధ కస్టమర్లతో విరామం లేకుండా మాట్లాడగలుగుతుంది. కృత్రిమ మేధతో నడిచే రోబోట్లు కార్లను తయారు చేస్తున్నాయి. ప్యాకేజీలు డెలివరీ చేస్తున్నాయి. గోదాములు నిర్వహిస్తున్నాయి. మనుషులను కృత్రిమ మేధ ఉద్యోగాలనుండి తొలగించడమే కాదు, దీని వల్ల కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. కృత్రిమ మేధ ట్రైనర్లు, రెగ్యులేటర్లు, క్రియేటివ్ కొల్లాబరేటర్లు వంటి ఉద్యోగాలు వస్తున్నాయి. పంపిణీలోనే సవాలు దాగి ఉన్నది: కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని లాభపడేదెవరు, ఉద్యోగాలు, జీవనాధారం పోవడం వల్ల కలిగే నష్టాలు భరించేదెవరు?

సరిచేయకుండా వదిలేస్తే, కృత్రిమ మేధ ఇప్పటికే ఉన్న విస్తారమైన అసమానతలను మరింత పెంచుతుంది. భవిష్యత్తులో ఉద్యోగాలు ఆవిష్కరణల మీద కాకుండా విద్య, పున:శిక్షణ, సామాజిక భద్రత వంటి విషయాలపై జరిగే విధాన నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి. కృత్రిమ మేధ మానవ శక్తిని ఉపయోగించుకుంటుందా లేక దాన్ని పని నుండి తొలగిస్తుందా అనేది ఈ విధాన నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది.

> **"కృత్రిమ మేధను యుద్ధ రంగంలోకి తీసుకుపోతే అక్కడ నైతిక బాధ్యత మరింత కఠినంగా మారిపోతుంది. స్వయం చలిత ఆయుధాలు, గురితప్పని లక్ష్యాలు, యుద్ధం చేసే రోబోట్లు ఇవన్నీ కూడా తీవ్రమైన ప్రాణహననం గావిస్తాయి, కానీ బాధ్యత మాత్రం ఏమాత్రం ఉండదు. ఏమాత్రం నైతికత లేకుండా యుద్ధం కంప్యూటర్లతో చేసినప్పుడు ప్రమాదవశాత్తు కూడా యుద్ధాలు ప్రారంభం కావచ్చు, మరోవైపు మానవుల బాధ్యత కనుమరుగవుతుంది."**



కృత్రిమ మేధను యుద్ధ రంగంలోకి తీసుకుపోతే అక్కడ నైతిక బాధ్యత మరింత కఠినంగా మారిపోతుంది. స్వయం చలిత ఆయుధాలు, గురితప్పని లక్ష్యాలు, యుద్ధం చేసే రోబోట్లు ఇవన్నీ కూడా తీవ్రమైన ప్రాణహననం గావిస్తాయి, కానీ బాధ్యత మాత్రం ఏమాత్రం ఉండదు. ఏమాత్రం నైతికత లేకుండా యుద్ధం కంప్యూటర్లతో చేసినప్పుడు ప్రమాదవశాత్తు కూడా యుద్ధాలు ప్రారంభం కావచ్చు, మరోవైపు మానవుల బాధ్యత కనుమరుగవుతుంది. కృత్రికమ మేధతో పనిచేసే ఆయుధాల పోటీ ప్రారంభం కాకముందే వాటి వాడకాన్ని నివారించే ప్రపంచ వ్యాపిత ఒప్పందాలు కుదరాలి.

యుద్ధరంగంలో కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. మనం యంత్రాలకు ఏమేమి అప్పగించాలి, మన నిర్ణయాలకు ఏమేమి ఉంచుకోవాలి. ఇదే విషయం తరగతి గదులకు కూడా వర్తిస్తుంది. కృత్రిమ మేధ అధ్యాపకులు (ఎఐ ట్యూటర్స్) ఏ వ్యక్తికి ఎలా చెప్పాలో, ఎంత చెప్పాలో చెప్పగలుగుతాయి. ప్రతి విద్యార్థి సామర్థ్యం, పద్ధతిని అనుసరించి పాఠాలు చెబుతాయి. కొందరికిది విప్లవం. కృత్రిమ మేధ ఉపాధ్యాయుల ద్వారా మారుమూల పల్లెల్లో నివసించే పిల్లలు కూడా ప్రపంచ స్థాయి విద్య పొందవచ్చు. కానీ విద్య అంటే కేవలం సమాచార బదిలీ మాత్రమే కాదు కదా! దానికి మార్గదర్శకుడైన గురువు ఉండాలి, చర్చ జరగాలి, మానవ సంబంధం ఉండాలి. కృత్రిమ మేధ ప్రాథమిక ఉపాధ్యాయునిగా ఉంటే అప్పుడు విజ్ఞాన సముపార్జన అనేది కేవలం ఒక లావాదేవీ వ్యవహారంగా మారిపోయి ఆ చిన్న మెదళ్లకు ఒక స్నేహితుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకునిగా మానవ ఉపాధ్యాయులు నిర్వహించే పాత్ర లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుంది. అందువల్ల కృత్రిమ మేధ బోధిస్తుందా లేదా (అది బోధిస్తుంది) అనేది ప్రశ్నకాదు. పిల్లలను సంపూర్ణమైన మానవులుగా అభివృద్ధి చేసే ఇతర పాత్రలు ఎవరు తీసుకుంటారనేది ప్రశ్న.

వీటన్నికీ మించి కృత్రిమ మేధ నుండి ఇప్పుడు ఒక తక్షణ సవాలు వచ్చి కూర్చుంది. అది తప్పుడు సమాచారం. వాస్తవంగా కనిపించే నకిలీ సమాచారం (డీప్‌ఫేక్), తప్పుడు వార్తలు, అల్గోరిథిమిక్ ప్రచారాలు వాస్తవానికీ, సృజనకూ మధ్య గీతను అస్పష్టంగా మార్చేస్తున్నాయి. కృత్రిమ మేధతో సృష్టించే కథనాలు, చిత్రాలు ప్రజలకు వాస్తవానికీ, అబద్ధాలకూ మధ్య తేడా తెలుసుకోలేని పరిస్థితులు కల్పిస్తున్నాయి. దీన్ని ఎదుర్కొనాలంటే మనకు సాంకేతిక

> **“భారత దేశంలో కాగితాల మీద గట్టి హక్కులు కల్పిస్తూ చట్టాలు చేయవచ్చు గాక, కానీ సమాచార రక్షణ యంత్రాంగాన్ని పనిలో పెట్టడానికీ, రెగ్యులేటర్లకు శిక్షణ ఇవ్వడానికీ, అమలు చేసే సామర్థ్యాన్ని నిర్మించడానికీ అనేక సంవత్సరాలు పడుతుంది. సరిగ్గా ఈ మధ్య గడిచిపోయిన సమయంలోనే కృత్రిమ మేధ వ్యవస్థలు చాలా చురుకుగా పనిచేసేస్తాయి. చట్టానికి పదునైన పళ్లు ఏర్పడేనాటికే సమాచార సేకరణ పూర్తయిపోవడం, అమ్మేయడం జరిగిపోతుంది.”**

పరిష్కారాలుంటే సరిపోదు, మీడియా లిటరసీ కావాలి, నైతిక నియంత్రణ కావాలి. సత్యానికి కట్టుబడే సరికొత్త నిబద్ధత కావాలి.

ఈ కృత్రిమ వాతావరణానికి తోడు కృత్రిమ మేధ మానవుని జీవితంలోని అత్యంత సన్నిహితమైన, సున్నితమైన ప్రదేశాల్లోకి చొచ్చుకు వెళ్లిపోతోంది. జీవితభాగస్వామి బోట్‌లు (కంపానియన్‌షిప్ బోట్స్) మనుషుల్లో తాదాత్మ్యాన్ని పెంపొందిస్తాయి, ఒంటరి బ్రతుకులను సేద దీరుస్తాయి. డేటింగ్ యాప్‌లు ఇతరులతో తమకు జత కలుస్తుందో లేదో ఆల్గోరిథిమ్స్ ఉపయోగించి చెబుతాయి. కృత్రిమ గొంతులు వినిపించే మాటలు మనుషుల్లో ఆప్యాయతను కలుగజేస్తాయి, చివరికి ప్రేమను కూడా పుట్టిస్తాయి. ఇప్పటికే చాలా మంది కృత్రిమ (మేధ) పెంపుడు జంతువులను పెంచుతున్నారు, కృత్రిమ (మేధ) మొక్కలకు నీరు పెడుతున్నారు. ఇటువంటి కృత్రిమ సహచరులనుండి ఓదార్పు లభించినా అది మనకు తెలిసిన వారి నుండి అభించే ఓదార్పు కాదు. యంత్రాలు క్రమక్రమంగా ప్రేమించబడ్డం అనే మన అవగాహననూ తగ్గించివేస్తాయా?

కృత్రిమ మేధకు సంబంధించిన అన్ని చర్చల్లోనూ మనకు కనిపించే ఒక ఉమ్మడి అంశం: వ్యక్తిగత గోప్యత. కృత్రిమ మేధ వల్ల ఎక్కువగా దెబ్బతినేది ఇదే. కృత్రిమ మేధ వ్యవస్థలన్నీ కూడా మన సంభాషణలు, మన కదలికలు, మన ఇ-మెయిళ్లు, మన రుచులు, అభిరుచులు, మన రహస్యాలు మొదలైన వీటిమీదనే అధారపడి అభివృద్ధి చెందుతాయి. మన వ్యక్తిగత సమాచారాన్ని కృత్రిమ మేధ సేకరిస్తుంది. ఏనాడూ, ఏ మానవ గూఢాచారీ చేయనంతగా కృత్రిమ మేధ మన వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తుంది, మన జీవితాలను మోనిటర్ చేస్తుంది.

వ్యక్తిగత గోప్యం అనేది రహస్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు, అది వ్యక్తికి సంబంధించిన సార్వభౌమాధికారం, గౌరవం, స్వేచ్ఛలకు సంబంధించిన అంశం. మన గురించి మనకు తెలిసినదానికన్నా ఎక్కువగా మన గురించి కృత్రిమ మేధ వ్యవస్థలకు తెలిసి ఉంటే వాళ్లు మన అవసరాలను వాళ్లకనుకూలంగా మార్చేస్తారు, మన కోర్కెలను వాళ్లే తీర్చిదిద్దుతారు, మన వ్యక్తిత్వాన్ని హననం చేస్తారు. అనేక దశాబ్దాలుగా ఈ వాస్తవాన్ని గుర్తించి వ్యవహరించడంలో న్యాయ వ్యవస్థలు వెనకబడ్డాయి. వ్యక్తిగత సమాచార సేకరణకు సంబంధించినంత వరకు ఐరోపా 2018లో చేసిన సాధారణ సమాచార రక్షణ నియంత్రణ నిబంధనావళి అత్యంత సమగ్రమైన ప్రయత్నం. అయినప్పటికీ ఇది కూడా వ్యక్తులు ఏనాడూ నేరుగా ఇవ్వని సమాచారం నుండి అత్యంత సున్నితమైన సమాచారాంశాలను కృత్రిమ మేధ వ్యవస్థలు సేకరించకుండా ఆపడానికి ఆపసోపాలు పడుతున్నది.

నియంత్రణలు చాలా బలహీనంగా ఉన్న చోట లేక అసలు నియంత్రణలే లేని చోట సమానాంతర ఆర్థిక వ్యవస్థలు విరాజిల్లుతున్నాయి. ఇలాంటి చోట సమాచార బ్రోకర్లు, వ్యాపార ప్రకటనల నెట్‌వర్క్‌లు, కృత్రిమ మేధ డెవలపర్లు వ్యక్తుల సమాచారంతో స్వేచ్ఛగా వ్యాపారం చేసేస్తున్నారు. దీనికి చెల్లించే మూల్యం అపారం. నిజజీవితంపై పెద్ద ప్రభావం చూపుతున్నది. నియంత్రణలు నిరంతరం కన్నువేసి ఉంచని చోట.. ఉపాధికల్పనలో వివక్ష పూరితమైన ఆల్గోరిథిమ్స్, రుణాల మంజూరు నిర్ణయాల్లో పారదర్శకత లేనితనం, ఓటింగ్ లిస్టులను తమకు అనుకూలంగా తయారుచేసుకోవడం, యజమానులకు, ప్రభుత్వానికీ గూఢచర్యం చేసే పరికరాలను అమ్మడం మొదలైనవి విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయి.

ఈ విషయంలో ఇతరులను అందుకునే విషయంలో భారత దేశాన్ని అధ్యయనం చేస్తే అనేక పాఠాలు నేర్చుకోవచ్చు. మన దేశంలో 2023లో డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం ఆవిర్భవించింది. 2025 నవంబర్‌లో ప్రభుత్వం దానికి నిబంధనలను నోటిఫై చేసి, సమాచార రక్షణ బోర్డు ప్రకటించడంతో అది అమల్లోకి వచ్చింది. 2027 మే నాటికి గానీ అది పూర్తిస్థాయిలో అమల్లోకి రాదు. అంటే చట్టం రూపకల్పన చేసి అమలు చేయడానికి నాలుగేళ్లు పట్టినట్లు. ఈ లోగా కోటానుకోట్ల సమాచార రికార్డులు ఇప్పటికే చేతులు మారిపోయాయి. ఈ చట్టం వల్ల పౌరులకు తమ సమాచారాన్ని చేరుకుని, దాన్ని సరిచేసుకుని లేక పూర్తిగా రద్దుచేసుకునే హక్కు లభిస్తుంది. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడితే రూ. 250 కోట్ల వరకు పెనాల్టీలు వేసే అవకాశం ఉంది. అయితే, ఈ చట్టం కూడా సమాచారం స్వేచ్ఛగా సరిహద్దులు దాటి వెళ్లిపోవడానికి అవకాశం కల్పిస్తుంది. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన నిర్ధిష్ట దేశాలకు మాత్రం వెళ్లకుండా నిరోధిస్తుంది.


భారత దేశ అనుభవం ప్రపంచ వ్యాపితంగా అమలవుతున్న ఒక పద్ధతిని మనముందుంచుతున్నది. కాగితాల మీద గట్టి హక్కులు కల్పిస్తూ చట్టాలు చేయవచ్చు గాక, కానీ సమాచార రక్షణ యంత్రాంగాన్ని పనిలో పెట్టడానికీ, రెగ్యులేటర్లకు శిక్షణ ఇవ్వడానికీ, అమలు చేసే సామర్థ్యాన్ని నిర్మించడానికీ అనేక సంవత్సరాలు పడుతుంది. సరిగ్గా ఈ మధ్య గడిచిపోయిన సమయంలోనే కృత్రిమ మేధ వ్యవస్థలు చాలా చురుకుగా పనిచేసేస్తాయి. చట్టానికి పదునైన పళ్లు ఏర్పడేనాటికే సమాచార సేకరణ పూర్తయిపోవడం, అమ్మేయడం జరిగిపోతుంది. అంతేకాదు ఈ కాలంలోనే వాళ్లు వచ్చే తరం నమూనాలకు శిక్షణ ఇవ్వడం కూడా ప్రారంభించేస్తారు.

ఈ విధంగా చట్టం చేయడానికీ, దాన్ని అమల్లోకి తేవడానికీ మధ్య గల సమయం తప్పించుకునే శక్తి చాలా తక్కువగా ఉన్న వారికి చాలా విలువైనది. కృత్రిమ మేధ ప్రస్తుతం ఉన్న అసమానతలను మరింత పెంచుతుంది. లింగ అసమానతలను కూడా పెంచుతుంది. వివక్షతో కూడిన సమాచారంపై శిక్షణ పొందిన ఆల్గోరిథిమ్స్ అలాంటి వాటినే ఉత్పత్తి చేస్తాయి. నియామకాల్లోనూ, శిక్షల్లోనూ, ఆరోగ్య రక్షణలోనూ వివక్షను మరింత పెంచుతాయి. నిఘా పరికరాలు న్యాయమైన వాణిజ్య అవసరాలకోసం అభివృద్ధి చేసినప్పటికీ వాటిని ముఖ్యంగా మహిళల కదలికలను గుర్తించడానికీ, వారి మాటామంతీని పర్యవేక్షించడానికీ,

(మిగతా 23వ పేజీలో)

అధ్యయనం

వ్యవసాయరంగంలో మార్పుల్ని ఎలా అర్థం చేసుకోవాలి?



ఆర్ రామ్ కుమార్

వర్తమాన ప్రపంచంలో వ్యవసాయ రంగంలో సంభవిస్తున్న మార్పుల స్వభావం గురించి సిద్ధాంత, ఆచరణలరీత్యా శాస్త్రీయంగా వివేచించడం మీద మార్క్సిస్టులు పెద్ద ఎత్తున శ్రద్ధ పెట్టారు. వ్యవసాయరంగంలో మార్పుల గురించి చేపట్టిన అధ్యయనాలు కేవలం వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ పూర్వ సమాజంలోని ఉత్పత్తి సంబంధాలను ఎలా రూపుమాపాయి అన్న అంశానికి మాత్రమే పరిమితం కాలేదు. వ్యవసాయక సమాజంలో తలెత్తుతున్న మౌలిక వైరుధ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా తగిన డిమాండ్లు, ఎత్తుగడలు రూపొందించుకోవడానికి కూడా ఈ అధ్యయనాలు ఉపకరించాయి. గ్రామీణ భారతదేశంలోకి పెట్టుబడిదారీ విధానం చొచ్చుకుపోతున్న తీరు తరతమ భేదాలతో సంక్లిష్టంగా ఉండడం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులలో చోటుచేసుకుంటున్న మార్పుల నిర్దిష్ట అధ్యయనం అనేది నిరంతరాయంగా జరగాల్సిన ప్రక్రియ.

1
1950వ దశకం తరువాత వ్యవసాయ రంగంలో మార్పులు

భారత స్వాతంత్ర్యోద్యమంలో దున్నేవాడిదే భూమి అన్న నినాదం మార్మోగింది. బ్రిటిష్ వలస నుండి సంక్రమించిన వ్యవసాయక సమాజం నిర్మాణం రీత్యా స్వాతంత్ర్యానంతర భారత దేశంలో వ్యవసాయాన్ని ఆధునీకరించి ఉత్పత్తి పెంచడంతోపాటు గ్రామీణ ప్రాంత కష్టజీవులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కల్పించడానికి భూసంస్కరణలు చేపట్టాల్సిన తక్షణ ఆవశ్యకతయే కీలకంగా మారింది. దేశంలో వామపక్ష ఉద్యమం మాత్రమే భూసంస్కరణల అమలు నినాదాన్ని బలంగా ఎలుగెత్తి చాటింది. భారత జాతీయ కాంగ్రెస్ భూసంస్కరణల అమలుకు ఏమాత్రం కట్టుబడలేదు. 1950-60 దశకాల్లో కౌలు రైతుల నిర్బంధ తొలగింపు పెద్దఎత్తున కొనసాగడంతో కాంగ్రెస్ పార్టీ భూసమస్యను ఇంకెంత మాత్రం ఉపేక్షించలేని పరిస్థితికి నెట్టబడింది.

భూసంస్కరణల అమలులో బూర్జువా-భూస్వామ్య రాజ్యపు ఘోర వైఫల్యాలను సమకాలీన చరిత్ర ప్రస్ఫుటంగానే నమోదు చేసింది. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నచోట, వాళ్ళ రాజకీయ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో మాత్రమే భూసంస్కరణల చట్టం శక్తివంతంగా అమలయ్యింది. వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు భూసంస్కరణల చట్టా న్ని తూతూ మంత్రంగా అమలు చేసిన కార ణంగా బూర్జువా-భూస్వామ్య వర్గాలదే రాజ్యం పై పైచెయ్యిగా మారింది. పర్యవ సానంగా పెట్టుబడిదారీ పూర్వసమాజపు వ్యవసాయక సంబంధాలు కుళ్ళగించబడలేదు. అలాగే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి ఆశించినంతగా జరగ లేదు.

గ్రామీణ భారతదేశంలో బడా భూస్వాముల ఆధిపత్యం కేవలం ఆర్థికానికే పరిమితం కాలేదు. భూమి మీద ఉన్న యాజమాన్య హక్కు సామాజిక వివక్షకు, రాజకీయ ఆధిపత్యాన్ని ఆదరువుగా నిలిచింది. తద్వారా అగ్రవర్ణ భూస్వాములు దళితుల మీద, ఆదివాసుల మీద, సామాజికంగా వెనుకబడిన ఇతర కులాల మీద పెత్తనం చెలాయిస్తూ దోపిడికి పాల్పడుతూ వచ్చారు. భూమి మీద ఉన్న హక్కు వాళ్ళకు ఈ ఆధిపత్య స్థానాన్ని కట్టబెట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజానీకం తమ ఆర్థిక అవసరాలకు ఈ భూస్వాముల మీద ఆధారపడి ఉన్న పరిస్థితిని ఉపయోగపెట్టుకుని అదే భూస్వాముల అండతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందుతూ వచ్చింది.

1960వ దశకంలో హరిత విప్లవం పేరిట వ్యవసాయ రంగానికి పరపతి సౌకర్యం, సబ్సిడీలు కల్పించడం, మద్దతు ధరలు ప్రకటించడం, మార్కెటింగ్ సౌకర్యాలు విస్తృతమెనర్చడం, శాస్త్రీయ పరిశోధనలు వేగవంతం చెయ్యడం-వీటన్నింటికీ తగిన సంస్థాగత వ్యవస్థలను నెలకొల్పడం ద్వారా గ్రామీణ భారతదేశంలో పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి మొదలయ్యింది.

పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి మూలంగా రైతాంగంలో విభజన తీవ్రతరమయ్యింది. సంప్రదాయ భూస్వామ్యవర్గం గ్రామీణ సామాజిక అధికార దొంతరల మీద తన అధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకున్నది. ఈ వర్గానికి దిగువున ఒక మోస్తరు స్థాయిలో ధనిక, మధ్యతరగతి రైతాంగం ఆవిర్భవించింది. అయితే కౌల్దార్ల విభేదాలు పెద్దఎత్తున కొనసాగడంతో మధ్యతరగతి రైతాంగంలో పెద్ద సెక్షను హీనమైన షరతలతో పేద రైతాంగంగా మారిపోయారు. పెరుగుతున్న భూమిలేని వ్యవసాయ కార్మికుల సరసకు చేరిపోయారు. ఆ రకంగా గ్రామీణ శ్రామిక వర్గం విస్తృతమయ్యింది. భూస్వాములు, ధనిక రైతాంగం కలిసి పేద రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికవర్గాన్ని యధేచ్ఛగా దోపిడీ చేస్తూ వస్తున్నారు.

వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిమిత భూసంస్కరణలు చేపట్టడం, కాంగ్రెస్ పార్టీలో భూస్వామ్య వర్గాల రాజకీయ ఆధిపత్యం కొనసాగుతూ రావడం మూలంగా మెజార్టీగా ఉన్న పేద రైతులు, వ్యవసాయ కార్మికుల తరగతులతో రైతాంగ ఐక్యత నెలకొల్పే క్రమం విచ్ఛిన్నమయ్యింది. దీనిమూలంగా భూస్వామ్య విధానం రద్దు, కౌలు సంస్కరణలు, భూపంపిణీ వంటి రాడికల్ డిమాండ్ల రాజకీయ విస్తృతి కొన్ని ప్రాంతాలకే పరిమితమయిపోయింది.

1980వ దశకం నాటికి వ్యవసాయక సమాజంలో పెట్టుబడిదారీ విధానం చొరబాటు గణనీయంగా పెరిగింది. పెట్టుబడిదారీ వ్యవసాయ అభివృద్ధి వివిధ ప్రాంతాల్లో వేర్వేరు స్థాయిలలో ఉన్నదని మార్క్సిస్టు విశ్లేషణలలో తేటతెల్లమయ్యింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి భూసంస్కరణలను అమలు చేసిన ప్రాంతాల్లో

"భూమిలేని వారిలో వివిధ సామాజిక తరగతులకన్నా దళితులు, ముస్లింలు, ఆదివా సుల శాతం అత్యధికంగా ఉన్నది. 2018-19 నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక ప్రకారం 57.3 శాతం దళితులు, 53.1 శాతం ముస్లింలు, 32.8 శాతం ఆదివాసుల కుటుంబాలు భూమి లేని వారిగా ఉన్నారు. అదే నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం చూస్తే 61.7 శాతం దళితులు, 61.3 శాతం ముస్లింలు, 40.8 శాతం ఆదివాసి కుటుంబాలు భూమి లేని వారులో ఉన్నారు."

భూపంపిణీ ఇంకెంత మాత్రం మౌలిక నినాదం కాకుండా పోయింది. భూసంస్కరణలు అమల యిన ప్రాంతాల్లో నూతన సాంకేతి పరిజ్ఞానం, వ్యవసాయ పరపతి, సహకార వ్యవసాయ, చౌక దుకాణాల వ్యవస్థ, వ్యవసాయం అనుబంధ పరిశ్రమలు, పాడి పశుపోషణ, చేపలవేట వంటి అవసరాలు ముందుకు వచ్చాయి. పెట్టు బడిదారీ విధానం బలంగా చొరబడిన ప్రాంతా ల్లో పాత పద్ధతులలో భూమిమీద ఆధిపత్యం ఉనికిలో లేకుండా పోవడంతో ఉత్పత్తి శక్తులు వేగంగా విస్తరించాయి.

ఈ ప్రాంత రైతాంగానికి వ్యవసాయానికి అవసరమైన ఇన్‌పుట్‌ల సరఫరా, నీటి పారుదల సౌకర్యం, మార్కెటింగ్, పంటలకు తగిన కొను గోళ్ళ ధరలు ప్రధాన సమస్యలుగా ముందుకు వచ్చాయి. అలాగే వ్యవసాయ కార్మికుల జీతా లు, వాళ్ళ పని పరిస్థితులు కూడా. పెట్టుబడి దారీ పూర్వసంబంధాలే ఆధిపత్యం చెలాయి స్తున్న దేశంలోని అనేక ప్రాంతాలలో భూమి సమస్య ఇంకా తన ప్రాధాన్యతను నిలుపు కున్నది. ఈ ప్రాంతాల్లో బడా భూస్వాముల పెత్తనం కొనసాగింది. కౌలు రైతులు, లీజుదార్ల మీద పెద్ద ఎత్తున దోపిడి కొనసాగింది. వ్యవసాయ కార్మికులలో అత్యధికులు దళితులు. ఆదివాసీ తరగతులకు చెందినవారే.

2

భూసమస్య ప్రాసంగికత కొనసాగింది - భూమిలేనితనం విస్తృతి చెందింది

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడిచినా అత్యధిక భూమి అతి కొద్దిమంది దగ్గర పోగుబడి, అత్యధికులు భూమిలేనివారుగా మిగిలిపోయారు. ఇదీ మన భారతీయ వ్యవసా యిక సమాజం ప్రధాన లక్షణం. 2018-19 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 41శాతం కుటుంబాలకు సెంటు భూమి కూడా లేదని నేషనల్ శాంపిల్ సర్వే లెక్క తేల్చింది. అయితే నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2015-16లో నిర్వహించిన ఒక సర్వేను అనుసరించి గ్రామీణ ప్రాంతాల్లో 47 శాతం కుటుంబాలకు సొంత భూమి అంటూ లేదని లెక్కతేలింది. 2011లో నిర్వహించిన సోషియో ఎకనమిక్ అండ్ కాస్ట్ సెన్సస్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మందికి ఎలాంటి భూమి లేదని లెక్క తేల్చారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ 2018 -19 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 54.4 శాతం, బీహార్‌లో 46.3 శాతం, తెలం గాణలో 42.5 శాతం కుటుంబాలకు స్వంత భూమి లేదని తేలింది. మోడీ ప్రభుత్వం గత కొన్నేళ్ళుగా ఎలాంటి సర్వేలు చేపట్టకపోవడం తో తాజా గణాంకాలు అందుబాటులో లేవు.

భూమిలేని వారిలో వివిధ సామాజిక తరగతులకన్నా దళితులు, ముస్లింలు, ఆదివా సుల శాతం అత్యధికంగా ఉన్నది. 2018-19 నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక ప్రకారం 57.3 శాతం దళితులు, 53.1 శాతం ముస్లింలు, 32.8 శాతం ఆదివాసుల కుటుంబాలు భూమి లేని వారిగా ఉన్నారు. అదే నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం చూస్తే 61.7 శాతం దళితులు, 61.3 శాతం ముస్లింలు, 40.8 శాతం ఆదివాసి కుటుంబాలు భూమి లేని వారులో ఉన్నారు.

భూమి మీద హక్కు కూడా మహిళలకన్నా మగవారికి ఎక్కువ శాతంగా ఉన్నది. 2015-16 సర్వేను అనుసరించి కేవలం 10.3 శాతం మంది మహిళల పేరిట స్వయంగానీ, జాయింట్‌గా గానీ-మాత్రమే భూమి పట్టాలు ఉన్నాయి. అయితే పోరాట చరిత్ర కలిగిన కేరళ రాష్ట్రంలో 32శాతం మేరకు మహిళల పేరిట భూమి పట్టాలు ఉన్నాయి.

భూయజమాన్యంలో అసమానతలు

గ్రామాల్లో అత్యధిక సాగుభూమి అతికొద్ది మంది చేతుల్లో పోగుపడి ఉన్నది. 2018-19 నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం 76 శాతం సాగుభూమి కేవలం 20 శాతం కుటుంబాల చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నది. గత రెండు దశాబ్దాల్లో ఈ శాతాలు ఇంకా పెరిగి ఉంటా యి. గ్రామీణ భారతదేశంలో 20.4 శాతం కుటుంబాలు 30 హెక్టార్లకు (70 ఎకరాలు) పైగా సాగుభూమిని కలిగి ఉన్నాయి. తమిళ నాడు లో 37.5 శాతంగాను, బీహార్‌లో 28.8 శాతంగాను, ఉత్తరాఖండ్‌లో 27.4 శాతంగానూ ఉన్నది.

గ్రామీణ ప్రాంతాల్లో సాగు భూములతో పాటు వ్యవసాయ సంబంధిత సాధనాలు, పరిక రాలు కూడా అతి కొద్దిమంది చేతుల్లో కేంద్రీ కృతమై ఉన్నాయని వి.కె.రామచంద్రన్ ఒక వ్యాసంలో వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి, ఇళ్ళు, తదితర స్థిర చరాస్తులు 40 నుండి 60 శాతం మేర కేవలం 5 శాతం కుటుంబాల చేతుల్లో పోగుపడి ఉన్నాయని వివిధ రాష్ట్రాల్లో ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ నిర్వహించిన అధ్యయనాల్లో లెక్క తేలింది. దిగువన ఉన్న 50 శాతం కుటుంబాల చేతుల్లో 1 నుండి 15 శాతం ఆస్తులు మాత్రమే ఉన్నా యని కూడా ఆ అధ్యయనాల్లో వెల్లడయ్యింది.

ఈ సంస్థ 6 రాష్ట్రాల్లోని 13 గ్రామాలలో క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహిస్తే ఆ 13 గ్రామాల్లో తొమ్మిదింట కేవలం 5 శాతం మంది భూస్వాములు 40 నుండి 54 శాతం భూమిని కలిగి ఉన్నారు. దిగువ నుండి 50 శాతం కుటుంబాలకు సున్నా నుండి ఆరు శాతం భూమి మాత్రమే ఉన్నది. మిగిలిన 4 గ్రామాల్లో 5 శాతం కుటుంబాలు 20 నుండి 35 శాతం భూమిని కలిగి ఉంటే, దిగువ నుండి 50 శాతం కుటుంబాల చేతుల్లో 10 నుండి 18% భూమి మాత్రమే కలిగి ఉన్నాయి.

భూసంస్కరణల విధానం

2013 పత్రం ప్రకారం మొత్తం 6.4 కోట్ల హెక్టార్ల భూమి ప్రభుత్వ బంజరు భూమి గా ఉన్నది. భారతదేశ భౌగోళిక వైశాల్యంలో ఇది 20శాతం మొత్తానికి సమానం. భారతదేశ బంజరు భూముల భౌగోళిక చిత్రపటం 2019ను అనుసరించి 2015-16 నాటికి 5.6 కోట్ల హెక్టార్ల భూమి అంటే దేశ భౌగోళిక వైశాల్యంలో 17 శాతం భూమి బంజరు భూమిగా ఉన్నదని లెక్క తేల్చారు.

2023లో అధికారికంగా ప్రచురించిన వ్యవసాయ గణాంకాల సూక్ష్మదర్శినిలో అటవీ భూములు, పడావు భూములు, వ్యవసాయ యోగ్యం కాని భూములు, బీడు భూములు, పశుగ్రాస భూములు, పచ్చిక భూములు వంటివి- ఏ తరగతి భూములు ఎంతమేరకు ఉన్నాయి అనే పూర్తి వివరాలు పొందుపరి చారు. వీటిలో సాగుకు లాయకీ అయిన భూముల పంపిణీ మీద దృష్టి పెట్టాలి. 1950

-51 నాటికి 2.3 కోట్ల హెక్టార్లుగా ఉన్న సాగుకు లాయకీ అయిన భూమి 2021-22 నాటికి 1.2 కోట్ల హెక్టార్లకు కుంచించుకుపోయింది. అయినప్పటికీ ఇది కూడా దేశ భౌగోళిక వైశాల్యంలో 4శాతంగా ఉన్నది.

2015 నాటికి దేశంలో 62 లక్షల హెక్టార్ల బంజరు భూముల పంపిణీ జరిగింది. అంటే మరో 60 లక్షల హెక్టార్ల భూమిని భూమిలేని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసేందుకు అవకాశం ఉన్నదని స్పష్టమవుతున్నది. వ్యవసాయ ఉద్యమం ఈ అంశం మీద దృష్టి పెట్టాలి.

బంజరు భూముల పంపిణీకి ఆటంకంగా నిలిచేది అక్రమ ఆక్రమణలు. ఇంతకన్నా ప్రధాన అవరోధం ఏమిటంటే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బంజరు భూములను భూమిలేని పేద కుటుంబాలకు పంపిణీ చెయ్యడానికి బదులు వందలాది ఎకరాల భూమి కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలకు కారుచౌకగా కట్టబెడుతున్నాయి. కొన్ని రాష్ట్రాలలో బంజరు భూములను అటవీశాఖకు సామాజిక అటవీ పెంపకం పథకం కింద బదిలీ చేసేసి ఆ భూములను సాగు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలను ఆక్రమణదారులుగా పరిగణించి కేసులు పెడుతున్నారు.

భూదాన ఉద్యమ భూమి

1950 మధ్య దశకంలో సాగిన భూదాన ఉద్యమం సందర్భంగా వివిధ రాష్ట్రాలలో మొత్తంగా 21.7 లక్షల ఎకరాల భూమిని సేకరించారు. 2015 నాటికి ఇందులో 16.7 లక్షల ఎకరాల భూమిని భూమిలేని పేద కుటుంబాలకు పంచినట్టు అధికారికంగా ప్రకటించారు. మిగిలిన 5 లక్షల ఎకరాల భూమి ఏమయ్యింది అనేది రహస్యంగా మిగిలిపోయింది. ఇందులో 1.6 లక్షల ఎకరాలు బీహార్ లో, 1.4 లక్షల ఎకరాలు తెలంగాణ/ఆంధ్ర ప్రదేశ్‌లో, 77,000 ఎకరాలు మహారాష్ట్రలో, 59,000 ఎకరాలు ఒడిషాలో, 31,000 ఎకరాల భూమి మధ్యప్రదేశ్‌లో అజ లేకుండా పోయింది.

మిగిలిన ఈ భూదాన ఉద్యమ భూమిని పంపిణీ చెయ్యడానికి జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం సాగలేదు. ఇంకా విచిత్రమైన సంగతి ఏంటంటే పంపిణీ చేసాం అని ప్రకటించిన భూదాన ఉద్యమ భూములు ఇప్పటికీ మెజార్టీ లబ్దిదారుల స్వాధీనంలో లేవు. ఈ భూములను చాలామేరకు పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడమో, లేదా ఆ ఊరిలో పలుకుబడి గల పెద్ద మనుషుల స్వాధీనంలోకో పోయాయి. బీహార్ భూసంస్కరణల కమిషన్ (డి.బందోపాధ్యాయ కమిషన్-2006) రాష్ట్రం లోని భూదాన ఉద్యమ భూపంపిణీలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని నిర్ధారించింది. భూదాన ఉద్యమ 'ల్యాండ్ బ్యాంక్'లో దాదాపు సగం భూమి పంపిణీకి అర్హమైనది కాదు అని బీహార్ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరించింది. ఈ నిర్ణయానికి తగిన కారణాలు మాత్రం వెల్లడించలేదు. బహుశా అంత భూమి స్థానికంగా పలుకుబడిగల పెద్ద మనుషుల కబ్జాలో ఉండడమే కారణం కావచ్చు. ఇతర రాష్ట్రాలు అనేకం భూదాన ఉద్యమ భూమిని పారిశ్రామికీకరణ అవసరాల కోసం కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలకు కేటాయించవచ్చని శాసనాలు తీసుకు వచ్చాయి. అలా కేటాయించిన భూముల్లో చాలామేరకు ఈనాటి వరకు ఎలాంటి పరిశ్రమలు స్థాపించబడలేదు. ఆ భూములను పొందిన కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలు వాటిని సట్టా వ్యాపారానికి వాడుకుంటున్నాయి.

పచ్చిక బయళ్ళు

2021-22 నాటికి దేశంలో కోటి హెక్టార్ల పచ్చికబయలు భూములు ఉన్నాయని వ్యవసాయ గణాంకాల సూక్ష్మదర్శిని 2023 నివేదించింది. ఇది కూడా గతంతో పోలిస్తే తగ్గుముఖం పడుతూ వచ్చింది.

ముసాయిదా జాతీయ భూసంస్కరణల విధానం 2013, పచ్చికబయళ్ళను గ్రామ ఉమ్మడి ఆస్తి వనరుగా వర్గీకరించింది. ఈ భూమి లను పంపిణీ చెయ్యడం కానీ, ఇతరేతర అవసరాలకు కేటాయించడం నిషిద్ధమనీ, ఈ భూములను ఆక్రమించుకున్న వారిమీద భారీ జరిమానాలు విధిస్తాం అనీ ఆ ముసాయిదాలో పేర్కొన్నారు. గ్రామ ఉమ్మడి ఆస్తి వనరుగా ఉన్న భూములు నిజంగానే గ్రామస్థులు అందరికీ ప్రయోజనకారిగా ఉంటుందని రాజకీయేతర సామాజిక కార్యకర్తలు, మేధావి వర్గం బలంగా నమ్ముతుంటారు. ఈ భూముల ఆక్రమణలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు కూడా తీర్పులు ఇచ్చింది. అయినప్పటికీ ఈ భూముల వ్యక్తిగత, సమిష్టి సాగుకోసం భూమిలేని పేదలు ముఖ్యంగా దళితులు సమరశీలంగా పోరాడిన చరిత్ర ఉన్నది. గ్రామ పచ్చికబయళ్ళు, గ్రామకంఠం భూములను కూడా భూమిలేని పేదలకు పంచి పెట్టాలి అని వ్యవసాయ ఉద్యమం రాజకీయంగా స్థిరమైన వైఖరి తీసుకోవాలి.

> **"1950లలో సాగిన భూదానోద్యమం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో మొత్తం 21.7 లక్షల ఎకరాల భూమి సేకరించారు. 2015 నాటికి ఇందులో 16.7 లక్షల ఎకరాల భూమిని భూమిలేని పేద కుటుంబాలకు పంచినట్టు ప్రకటించారు. మిగిలిన 5 లక్షల ఎకరాల భూమి ఏమయ్యిందో తెలీదు. ఇందులో 1.6 లక్షల ఎకరాలు బీహార్ లో, 1.4 లక్షల ఎకరాలు తెలంగాణ/ఆంధ్ర ప్రదేశ్‌లో, 77,000 ఎకరాలు మహారాష్ట్రలో, 59,000 ఎకరాలు ఒడిషాలో, 31,000 ఎకరాల భూమి మధ్యప్రదేశ్‌లో అజ లేకుండా పోయింది."**

ఆదివాసులకు అటవీభూములు

ఆదివాసులకు, సంప్రదాయకంగా అడవుల లో నివసించేవారికి అటవీభూములపై హక్కులు కల్పించడం అన్న అంశం 1950వ దశకం నుండి వివాదాస్పదంగా కొనసాగుతున్నది. స్వాతంత్ర్యానంతర తొలిదశకాల్లో వలస పాలకుల భావజాలానికి అనుగుణంగా అడవులను ఆర్థిక వనరుగా పరిగణించడం కొనసాగింది. అలాగే అటవీ పరిరక్షణ అనేది మరో కోణంగా కొనసాగింది. అటవీ నిర్వహణ అత్యంత కేంద్రీకృత అంశంగా మారి అడవుల మీద ఆధారపడి నివసించే ఆదివాసీ జనాభా హక్కులను ఎంతమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. అడవులను దోచుకోవడానికి ఆదివాసులు ప్రధాన అడ్డంకిగా మారరని పాలకవర్గాలు భావించాయి. పర్యవసానంగా ఆదివాసుల సమూహాలను సంప్రదాయకంగా వారు నివసిస్తున్న గూడేల నుండి నిర్బంధంగా ఖాళీ చేయించడం, ఇందుకు ప్రతిగా పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలు కొనసాగడం అనేది సమీప గత చరిత్రగా నిలిచింది.

1980వ దశకం చివరినాళ్ళ నుండి ఈ దృక్పథంలో మార్పు వచ్చింది. ఆదివాసుల జీవనోపాధికి అడవులు, అటవీ ఉత్పత్తులు ఎంత కీలకమో ప్రభుత్వం గుర్తించింది. ఆదివాసులకు అటవీ భూములపై హక్కులు కల్పించాలని వామపక్షాలు ఉద్యమించాయి. వామపక్ష పార్టీల బలమైన మద్దతు మీద అధికారం చేపట్టిన యు.పి.ఎ-1 ప్రభుత్వం ఆదివాసుల విస్తాపనకు స్వస్తి చెప్పి, వారికి అటవీ భూములపై హక్కులు కల్పించాలని వామపక్షాలు ఒత్తిడి తీసుకు వచ్చాయి. ఫలితంగా 2006లో ఆదివాసుల అటవీ హక్కుల చట్టం (ఎఫ్.ఆర్.ఎ) వచ్చింది. చారిత్రకంగా అన్యాయానికి, అవమానాలకు,

“ ఈరోజుకీ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 2013 నాటి భూసేకరణ, పునరావాస చట్టాన్ని పాటించడం లేదు. లాండ్ పూలింగ్ పేరిట, భూసేకరణ చట్టం పరిధిలోకి రాని విధంగా బేరాలు పేరిట వేలాది ఎకరాలు సమీకరిస్తున్నాయి. 2013 నాటి కేంద్ర చట్టంలోని ప్రజాప్రయోజనకారి షరతులను సడలించే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసాయి. ముఖ్యంగా 2013నాటి చట్టంలో సెక్షన్ 10(జీ)9ను పలచన చేసాయి. ”

అణచివేతలకు గురవుతూ వచ్చిన ఆదివాసులకు ఈ చట్టం రక్షణగా నిలిచింది.

అయితే ఈ చట్టం అమలు పరిమితంగానే కొనసాగింది. 2025 జూన్ 1 నాటికి దేశంలో 51.2 లక్షల దావాలు నమోదు అయితే 25.1 లక్షల వాజ్యాలు పరిష్కరించి పట్టాలు అంద చేసారు. అంటే ఇంకా సగానికిపైగా వాజ్యాలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి.

ఈ పథకం అమలు ఇంత నాసిరకంగా ఉండడానికి అనేక చిక్కులే కారణం. హక్కుదార్లకు ఇచ్చిన పట్టాలలో వాళ్ళకు కేటాయించిన అటవీ భూమి మ్యాప్ లేకపోవడం, ఉన్న పట్టాలలో వాళ్ళ స్వాధీనంలో ఉన్న భూమికి మ్యాప్ లో ఉన్న భూమికి పొంతన లేకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. ఇక ఎఫ్.ఆర్.ఎ చట్టానికి ప్రభుత్వాధికారులు వక్రభాష్యం చెప్పడం, చట్ట ఉల్లంఘనలకు పాల్పడడం ఆనవాయితీగా మారింది. జిల్లా అధికార యంత్రాంగం లబ్ధిదారుల దావాలను ఏకపక్షంగా, అన్యాయంగా తిరస్కరిస్తుంది. ఈ వ్యాజ్యాల పరిష్కారంలో వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య ఉండాల్సిన సమన్వయం పూర్తిగా కొరవడింది. అలాగే పట్టాలు ఇచ్చిన భూములు ఆదివాసులకు స్వాధీనం చెయ్యడంలో కూడా సంస్థాగత వైఫల్యం తీవ్ర స్థాయిలో ఉన్నది.

వివిధ రాష్ట్రాలలో ఎఫ్.ఆర్.ఎ చట్టం అమలు తీరు తీవ్ర అసమానతలతో కూడుకుని ఉన్నది. 2025 జూన్ నాటికి ఐ.ఎఫ్.ఆర్ క్లెయిమ్‌లు ముఖ్యంగా ఒడిషా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణా, త్రిపుర రాష్ట్రాల నుండి ఎక్కువగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం దావాలలో 70శాతం దావాలు ఈ ఆరు రాష్ట్రాల నుండే ఉన్నాయి. అలాగే కమ్యూనిటీ అటవీ హక్కుల (సి.ఎఫ్.ఆర్) దావాల విషయంలో 70 శాతం దావాలు కేవలం ఐదు రాష్ట్రాల నుండే –ఒడిషా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ మహారాష్ట్ర, గుజరాత్ – ఉన్నాయి.

ఎఫ్.ఆర్.ఎ చట్టం అమలు కోసం వామపక్షేతర రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండడం లేదు. ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్నా ఈ చట్టం అమలుకు నిజాయితీగా కృషి చెయ్యడం లేదు. ఎఫ్.ఆర్.ఎ చట్టాన్ని ఎన్నికల నినాదంగా, ఓట్లు దండుకునే సాధనంగా ఈ రెండు పార్టీలు పరిగణిస్తూ ఉన్నాయి.

సులభంగా మారిన భూసేకరణ

1970వ దశకంలోనే భూ సంస్కరణల చట్టం అమలు వెనుకపట్టు పట్టేసింది. 1991 లో ఉదారవాద ఆర్థిక విధానాలు ముందుకు రావడంతో అనేక రాష్ట్రాల్లో భూసంస్కరణల చట్టాన్ని తిరగరాసి వ్యవసాయ రంగంలోనూ, వెలుపలా పెట్టుబడి సంచయానికి దోహదం చేసే ధోరణులు పెద్ద ఎత్తున కొనసాగాయి. భూమిని వ్యాపార సరుకుగా మార్చేసి మార్కెట్‌లో పెద్ద ఎత్తున కొనుగోళ్ళు, అమ్మకాలు సాగేలా చూసారు. బేషరతుగా భూమిని వ్యక్తులకు, సంస్థలకు యథేచ్ఛగా కట్టబెట్టడానికి భూసంస్కరణల చట్టం ఆటంకంగా మారింది. దీంతో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సీలింగ్ పరిమితులు తొలగించడం ద్వారా ఈ చట్టాన్ని నీరుకార్చే సాయి.

పారిశ్రామిక యూనిట్‌లు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్‌లు), ఐ.టి. పార్కులు, నివాస భవనాలు నిర్మించడానికి అనువుగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకూ కేటాయించాలనే డిమాండ్ ఊపందుకున్నది. కాబట్టి భూసంస్కరణల చట్టంలోని సీలింగ్ పరిమితులను మార్చడంతో పాటు ఈ డిమాండ్‌కి అనుకూలంగా, భూకొనుగోళ్ళలో ప్రైవేటు పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహానికి అనువుగా చట్టంలో మార్పులు తీసుకువచ్చారు.

ఈ చట్టాలను అడ్డం పెట్టుకుని 2013 వరకు రైతులకు, భూయజమానులకు నామమాత్రపు పరిహారం చెల్లించి లక్షలాది ఎకరాలను లాక్కుని చౌకధరలకు ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు, పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. భూమిని కోల్పోయినవారికి సహాయ పునరావాసాలు కల్పించే కనీస బాధ్యతను కూడా ప్రభుత్వాలు విస్మరించాయి. 2013లో భూసేకరణ చట్టంలో తగిన మార్పులు తీసుకురావడం ద్వారా భూములు కోల్పోయిన వారికి మార్కెట్ ధరలతో కూడిన పరిహారం చెల్లించడం, సహాయ పునరావాసాలు కల్పించడానికి ప్రాతిపదికను రూపొందించారు.

అయితే కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలు ఈ షరతులను తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చాయి. ఈ ఒత్తిడికి తలొగ్గి నరేంద్రమోడీ ప్రభుత్వం 2014 డిసెంబరులో సదరు చట్టంలోని ప్రజాప్రయోజన కరమైన క్లాజులను నీరుకార్చేస్తూ ఒక ‘ఆర్డినెన్స్’ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వాలకు భూయజమానుల అంగీకారంతో పనిలేకుండా ‘ప్రైవేటు ప్రయోజనాల’ కోసం నిర్బంధంగా భూములు సేకరించే అధికారం దఖలుపడింది. అయితే ఈ ఆర్డినెన్స్ చట్టంగా రూపుదిద్దుకోలేకపోయింది. సదరు బిల్లు రాజ్యసభలో వీగిపోయింది.

అయినప్పటికీ ఈరోజుకీ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 2013నాటి భూసేకరణ, పునరావాస చట్టాన్ని పాటించడం లేదు. లాండ్ పూలింగ్ పేరిట, భూసేకరణ చట్టం పరిధిలోకి రానివిధంగా బేరాలు పేరిట వేలాది ఎకరాలు సమీకరిస్తున్నాయి. 2013 నాటి కేంద్ర చట్టంలోని ప్రజాప్రయోజనకారి షరతులను సడలించే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసాయి. ముఖ్యంగా 2013నాటి చట్టంలో సెక్షన్ 10(జీ)9ను పలచన చేసాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మోడీ ప్రభుత్వం డిసెంబరు 2014లో తీసుకువచ్చిన ఆర్డినెన్సు సారాన్ని లోపాయికారిగా రాష్ట్రాలవారీ చట్టాల్లో పొందుపరిచాయి.

పర్యవసానంగా వివిధ ప్రభుత్వాలు విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వ్యవసాయ భూములను నిర్బంధంగా సేకరించడానికి వ్యతిరేకంగా వ్యవసాయ రంగంలో అనేక పోరాటాలు జరిగాయి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 2013 నాటి భూసేకరణ, సహాయ పునరావాస చట్టాన్ని తూ.చ తప్పక అనుసరించాలనే డిమాండ్‌తో వ్యవసాయ ఉద్యమాలు నడిచాయి. 2014నాటి ఆర్డినెన్సులో క్లాజులను దొడ్డిదోవన 2013 నాటి చట్టంలో పొందుపరచడాన్ని తీవ్రంగా నిరసించాయి. ప్రజాప్రయోజన వ్యతిరేకమయిన క్లాజులను ఉపసంహరించాలి అని డిమాండ్ చేసాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాల కోసం సేకరించాలి అనుకున్నప్పుడు చట్టానికి లోబడి సదరు యజమానుల సమ్మతి పొందడంతోపాటు ఈ సేకరణ సామాజికంగా కలిగించే ప్రభావాలను మదింపు చేసే అధ్యయనాలూ తప్పనిసరిగా నిర్వహించాలని పట్టుపట్టాయి.

(తదుపరి భాగం వచ్చే సంచికలో)

మతతత్వం

ఆరాధన రాజకీయాల నుండి బయటపడలేమా?



రచయిత చరిత్రకారుడు, సాంస్కృతిక విమర్శకుడు, డాన్ పత్రిక కాలమిస్టు. పాకిస్తాన్‌లోని పరిణామాలపై ఆయన అయిదు గ్రంధాలు రాశారు. ప్రస్తుతం ఆయన అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలోని అంతర్జాతీయ ఫోరమ్‌లో పరిశోధనలు చేస్తున్నారు.

నదీమ్ ఎఫ్ పరాచా

పరపతి గల నాయకులు, డిజిటల్ ఎకో ఛాంబర్లు, గుడ్డి నమ్మకం ఆధారిత రాజకీయం వంటివి నేటి ప్రజాకర్షక ఉద్యమాల ముఖ్య లక్షణాలు. ఇలాంటి ప్రజాకర్షక రాజకీయాల నుండి బయటకు రావడం అనేది తరచుగా ఒక వ్యసనం నుండి బయటపడటం లేదా కఠినమైన నియంత్రణ కలిగిన ఒక మతారాధన (కల్ట్) నుండి తప్పించుకోవడంతో సమానంగా ఉంటుంది.

గడిచిన దశాబ్దకాలంగా, ప్రపంచ రాజకీయాలు విపరీతమైన భావోద్వేగాలు, వ్యక్తిగత ఆరాధనల (కల్ట్) ఆధారంగా నడిచే దిశగా సాగుతున్నాయి. నిరంకుశ నియంత్రణ, గుడ్డి నమ్మకాలపై పరిశోధన చేసిన స్టీవెన్ హాసన్, రత్ బెన్-ఘియాట్ వంటి అమెరికన్ మేధావులు... సాధారణంగా సమాజం అంచున ఉండే 'ఫ్రింజ్ కల్ట్' (సమాజం అంచున కొద్దిమందితో ఏర్పడే మతారాధనా గ్రూపులు)కి ఉపయోగించే పదజాలాన్నే ఈ ఆరాధన రాజకీయ పాలనాశైలిని వివరించడానికి వినియోగిస్తున్నారు.

ఈ పోలిక కొన్ని ఆధునిక రాజకీయ సమూహాలు ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకోవడానికి ఒక విశ్లేషణాత్మక చట్రంగా ఉపయోగపడుతుంది. ది గార్డియన్ పత్రికలోని ఒక కథనంలో అమెరికన్ జర్నలిస్ట్ రేచెల్ లీంగాంగ్, 'లీవింగ్ మాగా' వంటి నెట్‌వర్క్‌ల ఆవిర్భావాన్ని గురించి నొక్కి చెప్పారు. (మాగా అంటే మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ అని. డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన మితవాద రాజకీయ ఉద్యమం అది) పాపులిస్ట్ 'మాగా' (-మాగా) ఉద్యమాన్ని వీడి వెళ్లిన తీవ్ర అసంతృప్తి కలిగిన సభ్యులకు ఈ నెట్‌వర్క్‌లు సహాయం చేస్తాయి. నేటి పాపులిస్ట్ ఉద్యమాల నుండి దూరంగా జరగడం అనేది తరచుగా ఒక వ్యసనాన్ని వదిలించుకోవడం లేదా ఒక కఠిన నియంత్రణ ఉన్న కల్ట్ నుండి బయటపడటంతో సమానమని లీంగాంగ్ వివరించారు.

ఇలాంటి ఉద్యమాలను నిర్వచించే విధానాల్లో ఒక రక్షకుడిలాంటి వ్యక్తి పట్ల అంకితభావం, తీవ్రమైన సామాజిక వేర్పాటు, సర్వవ్యాప్తమైన ఒక గుర్తింపు ముఖ్యమైనవి. అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ 'మాగా' ఉద్యమం, భారతదేశంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ, ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పి.టి.ఐ)లతో పాటు అర్జెంటీనాలోని హావియర్ మిలీ 'లా లిబర్టాడ్ అవంజా', బ్రెజిల్‌లోని బొల్సోనారిజమ్‌లు ఈ కోవకు చెందినవే.

ఏదైనా 'కల్ట్-లాంటి' ఉద్యమానికి ప్రాణం ఒక ఆకర్షణీయమైన నాయకుడు. ప్రజాకర్షక అధికారం అనేది మద్దతుదారులు తమ నాయకుడికి ఆపాదించే అతీంద్రియ శక్తి పై ఆధారపడి ఉంటుంది అని 20వ శతాబ్దపు ప్రారంభంలో జర్మన్ సామాజికవేత్త మాక్స్ వేబర్ గుర్తించారు.

ఆధునిక ప్రజాకర్షణ లేదా 'రాజకీయ కల్ట్' ప్రాథమికంగా ఒక ముఖ్య సూత్రంపై ఆధారపడతాయి అని చిలీ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోబల్ ఆర్. కల్టవాసర్, జర్మన్ చరిత్రకారుడు జాన్-వెర్నర్ ముల్లర్ అభిప్రాయపడ్డారు.అవినీతిమయమైన పాలక వర్గానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆధునిక రాజకీయ కల్ట్ తమ నాయకుడిని ఈ పాలక వ్యవస్థను ఓడించగల ఏకైక రక్షకుడిగా చిత్రీకరిస్తాయి.

అమెరికా విషయానికి వస్తే, ట్రంప్ తనను తాను రాజకీయాల్లో చెత్తను తొలగించగల (డ్రెయిన్ ది స్వాంప్) ఏకైక నాయకుడిగా చిత్రీకరించుకున్నారు. ఇండియాలో మోడీ తనను తాను అవినీతికి లొంగని ఒక 'చౌకీదార్' గా, జాతీయ గౌరవాన్ని పునరుద్ధరించగల ఒక ఆధ్యాత్మిక సన్యాసిగా చెప్పుకుంటూ, తన చాయ్ వాలా నేపథ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో పోల్చారు. పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ఒక క్రికెట్ హీరోగా, దాతగా సంపాదించుకున్న ఇమేజ్‌తో తన చుట్టూ ఒక గొప్ప వ్యక్తిత్వ తేజస్సును నిర్మించుకున్నారు. తనను తాను కేవలం రాజకీయ నాయకుడిగానే కాక, నీతిమంతుడిగా, 'సాదిక్' (సత్యవంతుడు)గా, 'అమీన్' (నమ్మకస్థుడు) గా అవినీతి వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తిగా ప్రచారం చేసుకున్నారు.

ఈ మూడు సందర్భాల్లోనూ, ఆయా ఉద్యమాలు/పార్టీలు నాయకుడితో విడదీయరాని విధంగా ఏకమైపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ విధానాల కంటే నాయకుడి పట్ల ఉన్న సంపూర్ణ వ్యక్తిగత విశ్వసనీయతకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంది. ఈ పాక్షిక దృష్టి ప్రపంచాన్ని చూసే దృక్కోణాన్ని మారుస్తుంది. విధానపరమైన రాజకీయ విభేదాల కంటే నైతిక, మతపరమైన భాషకు ప్రాధాన్యత పెరుగుతుంది. రాజకీయ ప్రత్యర్థులను భిన్నాభిప్రాయాలు గల పౌరులుగా పరిగణించకుండా, తమ మనుగడకు ముప్పుగా లేదా నైతిక శత్రువులుగా చూస్తారు. అమెరికన్ సామాజికవేత్త జాన్నా లాలిచ్ పరిశోధించినట్లుగా, మాగా మాజీ సభ్యులు తమ నాయకుడికి వ్యతిరేకంగా ఏ చిన్న వ్యతిరేకత ఎదురైనా తీవ్ర భయానికి, ఆగ్రహానికి గురైనట్లు చెప్పారు. వాళ్ళు దానిని తరచుగా 'డీప్ స్టేట్' శక్తుల కుట్రగా భావిస్తారు.

ఇండియాలో మోడీ మద్దతుదారులు, పార్టీ యంత్రాంగం తరచుగా ఆయనపై వచ్చే

"రాజకీయ భాగస్వామ్యాన్ని ఆధ్యాత్మిక, మనుగడ సంబంధిత విషయంగా మార్చడం వల్ల నాయకుడిపై వచ్చే విమర్శ నైతిక ద్రోహంతో సమానమవుతుంది. 2022లో ఖాన్‌ను విశ్వాసపరీక్ష ద్వారా తొలగించినప్పుడు, ఆయన అనుచరులు అది విదేశీ కుట్ర అనే కథనాన్ని ఇట్టే నమ్మారు. తద్వారా తన అనుచరుల్లో ఖాన్‌కు లభించిన మద్దతు, వారిని ఒక 'కల్ట్'గా రుజువు చేసింది. ఈ మితవాద పాపులిస్ట్ ఉద్యమాల ప్రధాన బలమేమిటంటే, అవి ఒనగూర్చే సామాజిక బంధం, గుర్తింపులే."



విమర్శలను దేశద్రోహంగా పరిగణిస్తాయి. మోడీ అధికారాన్ని దేశంతో సమానంగా చిత్రీకరిస్తాయి. ఇమ్రాన్ ఖాన్ పార్టీ కూడా ఖాన్‌ను జైలు నుండి విడిపించే పోరాటాన్ని ఒక పవిత్రమైన విధిగా (జిహాద్) ప్రచారం చేస్తుంది. ఖాన్ స్వయంగా తన రాజకీయ జీవితాన్ని 'హక్' (సత్యం), 'బాతిల్' (అసత్యం) ల మధ్య జరుగుతున్న నిరంతర ధర్మయుద్ధంగా ప్రచారం చేసుకున్నారు.

రాజకీయ భాగస్వామ్యాన్ని ఆధ్యాత్మిక, మనుగడ సంబంధిత విషయంగా మార్చడం వల్ల నాయకుడిపై వచ్చే విమర్శ నైతిక ద్రోహంతో సమానమవుతుంది. 2022లో ఖాన్‌ను విశ్వాసపరీక్ష ద్వారా తొలగించినప్పుడు, ఆయన అనుచరులు అది విదేశీ కుట్ర అనే కథనాన్ని ఇట్టే నమ్మారు. తద్వారా తన అనుచరుల్లో ఖాన్‌కు లభించిన మద్దతు, వారిని ఒక 'కల్ట్'గా రుజువు చేసింది. ఈ మితవాద పాపులిస్ట్ ఉద్యమాల ప్రధాన బలమేమిటంటే, అవి ఒనగూర్చే సామాజిక బంధం, గుర్తింపులు.

ఆధునిక పాపులిస్ట్ ఉద్యమాలు ఇచ్చే ఈ కమ్యూనిటీ భావనను కెనడియన్ రాజకీయ సైద్ధాంతికవేత్త లారా కె ఫీల్డ్ నష్టదాయకమైనదని విశ్లేషించారు. సభ్యులు ఈ సమూహంలో ఒక లక్ష్యాన్ని, గుర్తింపును పొందుతారు. అయితే, ఈ అనుబంధానికి బాహ్య ప్రపంచం నుండి ఒంటరి కావడమనే మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. సంప్రదాయ కల్ట్ భౌతికంగా దూరం చేయడం ద్వారా ఇది సాధిస్తే, ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అల్గారిథమ్‌ల ద్వారా ఇదే ఫలితాన్ని సాధిస్తున్నాయని షెషానా జుబోఫ్, సి. థిన్గుయేన్ అంటున్నారు.

మనుషులను ఎంగేజ్ చేసే మోడల్స్ సహజంగానే కోపాన్ని, నైతిక ఆగ్రహాన్ని, కుట్ర సిద్ధాంతాలను ప్రోత్సహిస్తాయి. కాలక్రమేణా, ఈ అల్గారిథమ్‌లు 'ఫిల్టర్ బబుల్స్'ను సృష్టిస్తాయి. ఇవి సభ్యులను ప్రచ్ఛన్న వాస్తవికతలోకి నెట్టివేసి, విరుద్ధ భౌతిక వాస్తవాల నుండి దూరం చేసి, వారి మౌలిక ఆలోచనలను మార్చేస్తాయి.

ఈ మానసిక బంధాన్ని అమెరికన్ న్యాయ నిపుణుడు డాన్ కహాన్ 'ఐడెంటిటీ-ప్రొటెక్టివ్ కాగ్నిషన్'గా అభివర్ణించారు. వ్యక్తులు తమ ఆత్మగౌరవాన్ని ఒక సమూహపు సిద్ధాంతంతో ముడిపెట్టినప్పుడు, నిజాలను అంగీకరించడం తమ ఉనికికే ప్రమాదంగా భావిస్తారు. ఈ అసౌకర్యం నుండి తప్పించుకోవడానికి, వారు నిష్పాక్షికమైన ఆధారాలను తిరస్కరిస్తూ, తమ నాయకుడి ప్రతిష్టను కాపాడే కథనాలను మాత్రమే నమ్ముతారు. అందుకే పాపులిస్ట్ పార్టీ మద్దతుదారులతో మాట్లాడటం "గోడతో మాట్లాడినట్లే" అని విమర్శకులు అంటారు.

అమెరికన్ తత్వవేత్త జేసన్ స్టాన్లీ నొక్కి చెప్పినట్లుగా, నిరంకుశ, కల్ట్-లాంటి రాజకీయ ఉద్యమాలు ప్రజా వాస్తవికతను నాశనం చేసి, దాని స్థానంలో విధేయతా పరీక్షలను ముందుకు నెడతాయి. ఏ చిన్న అనుమానాన్ని వ్యక్తం చేసినా సమాజం నుండి శిక్ష ఎదురవుతుంది.

పాపులిస్ట్ నాయకులు సాంప్రదాయ మాధ్యమాలను దాటవేసి, సోషల్ మీడియా ద్వారా లక్షలాది మందికి నేరుగా తమ సందేశాలను పంపుతారు. ఇది ఆన్‌లైన్ సైన్యాలను తయారుచేస్తుంది. జొనాథన్ హైడ్, జాన్ ఆస్కోనాస్ వివరించినట్లు, డిజిటల్ సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు, రీట్వీట్‌లు నాయకుడి పట్ల గుడ్డి విశ్వాసానికి తక్షణ బహుమతిలా పనిచేస్తాయి.

ఆధునిక పాపులిస్ట్ గ్రూపులను 'కల్ట్'గా గుర్తించడం ద్వారా వారి మానసిక స్థితి మనకు అర్థమవుతుంది. చర్చలు లేదా విధానాల నుండి అల్గారిథమిక్‌గా నియంత్రించబడే గుర్తింపు వ్యవస్థగా రాజకీయాలు మారినప్పుడు, దాని నుండి బయటపడటం నవాలుగా మారుతుంది.

ఈ ఉద్యమాల నుండి బయటపడటానికి మానసిక గాయాలు, భయం, సమాజం నుండి దూరమవడం అన్న సమస్యలకు ఉపశమనం అందించడానికే 'లీవింగ్ మాగా' వంటి కార్యక్రమాలు ముందుకు వచ్చాయి. పాశ్చాత్య దేశాల్లో అయినా, భారతదేశంలో మోడీ ఆధిపత్యం అయినా, లేదా పాకిస్తాన్‌లో పి.టి.ఐ అయినా – వీటి మధ్య ఉన్న సారూప్యత ఒక్కటే. ఒక రాజకీయ ఉద్యమం ఒకే ఒక్క నాయకుడి పట్ల సంపూర్ణ అంకితభావాన్ని, విధేయతను కోరుతూ, డిజిటల్ ఎకో ఛాంబర్ల ద్వారా విమర్శనాత్మక ఆలోచనలను దూరం చేసినప్పుడు, అది సాధారణ రాజకీయ వ్యవస్థగా కాక, ఒక కల్ట్ ప్రపంచంలోకి అడుగుపెడుతుంది.

(అనువాదం: కె. సత్యరంజన్)

భారతీయ పౌరసత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న 'సర్'

(11వ పేజీ తరువాయి)

మార్చాలని కోరుకునే ఒక బృహత్తర పథకంలో 'సర్' కేవలం ఒక కీలక అంశం మాత్రమే. ఇది దేశ గుర్తింపును "హిందూ జాతీయ రాజ్యం"గా పునర్నిర్వచించాలని చూస్తుంది. అయితే ఇందులో వ్యూహాత్మక కారణాల వల్ల ప్రస్తుతానికి ''నవర్ణ'' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారు.

చివరికి, ఆంక్షలు తొలగిపోయినప్పుడు, అది పూర్తిస్థాయి, నిస్సంకోచమైన, సర్వతో ముఖమైన "సవర్ణ హిందూరాష్ట్ర"గా ఆవిష్కరించబడుతుంది.

భారతదేశం గణతంత్ర రాజ్యంగా మారినప్పుడు, దాని వ్యవస్థాపక పితామహులు దాని భూభాగంలో నివసించే ప్రతి ఒక్కరికీ దానిని ఒక నివాసంగా మార్చారు. గణతంత్రంలో సభ్యత్వం, లేదా పౌరసత్వం అనేది మతం, కులం, లింగం, భాష, సంస్కృతి, నివాస ప్రాంతం, వర్ణం, ఆర్థిక స్థితి, విద్యా అర్హతలు వంటి ఇతర లక్షణాలపై ఆధారపడి లేదు. భారతదేశాన్ని తమ నివాస భూమిగా ఎంచుకున్న ప్రతి ఒక్కరూ పౌరులే. ఓటర్లు కూడా. మతపరమైన లక్షణాలను బట్టి ఒకరిని ఎవరో ఒకరిని చట్టబద్ధమైన యజమానులుగా ప్రత్యేకించలేదు. ప్రతి ఒక్కరూ అర్హులే.

జాతీయ రాజ్యాలు ఏర్పడినప్పుడు ఐరోపా ఒక విభిన్నమైన అనుభవాన్ని చవిచూసింది. అక్కడ హక్కుగా పొందిన ప్రజలు, ఇతరులు లేదా మైనారిటీలు ఉండేవారు. అదే ఐరోపా జాతీయ రాజ్యాలకు ఆధారం. అక్కడ మెజారిటీలు, మైనారిటీలు ఉండేవి. మైనారిటీల నివాసం, వారు మెజారిటీలకు ఆమోదయోగ్యంగా మారడంపై ఆధారపడి ఉండేది. ఐరోపా దేశాలు, లేదా తమ జాతీయ రాజ్యాలను నిర్మించుకోవడానికి ఆ సమూహాను అనుసరించిన దేశాలు, మైనారిటీలను అణచివేశాయి. వారి భూభాగాల నుండి వారిని వెళ్లగొట్టాయి. లేదా వారిని నిర్మూలించాయి. 15వ శతాబ్దం చివరలో ఐబీరియన్ ద్వీపకల్పాన్ని ప్రక్షాళన చేయడం నుండి మొదలుకొని, నేడు ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న జాతి ప్రక్షాళన వరకు ఏకరీతి దేశాలను సృష్టించడానికి జరిగిన అనేక రక్తపాత ప్రయత్నాలకు చరిత్ర సాక్షిగా నిలుస్తుంది.

కానీ భారతదేశం ఒక భిన్నమైన మార్గాన్ని ఎంచుకుంది. దేశ వ్యవస్థాపక పితామహులు, తమ వైవిధ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి జీవించడానికి, అభివృద్ధి చెందడానికి రాజ్యం చోటు కల్పించే విధంగా దేశ సామూహిక జీవనాన్ని రూపొందించారు.

ఐరోపా జాతీయ-యాజమాన్య రాజ్య భావన నుండి స్ఫూర్తి పొందుతున్న హిందూత్వ సిద్ధాంతం భారత గణతంత్రాన్ని కూడా ఒకే జాతికి-అంటే హిందూ జాతికి-చెందిన రాజ్యంగా మార్చాలని కోరుకుంటున్నది. ఇది చెయ్యాలంటే ఇతరుల గుర్తింపులను తుడిచి పెట్టేంత వరకు తమలో కలుపుకోవాలి లేదా దేశ భూభాగం నుండి వెళ్లగొట్టాలి, లేదా జాతి నిర్మూలన ద్వారా నిర్మూలించాలి నేటి భారతదేశంలో తమలో కలవని మైనారిటీలను వెళ్లగొట్టడం, భౌతికంగా నిర్మూలించడం రెండూ ఆచరణ సాధ్యం కానివి.

పౌరసత్వాన్ని నిర్మూలించడం

అయితే, రాజకీయపరమైన 'ఇతరులను' నిర్మూలించడం సాధ్యమే. పౌరుడిని నిర్మూలించే బదులు, పౌరసత్వాన్నే నిర్మూలించవచ్చు. అటువంటి నిర్మూలన కోసమే రూపొందించబడిన ఆయుధమే 'సర్'. ఇది 'అవాంఛనీయ' సెక్షన్ల ఓటు హక్కును హరించి, వారి పౌరసత్వాన్ని నిర్మూలిస్తుంది. ఓటు హక్కు లేకుండా పౌరసత్వం డొల్లగా, సారహీనంగా ఉంటుందనేది స్పష్టం. ఓటు హక్కును హరించడం పౌరసత్వాన్ని డొల్లగా చేస్తుంది. అందువల్ల, 'సర్' అనేది రక్తపాతరహిత రాజకీయ జాతి నిర్మూలన తప్ప మరేమీ కాదు. ఇది కేవలం ఓటర్ల జాబితాను శుద్ధి చేయడానికి కాకుండా, దేశాన్ని 'శుద్ధి' చేయడానికి ఉద్దేశించిన ఒక సాధనం. ఇది పౌరసత్వాన్ని నిర్మూలిస్తుంది, ప్రజలను రాజకీయ సమాజం నుండి బయటకు నెట్టివేస్తుంది, వారు భారత రాజ్య సరిహద్దుల్లోనే నివసిస్తూ ఉన్నప్పటికీ వారిని దేశరహితంగా చేస్తుంది.

వివిధ రకాల ప్రజలు, సంస్కృతులు, భాషలు, మతాలకు నిలయంగా ఉన్న భారత దేశం అనే భావన అత్యంత వేగంగా, దుర్మార్గంగా ధ్వంసం చేయబడుతోంది. ఈ పనిని పూర్తి చేసే బాధ్యత 'సర్'కు అప్పగించబడింది.

*

అదో మహాద్భుతం, మరోవైపు ముంచుకొస్తున్న ముప్పు కూడా

(16వ పేజీ తరువాయి)

వారిని నియంత్రించడానికి ఉపయోగించే అవకాశం ఉంది.

దీని నుండి వచ్చిన ఒకానొక వికృత రూపమే డీప్‌ఫేక్ పోర్నోగ్రఫీ: ఒకచోట సృజనాత్మక పనిముట్లుగా ఉపయోగించే టెక్నిక్‌నే వాడుకుని వ్యక్తుల గౌరవానికీ, వ్యక్తిత్వానికీ భంగం కలిగించే తప్పుడు చిత్రాలను తయారు చేయవచ్చు. స్త్రీలపట్ల ధ్వేషాన్ని కృత్రిమ మేధ సృష్టించదు కానీ ఉన్న దాన్ని మరింత పెంపొందిస్తుంది. వ్యక్తిగత గోప్యత చట్టం బలహీనంగా ఉన్నచోట లేక కొత్తగా అమల్లోకి వచ్చిన చోట ఈ పనిని మరింత శీఘ్రంగా చేస్తుంది.

ఈ అగాధాన్ని పూడ్చాలంటే, త్వరగా చట్టాన్ని చేయాలి, అంతకంటే త్వరగా అమలు చేయాలి. దీనికి ఆల్గోరిథమిక్ హానిపై దర్యాప్తు జరిపే సాంకేతిక సామర్థ్యం గల రెగ్యులేటర్లు కావాలి. సమాచార దుర్వినియోగాన్ని, చిత్రాల ఆధారంగా జరిగే దుర్వినియోగాన్నీ భౌతికంగా జరిగే దుర్వినియోగంతో సమానంగా పరిగణించే సాంస్కృతిక మార్పు రావాలి. దీనికి అంతర్జాతీయ సమన్వయం కూడా అవసరం. అప్పుడే బలహీనమైన నియంత్రణలు గల దేశాలను అక్రమ డేటాను దాచుకునే స్వర్గ ధామాలుగా ఉపయోగించుకోకుండా ఆపడం సాధ్యం.

కృత్రిమ మేధ ఎప్పుడో రాబోతున్న విషయం కాదు. అది ఇప్పటికే మన పాఠశాలల్లోకి, యుద్ధ రంగాల్లోకి, చివరికి మన పడక గదుల్లోకి కూడా చొరబడిపోయింది. దానితో కలిసి జీవించడం ఎలాగో మనం నేర్చుకోవాలి. వాస్తవానికి మనం ఇప్పటికే దానితో కలిసి జీవిస్తున్నాం. ఇప్పుడు ప్రశ్న ఏమంటే, అది మానవుని ఎంపిక అవకాశాలను దిగజార్చేందుకు అనుమతిస్తామా లేక మానవుల కృషిని పెంపొందించి, విస్తరించేందుకు ఉపయోగించుకుంటామా అన్నదే.


విజ్ఞానంపై ఎవరు అదుపు సాధిస్తారు, ఎవరు జ్ఞానవంతమైన వ్యవస్థలనూ, వాటిని నడిపించే ఆల్గోరిథమ్స్‌నూ నిర్మిస్తారు అనేదానిపై ఆధారపడి వచ్చే శతాబ్దం నిర్వచించబడుతుంది. కానీ మొత్తం మీద యంత్రాల్లో మానవులు నిక్షిప్తం చేసిన విలువలే ఈ శతాబ్దాన్ని శాసిస్తాయి.

*

విజయనగర, బహమనీ సామ్రాజ్యాలు

14-16 శతాబ్దాలు

దక్షిణ భారతదేశ రాజ్యాల మీద దాడులు-మాలిక్ కాఫుర్



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

డిల్లీకి సుదూరంగా ఉన్న దక్షిణాది ప్రాంతాల మీద రాజకీయంగా ఆధిపత్యాన్ని నెరపడం కన్నా అక్కడి సంపదను కొల్లగొట్టడం మీదనే డిల్లీ సుల్తానులు ఎక్కువగా తొలినాళ్ళలో దృష్టి పెట్టారు. 14వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో డిల్లీ సుల్తాను అల్లావుద్దిన్ తనకు అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉన్న మాలిక్ కాఫుర్ అనే బానిసను సేనానాయకుడిగా నియమించి దక్కను ప్రాంతం మీదకు దండయాత్రకు పంపాడు. యాదవ రాజ్యం మీద మాలిక్ కాఫుర్ దాడి చేసి దేవగిరి వద్ద 1307లో సింగన ను ఓడించి తరిమివేశాడు. అతడి తండ్రి రామదేవుడిని బందీగా పట్టుకుని డిల్లీ సుల్తాను దగ్గరకు తీసుకుపోయాడు. దేవగిరిని కొల్లగొట్టి సంపదనంతటినీ డిల్లీకి తరలించాడు. డిల్లీ సుల్తాను పట్ల విశ్వాసంతో నడుచుకుంటానని అంగీకరించిన తర్వాత రామదేవుడిని తిరిగి తన ప్రతినిధిగా దేవగిరికి డిల్లీ సుల్తాను పంపాడు. ఆ తర్వాత దక్షిణాది లో డిల్లీ సుల్తానులు జరిపిన దాడులన్నింటికీ రామదేవుడు తోడ్పడుతూ వచ్చాడు.

అంతకు ముందు ఒకసారి 1303-04లో మాలిక్ కాఫుర్ కాకతీయ రాజ్యం మీద దాడికి దిగి ప్రతాపరుద్రుడి చేతుల్లో ఓటమిపాలయ్యాడు. మళ్ళీ రెండవసారి 1309లో సుల్తాను అతడిని కాకతీయులమీద దాడికి పంపాడు. 1309లో వచ్చిన మాలిక్ కాఫుర్ దేవగిరి చేరుకుని పూర్తి సన్నాహాలతో 1310లో దాడి చేశాడు. నెలరోజులపాటు ఓరుగల్లు కోటను దిగ్బంధనం చేశాడు. అప్పుడు ప్రతాపరుద్రుడు దిగివచ్చి సంధి చేసుకున్నాడు. ప్రతీ ఏడూ డిల్లీ సుల్తానుకు కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. ఏనుగులు గుర్రాలతో బాటు చాలా సంపదను కానుకలుగా ఇచ్చుకున్నాడు.

దేవగిరి వద్ద విడిది చేసిన మాలిక్ కాఫుర్ ఈసారి హొయసల, పాండ్య రాజ్యాలమీద దాడులకు దిగాడు. అప్పటికి పాండ్య రాజ్యం అంత:కలహాలలో మునిగివుంది. దానిలో జోక్యం చేసుకుని తన ఆధిపత్యాన్ని పెంచుకోవాలని హొయసల రాజు 3వ బల్లాలుడు భావించాడు. బల్లాలుడు పాండ్య రాజ్యం మీదకు తరలిపోయిన సమయం చూసి మాలిక్ కాఫుర్ తన బలగాలతో హొయసల రాజ్యాన్ని కొల్లగొట్టాడు. డిల్లీకి సామంతుడిగా ఉండడానికి, ప్రతీ ఏడూ కప్పం చెల్లించడానికి 3వ బల్లాలుడు అంగీకరించాడు.

ఆ తర్వాత మాలిక్ కాఫుర్ పాండ్య రాజ్యం వైపు మళ్ళాడు. ఐతే తమ అంత:కలహాలను అధిగమించిన పాండ్య రాజులు మాలిక్ ను తిప్పికొట్టారు. దాంతో మాలిక్ కాఫుర్ తన దాడులను ఆపి డిల్లీకి పయనమయాడు. ఈ దాడులలో సేకరించిన 612 ఏనుగులతో, 20,000 గుర్రాలతో, 96000 కాసుల బంగారంతో, పలు భోషాణాలలో ఆభరణాలతో, ముత్యాలతో మాలిక్ కాఫుర్ డిల్లీకి పయనమయ్యాడని బర్నీ తన రాతలలో పేర్కొన్నాడు.

1312లో రామదేవుడు మరణించాడు. అప్పుడు మాలిక్ కాఫుర్ మళ్ళీ వచ్చి దేవగిరిని స్వాధీనం చేసుకున్నాడు. ఐతే యాదవ రాజ్యంలో భాగంగా ఉన్న బళ్ళారి, రాయచూర్, ధార్వార్ ప్రాంతాలు మాలిక్‌కు లొంగలేదు. కంపిలిదేవుడి నాయకత్వంలో అక్కడ స్వతంత్ర రాజ్యం ఏర్పడింది. ఈ రాజ్యం తుంగభద్ర తీరానికి ఆనుకునివుండేది.

డిల్లీలో సుల్తాన్ అల్లావుద్దిన్ పై తిరుగుబాటు చేసి కుతుబుద్దిన్ షా 1316 లో సింహాసనాన్ని చేజిక్కించుకున్నాడు. ఆ తిరుగుబాటులో మాలిక్ కాఫుర్ మరణించాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని యాదవ రాజ్యం స్వతంత్రత ప్రకటించింది. రామదేవుడి అల్లుడైన హరగోపాలదేవుడు అధికారం చేపట్టాడు. ఐతే కుతుబుద్దిన్‌షా ముబారక్ 1318లో దండయాత్ర చేసి దేవగిరిని మళ్ళీ స్వాధీనం చేసుకున్నాడు.

డిల్లీలో రాజకీయ అస్థిరత కొనసాగింది. ఈసారి ఖల్జీల పాలనను అంతం చేసి తుగ్లఖ్‌లు పెత్తనం చేజిక్కించుకున్నారు. దక్షిణాది పాల కులు ఈ అవకాశాన్ని మళ్ళీ ఉపయోగించు కున్నారు. డిల్లీ గద్దె నెక్కిన గియాసుద్దిన్ తుగ్లఖ్ దీనిని అణచివేయడానికి తన కుమారుడు ఉలుగ్‌ఖాన్‌ను సైన్యంతో పంపాడు. 1321లో ఓరుగల్లు మీద దాడికి దిగిన ఉలుగ్‌ఖాన్ ఆరునెలల ముట్టడి తర్వాత కూడా గెలవలేకపోయాడు. దాంతో వెనుదిరిగాడు.

తాను డిల్లీ పాలకులమీద తిరుగులేని విజయాన్ని సాధించానని భావించిన ప్రతాపరుద్రుడు తన సన్నద్ధతను సడలించాడు. అదను చూసి ఉలుగ్‌ఖాన్ మళ్ళీ దాడికి దిగాడు. అందుకు ప్రతాపరుద్రుడు సిద్ధంగా లేడు. దానికి తోడు రాజ్యంలో కరువు తీవ్రంగా ఏర్పడింది. ఐదు నెలల పాటు ప్రతిఘటించిన ప్రతాపరుద్రుడు ఆ తర్వాత లొంగిపోయాడు. తనను బందీగా పట్టుకుని డిల్లీకి తరలిస్తున్నప్పుడు మార్గమధ్యంలో ప్రతాపరుద్రుడు ప్రాణం తీసుకున్నాడు.

వరంగల్‌ని కొల్లగొట్టి నాశనం చేసిన ఉలుగ్‌ఖాన్ అక్కడినుంచి పాండ్య రాజ్యాన్ని, మలబార్‌ను కూడా చేజిక్కించుకున్నాడు. ఆ తర్వాత డిల్లీ పీఠాన్ని అధిష్టించి సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లఖ్ అయాడు. 1326లో దేవగిరికి తన రాజధానిని మార్చాడు. దానికి దౌలతాబాద్ అన్న కొత్తపేరుతో నామకరణం చేశాడు. దక్షిణాది ప్రాంతం అంతా అతడి సార్వభౌమాధికారాన్ని అంగీకరించింది. అప్పటికీ లొంగని కంపిలి, దేవసముద్రం వంటి చిన్న రాజ్యాలను సుల్తాన్ స్వయంగా రంగంలోకి దిగి స్వాధీనం చేసుకున్నాడు.


బలహీనపడిన డిల్లీ ఆధిపత్యం

1329లో తుగ్లఖ్ తన రాజధానిని మళ్ళీ డిల్లీకి మార్చాడు. పాలనాకేంద్రం మారడంతో దక్షిణాదిలో పాలకులు మళ్ళీ స్వతంత్రత ప్రకటించుకోడానికి సిద్ధపడ్డారు. ఐతే ఈ సారి పాత రాజ్యాలు యధాతధంగా ఏర్పడలేదు. కొత్త రాజ్యాలు వచ్చాయి. కాకతీయుల రాజ్యంలో ఆయా ప్రాంతాలకు ప్రతినిధులుగా వ్యవహరించిన నాయకులు కొందరు కూడబలుక్కున్నారు. వారి నాయకుడు ప్రోలయ వేమ అద్దంకి-కొండవీడు ప్రాంతంలో 1331 నాటికి రెడ్డిరాజ్యాన్ని ఏర్పరిచాడు. ఇది కోస్తా ఆంధ్ర ప్రాంతానికి విస్తరించింది. ఇక రాయలసీమ, తూర్పు కర్నాటక ప్రాంతంలో ఒక కొత్త రాజ్యం ఏర్పడింది. కర్నూలు ప్రాంతం లో రాజధానిని ఏర్పరచుకున్న సోమదేవుడు స్వతంత్రత ప్రకటించాడు. దొరసముద్రం నుంచి 3వ బల్లాలుడు తిరిగి స్వతంత్ర రాజుగా పాలించసాగాడు.

ప్రోలయ వేముడి మరణానంతరం గద్దెనెక్కిన కాపయ వేముడు 3వ బల్లాలుడితో చేయి కలిపి అతడి సహకారంతో 1336 నాటికి వరంగల్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. బల్లాలుడు ఉత్తర దిశగా సాగి దేవగిరివైపుగా విస్తరణకు పూనుకున్నాడు. అది పూర్తయ్యాక ఇద్దరూ కలిసి దక్షిణ దిశగా సాగి మలబార్ ప్రాంతంలోని డిల్లీ సుల్తాను ప్రతినిధిని తరిమివేసి స్థానిక పాలకుడిని గద్దెమీద కూర్చోబెట్టారు. రెడ్డిరాజుల అధికారం శ్రీశైలం నుండి బంగాళాఖాతం తీరం వరకూ మధ్య ఉన్న ప్రాంతానికంతటికీ విస్తరించింది. ఉత్తర తీరంలో గోదావరి తీరం నుంచి కళింగపట్నం వరకూ ఉన్న ప్రాంతం మీద కొప్పుల వెలమ రాజులు పిఠాపురం కేంద్రంగా ఆధిపత్యం నెరిపారు.

దక్షిణాది మీద డిల్లీ సుల్తానుల ఆధిపత్యం ఈ విధంగా పూర్తిగా బలహీనపడింది. స్థానిక పాలకులు స్వతంత్ర రాజులుగా తిరుగుబాటు చేయడంతోబాటు, డిల్లీకి ప్రతినిధులుగా దక్షిణాదిలో వ్యవహరిస్తూ వచ్చిన కొందరు ముస్లిం రాజ ప్రతినిధులు కూడా డిల్లీ పెత్తనాన్ని తోసిరాజంటూ స్వతంత్ర రాజ్యాల స్థాపనకు పూనుకున్నారు. 1336 అనంతరం దక్షిణాదిలో ఏర్పడిన అల్లకల్లోల రాజకీయ వాతావరణం నుంచి రెండు బలమైన రాజ్యాలు – విజయనగర సామ్రాజ్యం, బహమనీ సామ్రాజ్యం– రూపొందాయి. దాదాపు రెండు శతాబ్దాలపాటు ఈ రెండు సామ్రాజ్యాలూ దక్షిణ భారత ప్రాంతపు రాజకీయ, సామాజిక జీవిత గమనాన్ని బలంగా ప్రభావితం చేశాయి.

“ప్రోలయ వేముడి మరణానంతరం గద్దెనెక్కిన కాపయ వేముడు 3వ బల్లాలుడితో చేయి కలిపి అతడి సహకారంతో 1336 నాటికి వరంగల్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. బల్లాలుడు ఉత్తర దిశగా సాగి దేవగిరివైపుగా విస్తరణకు పూనుకున్నాడు. అది పూర్తయ్యాక ఇద్దరూ కలిసి దక్షిణ దిశగా సాగి మలబార్ ప్రాంతంలోని డిల్లీ సుల్తాను ప్రతినిధిని తరిమివేసి స్థానిక పాలకుడిని గద్దెమీద కూర్చోబెట్టారు. రెడ్డిరాజుల అధికారం శ్రీశైలం నుండి బంగాళాఖాతం తీరం వరకూ మధ్య ఉన్న ప్రాంతానికంతటికీ విస్తరించింది.”



విజయనగర సామ్రాజ్య స్థాపన

విజయనగర సామ్రాజ్యాన్ని హరిహర, బుక్క రాయలు స్థాపించారు. వీరిద్దరూ 2వ ప్రతాపరుద్రుడి కొలువులో ఉండే యోధులు. 1323లో ప్రతాపరుద్రుడు ఓడిపోయిన తర్వాత ఈ ఇద్దరూ కంపిల రాజ్యానికి తరలిపోయారు. 1327లో కంపిల కూడా డిల్లీ పాలకుల వశం అయింది. అప్పుడు హరిహరుడు, బుక్క బందీలుగా పట్టుబడ్డారు. వారిద్దరినీ డిల్లీకి తరలించారు. అక్కడ ఇద్దరూ ఇస్లాం మతాన్ని స్వీకరించి సుల్తానుకు సన్నిహితులుగా మెలిగారు. వారిపై నమ్మకం పెరిగాక సుల్తాను వారిద్దరికీ కంపిలి రాజ్య నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పాడు. సుల్తాను ప్రతినిధులుగా వారు కంపిలిలో తలెత్తిన తిరుగుబాటును అణచివేసి ఆ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చు కున్నారు. ఆ పైన కొంత విస్తరించిన తర్వాత 1336లో స్వతంత్రతను ప్రకటించుకున్నారు. విద్యారణ్యస్వామి అనే గురువు వద్ద తిరిగి హిందూమతంలోకి చేరారు.

“బహమనీ, విజయనగర సామ్రాజ్యాల నడుమ శతాబ్దాలపాటు వైరం కొనసాగుతూ వచ్చింది. కొందరు చరిత్రకారులు ఈ వైరాన్ని హిందూ-ముస్లిం మతాల నడుమ వైరంగా చిత్రిస్తూవుంటారు. ఐతే ఇరుపక్షాల సైన్యాలలోనూ హిందువులు, ముస్లింలు ఉన్నారు. వాస్తవానికి ఈ వైరం తుంగభద్ర, కృష్ణ, గోదావరి నదుల మధ్య ఉన్న సారవంతమైన భూములమీద ఆధిపత్యం కోసం సాగింది.”

1336 ఏప్రిల్ 18న 1వ హరిహర రాయలు తాను విరూపాక్ష స్వామి ప్రతినిధిగా అధికారం చేపడుతున్నట్టు ప్రకటించుకున్నాడు. ఆ విరూపాక్షస్వామి (దైవం) ఆదేశాలను తాను అమలు చేస్తున్నట్టు అధికారిక ఉత్తర్వులన్నింటి లోనూ ప్రకటించేవాడు.

పొరుగునే ఉన్న హొయసల రాజ్యాన్ని క్రమంగా ఆక్రమించుకోసాగాడు హరిహరుడు. అక్కడి రాజు 3వ బల్లాలుడు మలబారు ప్రాంతంమీద ఎక్కువగా దృష్టి పెట్టి అక్కడ కొనసాగుతున్న మధుర సుల్తానుల అంతర్గత పోరులో జోక్యం కల్పించుకుని ఆ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నంలో మునిగివున్నాడు. అందువలన విజయనగర పాలకులకు హొయసల రాజ్య ప్రాంతం తేలికగా వశం అవుతూవచ్చింది. అక్కడినుంచి 1345 నాటికి ‘తుళు’ నాడు కూడా స్వాధీనం అయింది. బాదామి కూడా చేజిక్కింది.

బహమనీ రాజ్య స్థాపన

మహమ్మద్ బిన్ తుగ్లఖ్ దౌలతాబాదు (దేవగిరి) నుంచి రాజధానిని తిరిగి డిల్లీకి మార్చిన అనంతరం దక్షిణాదిన ఉన్న సామంత రాజ్యాలమీద పెత్తనాన్ని కొందరు అధికారులకు అప్పజెప్పాడు. ఉత్తరాదిన డిల్లీలో ఆధిపత్య పోరు, అస్థిరత పెరుగుతున్నకొద్దీ తనకు అవసరమైన ఆర్థిక బలాన్ని సమకూర్చుకోడానికి దక్షిణాది ప్రాంతాలనుండి అధికమొత్తంలో ఆదాయాన్ని రాబట్టాలన్న వత్తిడి ఆ అధికారులమీద పెరిగింది. ఆ వత్తిడి తీవ్రత పెరిగి అధికాదాయం వసూలు చేయడంలో విఫలమైన అధికారులను వేరే ప్రాంతానికి రప్పించి అక్కడ వారిని చంపివేయమని ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం అధికారుల మధ్య వ్యాపించింది. ఈ పరిస్థితుల్లో దక్షిణాదిన ఉన్న అధికారుల్లో డిల్లీ సుల్తాను మీద తిరుగుబాటు చేసి తమ ఉనికిని కాపాడుకోవాలనే ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఈ నేపథ్యంలో హసన్ గంగూ అని పిలవబడే జాఫర్ ఖాన్ అనే అధికారి మరి కొంతమందిని కూడగట్టుకుని గుల్బర్గా చేరాడు. అప్పటికి వరంగల్‌ను సామంతరాజుగా పాలిస్తున్న కాపయ నాయకుడి తోడ్పాటు తీసుకుని తనను నిర్మూలించడానికి వచ్చిన డిల్లీ సైన్యాలను తిప్పికొట్టాడు. ఆ పైన గుల్బర్గా నుంచి బీదర్‌కు విస్తరించాడు. అక్కడినుంచి దేవగిరి చేరి అక్కడ సుల్తాను ప్రతినిధిగా ఉన్న నసీరుద్దీన్ ఇస్మాయిల్ షా ను పదవి నుంచి దింపి తనను దక్కన్ ప్రాంత సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. సుల్తాన్ అబుల్ ముజఫర్ అల్లావుద్దిన్ బహమన్ షా అన్న పేరుతో 1347 ఆగస్టు 3న సింహాసనమెక్కాడు. తాను ఒకప్పుడు గంగూ అనే బ్రాహ్మణుడివద్ద బానిసగా పని చేసినందున తన యజమాని గంగూ పట్ల ఉండిన గౌరవంతో తనను హసన్ గంగూ అని పిలుచుకునేవాడని చరిత్రకారులు చెప్తారు. పర్షియన్ పురాణాలలో గొప్ప యోధుడిగా పరిగణించబడిన బహమన్ అనే యోధుడి వంశం నుంచి తాను వచ్చినట్టు చెప్పుకోడానికి బహమన్ షా అని తన పేరులో చేర్చాడని కూడా అంటారు.

1358లో మరణించేవరకూ హసన్ గంగూ సుల్తానుగా కొనసాగాడు. తొలిదశలో డిల్లీకి విశ్వాసపాత్రులుగా ఉన్న వారినుండి ఎదురైన ప్రతిఘటనను అణచివేయడంలో జయప్రదం అయాడు. తన అధికారం సుస్థిరం అయాక విస్తరణ మీద దృష్టి పెట్టాడు. మొదట తనకు అండగా నిలిచిన వరంగల్ పాలకుడు కాపయ నాయకుడిని తనకు సామంతుడిగా ఉండేందుకు అంగీకరింపజేశాడు. ఆ తర్వాత 1349 నుంచీ విజయనగర సామ్రాజ్య భూభాగాలమీద దృష్టి సారించాడు. ఐతే ఒకటి, రెండు చిన్న చిన్న ప్రాంతాలను మాత్రమే స్వాధీనం చేసుకోగలిగాడు. దక్షిణాన తనకు బంధువుగా ఉన్న మధుర సల్తాను సహకారంతో 1350లో రెండవసారి విజయనగరం మీద దండెత్తాడు. తుంగభద్ర తీరాన జరిగిన ఆ యుద్ధంలో ఎవరు పైచేయి సాధించారన్నది స్పష్టంగా తేలలేదు. ఇరుపక్షాలూ తమదే విజయం అని ప్రకటించుకున్నాయి.

హసన్ గంగూ మరణించేనాటికి పశ్చిమాన అరేబియా సముద్రం వరకూ, తూర్పున భువనగిరి వరకూ, ఉత్తరాన పెన్‌గంగ వరకు, దక్షిణాన కృష్ణానది వరకు బహమనీ రాజ్యం ఉండేది. గుల్బర్గా రాజధానిగా అతడు పాలించాడు. ఖలీఫా గుర్తింపు పొందాడు. గుల్బర్గా, బాదర్, దేవగిరి, బేరార్ అనే నాలుగు ప్రాంతాలుగా తన రాజ్యాన్ని విభజించి నియంత్రించాడు.


ఎడతెగని వైరం

బహమనీ, విజయనగర సామ్రాజ్యాల నడుమ శతాబ్దాలపాటు వైరం కొనసాగుతూ వచ్చింది. కొందరు చరిత్రకారులు ఈ వైరాన్ని హిందూ-ముస్లిం మతాల నడుమ వైరంగా చిత్రిస్తూవుంటారు. ఐతే ఇరుపక్షాల సైన్యాలలోనూ హిందువులు, ముస్లింలు ఉన్నారు. వాస్తవానికి ఈ వైరం తుంగభద్ర, కృష్ణ, గోదావరి నదుల మధ్య ఉన్న సారవంతమైన భూములమీద ఆధిపత్యం కోసం సాగింది. గోదావరి పరీవాహకప్రాంతం నుంచి తూర్పు సముద్ర తీరాన ఉన్న రేవు పట్టణాలకు అనుసంధానం ఉంది. ఆ రేవుల ద్వారా సాగే వాణిజ్యం మీద ఆదాయం గణనీయంగా లభించేది. ఇదిగాక కొంకణ తీరం మీద, మరఠ్వాడా ప్రాంతం కూడా సారవంతమైనది కావడంతో దానిమీద ఆధిపత్యం కూడా కీలకం అయింది. అందుచేత రెండు రాజ్యాల నుడుమ దీర్ఘకాలం కొనసాగిన వైరానికి అసలు కారణం ఈ కీలక భూభాగాలమీద పట్టు సాధించడం కోసమే. ఈ క్రమంలో ప్రజల మత విశ్వాసాలను ఆయా సందర్భాల్లో ఉపయోగించుకునివుండొచ్చు. కీలకమైన ఆర్థిక కారణాన్ని పక్కన పెడితే ఈ వైరాన్ని అర్థం చేసుకోలేము.

బహమనీ, విజయనగర రాజ్యాలు రెండూ దాదాపు ఒకే కాలంలో ఏర్పడ్డాయి. సుమారు రెండు శతాబ్దాలపాటు పక్క పక్కనే కొనసాగాయి. కొనసాగినంతకాలమూ పరస్పరం తలపడుతూవచ్చాయి. ఒక సారి బహమనీ రాజులు పైచేయి సాధిస్తే మరోసారి విజయనగర రాజులు పైచేయి సాధించేవారు. మరో పక్క ఈ ఇద్దరూ తమ రాజ్యాలకున్న ఇతర సరిహద్దుల లోని రాజ్యాలతోను, డిల్లీ సుల్తానులతోను తలపడవలసివచ్చేది. (చూ. 15వ శతాబ్దం నాటి ప్రాంతీయ రాజ్యాలు మ్యాప్)

(తరువాయి వచ్చే సంచికలో)

వాగ్దానాలు, వైరుధ్యాల మధ్య బ్రిక్స్ సదస్సు



రచయిత మార్క్సిస్టు చరిత్రకారుడు, మేధావి. రచయిత. లెఫ్ట్ వర్డ్ బుక్స్ ఎడిటర్

విజయ ప్రసాద్

అంతర్జాతీయ వైరుధ్యాలు తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో సెప్టెంబరు 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధాలు, ఏకపక్ష ఆంక్షలు, సుంకాల మోతలు, ఆర్థిక సమగ్రతను, సాంకేతికతను ఆయుధాలుగా మలచడం వంటి అంశాలు సామ్రాజ్యవాద ఆధిపత్యంతో కూడిన అంతర్జాతీయ వ్యవస్థ యొక్క అసమానత్వాన్ని బయటపెట్టాయి. ఈ నేపథ్యంలో, అభివృద్ధి చెందుతున్న దేశాలు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని, మరింత ప్రజాస్వామ్యయుతమైన ప్రపంచ పాలనా వ్యవస్థను కోరుకుంటున్నాయనడానికి బ్రిక్స్ విస్తరణ స్పష్టమైన నిదర్శనం. అదే సమయంలో, బ్రిక్స్ ప్లస్ అనేది వివిధ రాజకీయ విధానాలు, ఆర్థిక ప్రయోజనాలు కలిగిన భిన్నమైన దేశాల సమూహంగానే మిగిలిపోయిందని ఈ సదస్సు స్పష్టం చేసింది.

ఈ సదస్సు ముగింపులో విడుదల చేసిన "న్యూఢిల్లీ డిక్లరేషన్", ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థలో సంస్కరణలు కావాలని పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం లేని ఏకపక్ష ఆంక్షలను వ్యతిరేకిస్తూ, జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చింది. అమెరికా, దాని మిత్రదేశాలు శాసించే అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరింది. తన మాట వినని దేశాలపై అమెరికా ఆంక్షలు, సుంకాలు, ఎగుమతి నియంత్రణలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రకటనకు సముచిత ప్రాముఖ్యత ఉంది.

అస్పష్టత

అయితే, ప్రకటనలో ఆచితూచి ఉపయోగించిన భాష, ఈ విస్తరించిన కూటమి యొక్క పరిమితులను కూడా వెల్లడిస్తుంది. బ్రిక్స్ ప్లస్ లో ఇప్పుడు పాశ్చాత్య దేశాల తీవ్ర ఒత్తిడికి గురవుతున్న రష్యా, ఇరాన్ వంటి దేశాలతో పాటు, అవే పాశ్చాత్య దేశాలతో సన్నిహిత ఆర్థిక, భద్రతా సంబంధాలు కలిగిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు కూడా ఉన్నాయి. ఫలితంగా, రాజకీయ కారణాలను స్పష్టంగా పేర్కొనకుండా, కేవలం వివాదాలను గుర్తించే పదజాలంతో మాత్రమే ఏకాభిప్రాయానికి రాగలిగారు. పశ్చిమాసియాలో విస్తరిస్తున్న యుద్ధం, ఇరాన్‌పై అనుసరిస్తున్న వైఖరి విషయంలో ఈ అస్పష్టత స్పష్టంగా కనిపించింది.

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఈ సదస్సులో అమెరికా, ఇజ్రాయెల్ తమ దేశంపై జరుపుతున్న దాడిని, ఏకపక్ష ఆంక్షలను తీవ్రంగా ఖండించారు. శాంతి, సార్వభౌమాధికారం, భద్రత లేకుండా ఆర్థిక స్థిరత్వం సాధ్యం కాదని ఆయన సరిగానే చెప్పారు. జాతీయ కరెన్సీలలో వాణిజ్యం, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ వినియోగం, స్వతంత్ర రవాణా, ఇంధన కారిడార్ల నిర్మాణాన్ని ఇరాన్ ప్రతిపాదించింది. దశాబ్దాలుగా ఆంక్షలు, పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థల నుండి బహిష్కరణను ఎదుర్కొంటున్న ఇరాన్‌కు బ్రిక్స్ ప్లస్‌లో సభ్యత్వం ఒక ముఖ్యమైన దౌత్య, ఆర్థిక అవకాశాన్ని కల్పించింది.

అయితే, ఇరాన్ వైఖరిలో కూడా కొంత అస్పష్టత ఉంది. ఒకవైపు బ్రిక్స్ ప్లస్ ను ఏకపక్ష విధానాలను నిరోధించే సాధనంగా పరిగణిస్తూనే, మరోవైపు పాశ్చాత్య పెట్టుబడులతో ముడిపడి ఉన్న పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలతో సంబంధాలను సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఇరాన్‌కు ఉంది. అమెరికా, ఇజ్రాయెల్‌లను దురాక్రమణదారులుగా నిందిస్తూనే, ప్రాంతీయంగా ఒంటరి కాకుండా ఉండేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది.

ఇది కేవలం ఇరాన్ వైఖరి మాత్రమే కాదు. బ్రిక్స్ ప్లస్ ఎదుర్కొంటున్న విస్తృత సమస్య ఇది. పాశ్చాత్య ఆధిపత్యాన్ని వ్యతిరేకించినంత మాత్రాన అది దానంతట అదే సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమంగా మారదు. ఇందులో పాల్గొంటున్న దేశాలన్నీ తమ స్వంత జాతీయ ప్రయోజనాలను చూసుకునే పెట్టుబడిదారీ ప్రభుత్వాలు. అందువల్ల బ్రిక్స్ ప్లస్ అనేది సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా కంటే, మారుతున్న ప్రపంచ క్రమంలో ఒక పోరాట వేదిక మాత్రమే అని మనం గుర్తించాలి.

భాగస్వాములు

ఈ సదస్సులో ఆసియా ఖండానికి సంబంధించి అత్యంత కీలకమైన రాజకీయ పరిణామం... భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం. ఏడేళ్ల తర్వాత షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం, 2024లో ప్రారంభమైన సైనిక ఉపసంహరణ ఒప్పందాల తర్వాత ఇరు దేశాల సంబంధాలలో వస్తున్న క్రమమైన మెరుగుదలను ధృవీకరించింది. భారత్-చైనాలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూడాలని ఇరు నాయకులు అంగీకరించారు. సరిహద్దు సమస్యలు, వాణిజ్యం, మార్కెట్‌ల అందుబాటు వంటి అంశాలపై కూడా చర్చించారు.

భారత్-చైనా సంబంధాలలో ఎలాంటి స్థిరమైన మెరుగుదల అయినా స్వాగతించదగినదే. 2020లో గాల్వాన్ లోయ ఘర్షణల

> ❝ వాస్తవ అధీన రేఖ వెంట శాంతి భద్రతలు అత్యంత ముఖ్యం. వాటిని సైనిక ఘర్షణలుగా మారకుండా దౌత్య మార్గాల్లో పరిష్కరించు కోవాలి. ఆర్థిక సంబంధాల పరంగా, చైనా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. అయితే, చైనాతో భారత్‌కు ఉన్న భారీ వాణిజ్య లోటు భారత వస్తూత్పత్తి రంగానికి ఉన్న బలహీనతను ఎత్తి చూపుతోంది. దీన్ని సరిదిద్దడానికి సరైన మార్కెట్ వ్యూహం, పారదర్శక చైనా పెట్టుబడులు, పటిష్టమైన భారత పారిశ్రామిక విధానం అవసరం. ❞



న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సులో అగ్రనేతలు

తర్వాత ఏర్పడిన సుదీర్ఘ ఉద్రిక్తత ఇరు దేశాలకు నష్టం కలిగించింది. ఇది సైనిక వ్యయాన్ని పెంచడమే కాకుండా, క్వాడ్ ద్వారా భారత్‌ను తన ఇండో-పసిఫిక్ వ్యూహంలోకి లాక్కోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు బలాన్నిచ్చింది. అందువల్ల, భారత్-చైనా ఘర్షణ భారత, చైనా ప్రజల కంటే అమెరికా వ్యూహానికే ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుంది.

వాస్తవ అధీన రేఖ వెంట శాంతి భద్రతలు అత్యంత ముఖ్యం. సరిహద్దు వ్యత్యాసాలను అధిగమించడం సులభం కాకపోయినా, వాటిని సైనిక ఘర్షణలుగా మారకుండా దౌత్య మార్గాల్లో పరిష్కరించు కోవాలి. ఆర్థిక సంబంధాల పరంగా, చైనా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. అయితే, చైనాతో భారత్‌కు ఉన్న భారీ వాణిజ్య లోటు భారత వస్తూత్పత్తి రంగానికి ఉన్న బలహీనతను ఎత్తి చూపుతోంది. దీన్ని సరిదిద్దడానికి సరైన మార్కెట్ వ్యూహం, పారదర్శక చైనా పెట్టుబడులు, పటిష్టమైన భారత పారిశ్రామిక విధానం అవసరం.

మోదీ ప్రభుత్వం దేశ అవసరాల రీత్యా చైనా దిగుమతులపై ఆధారపడటం, రాజకీయ కారణాలతో చైనా పెట్టుబడులపై నిబంధనలు విధించడం మధ్య ఊగిసలాడుతోంది.

అమెరికాతో వ్యూహాత్మక పొత్తు పెట్టుకోవడం వల్ల భారత్‌కు స్వంతంగా వస్తూత్పత్తి రంగం లభించదు. భారత్-చైనాల మధ్య సహకారం పెరిగితే, అంతర్జాతీయ వ్యవస్థను ప్రజాస్వామ్యబద్ధం చేసే పోరాటంలో బ్రిక్స్ ప్లస్ కు మరింత ప్రాముఖ్యత లభిస్తుంది. ఇరు దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో మూడో వంతు కంటే ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తాయి.

న్యూఢిల్లీ సదస్సు ఆర్థిక సహకారం, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలపై స్పష్టమైన ప్రతిపాదనలు చేసింది. అయితే ఈ ప్రకటనలు ఆచరణలోకి వస్తేనే వాటికి విలువ ఉంటుంది. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ జాతీయ కరెన్సీలలో రుణాలు ఇవ్వడాన్ని పెంచాలి. క్యూబా విప్లవానికి, పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికారానికి మద్దతుగా ఇచ్చిన ప్రకటనలను ఆచరణలో చూపాల్సిన అవసరం ఉంది.

బ్రిక్స్ ప్లస్ అనేది కొత్త ప్రపంచ సమతుల్యత వైపు పడుతున్న అడుగులతో పాటు దానిలోని వైరుధ్యాలను కూడా ప్రతిఫలిస్తుంది. భారత్ తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పునరుద్ధరించుకోవాలి. చైనాతో సాధారణ సంబంధాలను నెలకొల్పుకోవాలి. అమెరికా సైనిక వ్యూహాల్లో భాగస్వామి కాకూడదు. ఇరాన్‌పై దాడిని వ్యతిరేకించాలి. న్యూఢిల్లీ సదస్సు ఈ దిశగా సాగే పరివర్తనలో మరొక అడుగు మాత్రమే. అయితే ఈ నూతన క్రమం దిశ మాత్రం భవిష్యత్తు రాజకీయ పోరాటాలపై ఆధారపడి ఉంటుంది.

*

మనకి పారిశ్రామిక విధానమేదీ?

అరుణ్ మైరా



రచయిత ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు

1990-91లో భారత్-చైనా ద్వైపాక్షిక వ్యాపారం 1 బిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండేది. ఆ కాలంలో చైనాకు భారత్ చేసే ఎగుమతులే ఎక్కువగా ఉండేవి. కానీ 2011-12 నాటికి ఇది 76 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత్-చైనా వ్యాపార తీరు ఒక ఆర్థిక రంగానికి, దాని వలస ప్రాంతానికి మధ్య ఉండే వ్యాపారం లాగే ఎందుకు ఉంది? భారతదేశం తన సొంత మౌలిక సదుపాయాలు, పరిశ్రమల కోసం అవసరమైన యంత్ర పరికరాలు (కాపిటల్ గూడ్స్) వంటి పారిశ్రామిక ఇన్ పుట్‌లను చైనా నుండి దిగుమతి చేసుకుంటుండగా, భారత్ ఎగుమతులు మాత్రం ముడి సరుకులు, ఖనిజాలు, పత్తి వంటి ప్రాథమిక ఉత్పత్తులకే పరిమితమయ్యాయి.

1990-91లో చైనాకు భారత్ తయారీ వస్తువులనే ఎక్కువగా ఎగుమతి చేయగా, 2013 నాటికి చైనా 'ప్రపంచ వస్తూత్పత్తి కర్మాగారం'గా మారింది. 1991 నుండి చైనా వస్తూత్పత్తి రంగం భారతదేశం కంటే ఎనిమిది రెట్లు పెద్దదిగా, దాని అధిక విలువ కలిగిన వస్తూత్పత్తుల రంగం (హై వాల్యూ ప్రొడక్ట్ సెక్టార్) యాభై రెట్లు పెద్దదిగా మారింది.

మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ ఆర్మీ జనరల్స్, అంతర్జాతీయ సంబంధాల వ్యూహకర్తలతో కూడిన సంస్థ ఎన్ఎస్ఎబి. చైనా కాపిటల్ గూడ్స్ దిగుమతులపై ముఖ్యంగా టెలికాం, విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్‌లపై భారత్ ఆధారపడటం కేవలం ఆర్థిక సమస్యగానే కాక, జాతీయ భద్రతా సమస్యగా కూడా మారిందని ఈ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. 1991 తర్వాత భారతదేశ పారిశ్రామిక విధానం ఎందుకు విఫలమైందో, అసలు భారతదేశానికి ఏమైనా పారిశ్రామిక విధానం ఉందో లేదో తెలుసుకోవాలని ఎన్ఎస్ఎబి ప్రణాళికా సంఘాన్ని కోరింది.

1991లోనే పారిశ్రామిక విధానం రద్దయింది

సత్యమేమిటంటే, భారతదేశానికి పారిశ్రామిక విధానం లేదు. ఎందుకంటే అత్యవసర రుణం కోసం భారత్ ఆశ్రయించిన ఐఎంఎఫ్ విధించిన ఉదారవాద మార్కెట్ సంస్కరణలు భారతదేశ సరిహద్దులను అంతర్జాతీయ వాణిజ్యానికి బార్లా తెరవాలనీ, పారిశ్రామిక విధానానికి స్వస్తి చెప్పాలనీ షరతు విధించింది.

దేశాలు ఒకదానితో ఒకటి స్వేచ్ఛగా వ్యాపారం చేసుకున్నప్పుడు, పెరుగుతున్న ప్రపంచ వృద్ధి అలలు అన్ని పడవలను పైకి లేపుతాయని (అందరికీ మేలు చేస్తాయని) ఐఎంఎఫ్ ఒక పెంపుడు సిద్ధాంతం చెప్పింది. నిజానికి భారతదేశ జిడిపి వేగంగా పెరగసాగింది. కానీ, చైనా జిడిపి కూడా అలాగే పెరిగింది. 2009 నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న 'స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్య దేశం'గా మారింది. చైనా ఆర్థిక వ్యవస్థ ఇంకా చాలా వేగంగా ఎదుగుతున్నందున 'స్వేచ్ఛా మార్కెట్లు, ప్రజాస్వామ్యం' అనే విశేషణాలను ఉపయోగించాల్సి వచ్చింది.

1991 నుండి భారతదేశం, చైనాల వృద్ధి వ్యూహాలు భిన్నమైన దారి పట్టాయి. భారత విధానకర్తలు తీసుకున్న నిర్ణయాల పరిణామాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చైనా వేగవంతమైన ఆర్థిక వృద్ధితో పాటు తన పారిశ్రామిక సామర్థ్యాలను నిర్మించుకుంది. ఇప్పుడు అమెరికాతో సరిసమానంగా ప్రపంచంలోనే అత్యంత ప్రముఖ ఆర్థిక శక్తిగా నిలిచింది. భారత్ తన వృద్ధి కోసం అమెరికా, చైనా రెండింటిపైనా ఆధారపడాల్సి వస్తోంది. పారిశ్రామిక ఇన్‌పుట్ ల కోసం చైనాపై, భారత సాఫ్ట్‌వేర్ ఎగుమతుల లభ్యత కోసం, భారత పరిశ్రమల కోసం హై-టెక్ అమెరికన్ సాంకేతికతలను ఉపయోగించే అనుమతుల కోసం అమెరికాపై ఆధారపడాల్సి వస్తోంది.

1991 సంస్కరణలు చరిత్రకు ముగింపు ('ఎండ్ ఆఫ్ హిస్టరీ') అనీ, విదేశీ వ్యాఖ్యాతల మాటల్లో చెప్పాలంటే సామ్యవాదం 'చరిత్ర చెత్త బుట్ట'కు పరిమితమైందని భావించారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, అమెరికాలో శిక్షణ పొందిన ఆర్థికవేత్తలు ప్రపంచవ్యాప్తంగా తెచ్చిన తీవ్ర ఆర్థిక సంస్కరణల (షాక్ థెరపీ) నుండి చైనా ఎలా తప్పించుకుంది? ఇసాబెల్లా ఎమ్. వెబెర్ తన "హౌ చైనా ఎస్కేప్డ్ షాక్ థెరపీ: ది మార్కెట్ రీఫార్మ్ డిబేట్" పుస్తకంలో దీనికి సమాధానం దొరుకుతుంది.

ఆమె ఇలా అంటారు: "ప్రసిద్ధ హార్వర్డ్ అభివృద్ధి ఆర్థికవేత్త డాని రోడ్రిక్, 'చైనా సంస్కరణల్లో కీలక పాత్ర పోషించిన పాశ్చాత్య ఆర్థికవేత్తలను లేదా పరిశోధనా పత్రాన్ని ఎవరైనా పేర్కోగలరా' అన్న ప్రశ్న వేసి దానికి ఆయనే సమాధానమిస్తూ, సాంప్రదాయకంగా అర్థం చేసుకునే 'ఆర్థిక పరిశోధన' చైనా సంస్కరణల్లో గణనీయమైన పాత్ర పోషించలేదని చెప్పారు." డాని రోడ్రిక్ యావత్ ఆర్థికవేత్తల రంగానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

1990ల నుండి భారత దేశంలో యూపీఏ అయినా, ఎన్డీయే అయినా ఏ ప్రభుత్వం పాలించినప్పటికీ, దేశ ఆర్థిక విధానాలు ఎల్లప్పుడూ అమెరికన్ పెట్టుబడిదారీ భావజాలాలకు కట్టుబడిన ఆర్థికవేత్తల కనుసన్నల్లో నడిచాయి. ప్రణాళికా సంఘం నీతి ఆయోగ్‌గా మారింది. ఇది పాత సారాను కొత్త సీసాలో పోయడం తప్ప మరొకటి కాదు. ఆ వాషింగ్టన్ ఆర్థిక శాస్త్రమే ఇప్పటికీ మన దేశాన్ని ఏలుతోంది.

1991లో ప్రవేశపెట్టిన సంస్కరణలు భారతదేశ ఆర్థిక విధానాలను స్వదేశీ పరిశ్రమల కంటే దిగుమతిదారులు, వ్యాపారులకు అనుకూలంగా మార్చింది. ఆ తర్వాత కొద్ది కాలానికే, 1995లో భారత్ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) 'సేవల వ్యాపార ఒప్పందం'పై సంతకం చేసింది; చైనా 2001లో ఇందులో ప్రవేశించింది. 1996లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అగ్రిమెంట్ (ఐటిఏ) వ్యవస్థాపక భాగస్వామిగా భారత్ చేరింది. దీనిననుసరించి సంతకం చేసిన దేశాలన్నీ ఐటీ ఉత్పత్తులపై (కంప్యూటర్లు, టెలికాం పరికరాలు మొదలైనవి) సుంకాలను తొలగించడానికి అంగీకరించాయి. ఇది భారత్‌లో ఎదుగుతున్న ఐటీ సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు కలిసి

> **"భారత్ చైనా కంటే వేగంగా డబ్ల్యూటీఓ ద్వారా ప్రపంచ వాణిజ్య వ్యవస్థతో అనుసంధానమైనప్పటికీ, చైనా ఉదార వాద పెట్టుబడిదారీ విధానం వైపు కాకుండా సోషలిజం బాటలోనే సాగినప్పటికీ, 1991 తర్వాత భారతదేశం కంటే చైనానే ఎక్కువ ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను ఆకర్షించింది. 2000లో చైనాలో ఎఫ్‌డిఐలు 41 బిలియన్ డాలర్లుగా ఉంటే, భారత్‌లో అవి కేవలం 4 బిలియన్ డాలర్లు మాత్రమే."**

వచ్చింది. ఎందుకంటే అది పాశ్చాత్య హార్డ్‌వేర్‌ను (తరువాత చైనీస్) సున్నా సుంకంతో దిగుమతి చేసుకోవచ్చు. కానీ దీని మూలంగా భారతదేశ సొంత చిన్న విడిభాగాల తయారీదారులను దెబ్బతీసింది. చైనా ఆ తరువాత 2001లో ఐటిఏ లో చేరింది, కానీ దాని స్వదేశీ హార్డ్‌వేర్ పరిశ్రమలను నిర్మించడం యథావిధిగా కొనసాగించింది.

భారత్ చైనా కంటే వేగంగా డబ్ల్యూటీఓ ద్వారా ప్రవంచ వాణిజ్య వ్యవస్థతో అనుసంధానమైనప్పటికీ, చైనా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం వైపు కాకుండా సోషలిజం బాటలోనే సాగినప్పటికీ, 1991 తర్వాత భారతదేశం కంటే చైనానే ఎక్కువ ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను ఆకర్షించింది. 2000లో చైనాలో ఎఫ్‌డిఐలు 41 బిలియన్ డాలర్లుగా ఉంటే, భారత్‌లో అవి కేవలం 4 బిలియన్ డాలర్లు మాత్రమే. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార సౌలభ్య) విధానాలతో భారతదేశం గతంలో కంటే ఇప్పుడు ఎఫ్‌డిఐలకు మరింత ఆకర్షణీయంగా మారింది. అయినప్పటికీ, చైనా ఎక్కువ విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూనే ఉంది. 2024 నాటికి భారత్ పొందిన 28 బిలియన్ల డాలర్లతో పోలిస్తే చైనా పొందిన విదేశీ పెట్టుబడులు 116 బిలియన్ డాలర్లు.

ఈ విషయంలో భారత్ – చైనాల మధ్య కీలకమైన తేడా ఏమిటంటే, ఆ విదేశీ పెట్టుబడు (ఎఫ్‌డిఐ) లను ఆయా దేశాలు ఎలా వినియోగిస్తున్నాయి అనేదే. చైనాలోని ఎఫ్‌డిఐ వస్తూత్పత్తి రంగం, ఎగుమతుల రంగాలతో అత్యధికంగా అనుసంధానించబడింది. దానికి భిన్నంగా, భారతదేశపు ఎఫ్‌డిఐలు ఐటీ సేవలు, కాల్ సెంటర్లు, బిజినెస్ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలలో బలంగా వృద్ధి చెందాయి. చైనా ఎఫ్‌డిఐని పారిశ్రామికీకరణ సాధనంగా ఉపయోగించుకుంది. భారత్ మాత్రం సేవలు, మార్కెట్ అభివృద్ధి సాధనంగాఉపయోగించింది. బహుళజాతి కంపెనీలు చైనాకు ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, ఆటోమొబైల్స్ మొదలైన వస్తువులను తయారు చేయడానికి వచ్చాయి. ఇదే చైనా హార్డ్‌వేర్ డిజైన్, తయారీకి కేంద్రంగా ఆవిర్భవించడానికి, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి, సాంకేతికతపై పేటెంట్లు, హక్కులను సాధించడానికి దోహదపడింది.

చైనాను అందుకోవడానికి మనం ఏం నేర్చుకోవాలి

డెంగ్ సియావో పింగ్, ఇతర చైనా ఆర్థిక సంస్కర్తలు 'కాళ్ల కింద రాళ్లను తాకుతూ నది దాటాలి' అని చెప్పారు. ఆర్థిక విధానాలు ఆర్థికవేత్తల అంకెలపై కాకుండా స్థానిక వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. భారత్‌కు చెందిన ఆర్థికవేత్తలు తమ జిడిపి వృద్ధి గణాంకాలను భారత పౌరుల జీవిత వాస్తవాలతో ఇంకా ముడిపెట్టలేదు. పౌరులు భారత దేశపు జీడీపీ అంకెల గురించి పట్టించుకోరు. వారికి మెరుగైన ఉద్యోగాలు, వారి ఆదాయాలలో వృద్ధి, సామాజిక భద్రత కావాలి.

చైనా విధానకర్తలు ఇప్పటివరకు భారత్ కంటే వేగంగా పరిస్థితులను ఆకళింపు చేసుకుంటున్నారు. భారతదేశం కేవలం వ్యాపారంతోనే సమ్మిళిత అభివృద్ధిని అందుకోలేదు. పారిశ్రామిక విధానమే భారతదేశ వాణిజ్య విధానాన్ని నిర్దేశించాలి.

స్వదేశీ పారిశ్రామిక సామర్థ్యాలను నిర్మించడం అనేది వాణిజ్య అడ్డంకులను తగ్గించడం కంటే చాలా క్లిష్టమైనది, కష్టమైనది. భారతదేశం నిర్భయంగా తనదైన పారిశ్రామిక విధానాన్ని అమలు చేసి, స్వంత సాంకేతిక అభివృద్ధిని నియంత్రించగల స్వదేశీ పారిశ్రామిక సంస్థలను నిర్మించి, భారత పౌరులకు పని చేసే, సంపాదించే, నేర్చుకునే అవకాశాలను కల్పించేంత వరకు–2047 నాటికి జిడిపి ఎంత ఉన్నప్పటికీ–భారతదేశం వికసిత్ భారత్ గా మారే అవకాశం లేదు. అంతే కాదు భౌగోళికంగా, రాజకీయంగా సురక్షితంగానూ ఉండజాలదు. *

ప్రజాపక్ష మేధావుల అవసరం మరింత పెరిగింది

(12వ పేజీ తరువాయి)


ప్రజాపక్ష మేధావుల జోక్యాలు రాత్రికి రాత్రే అణచివేత వ్యవస్థలను తొలగించక పోవచ్చు, కానీ కనీసం సుదీర్ఘకాలంలో, ప్రజలలో వాటిపై విమర్శనాత్మక చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయి.

ఈ సందర్భంలోనే, జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనలో యువతరం ప్రదర్శించిన అసమాన పట్టుదలను శ్లాఘించి తీరాలి. వారు తాము నమ్మిన పోరాటాన్ని తార్కిక ముగింపుకు – అంటే విద్యాశాఖ మంత్రి రాజీనామా వరకు తీసుకెళ్లారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకత్వంలో జరిగిన ఈ శాంతియుత ఉద్యమం నుండి నేర్చుకోదగిన పాఠం ఏమిటంటే, దేశంలోని యువత రాజకీయ స్పృహ లేనివారు కారు. లేదా ఉదాసీనంగా ఉండేవారు కారు.

జాతీయ స్థాయి పరీక్షల నిర్వహ ణలో వరుస వైఫల్యాలపై పాలనలో ప్రాథమిక ప్రజాస్వామ్య లక్షణమైన 'జవాబుదారీతనం' అనే కీలకమైన ప్రశ్నను వారు లేవనెత్తారు. తమ శక్తి కొద్దీ దానిని ముందుకు తీసుకెళ్లారు. నీట్ పరీక్షతో ఎలాంటి సంబంధం లేని చాలామంది యువకులు ఈ నిరసనలో భారీగా పాల్గొనడం వారి రాజకీయ సానుభూతికి ప్రతీక. వారు తమ మద్దతును తెలపాలని భావించారు, తెలిపారు. దేశ యువతలోని రాజకీయ చైతన్యాన్ని మనం ఇంతకాలం తక్కువగా అంచనా వేశాము. అందుకు మనం వారికి క్షమాపణలు చెప్పాలి. ప్రతి నిరసన చర్య ఒక రాజకీయ చర్యే. బహుశా వారు కూడా ఇప్పుడు ప్రజాపక్ష మేధావి పాత్రను పోషించడం ప్రారంభించారని మనం భావించవచ్చు. *

కాస్ట్రో శత జయంతి ప్రత్యేకం

వైద్య రంగంలో సోషలిస్టు క్యూబా విజయాలు



– ఫైడల్ కాస్ట్రో

(2008 సెప్టెంబరు 19న క్యూబన్ యువకులను ఉద్దేశించి కాస్ట్రో చేసిన ప్రసంగం)

విశ్వవ్యాప్తంగా 35 వేలకు పైగా క్యూబా ఆరోగ్య నిపుణులు ఉచితంగానో, ఫీజు తీసుకునో సేవలు అందిస్తున్నారు. వీరుగాక క్యూబాలో శిక్షణ పొందిన విదేశీయుల్లో వారిదేశాలలో సేవలందిస్తున్న వారు ఇంకా ఎంతోమంది ఉన్నారు. విదేశాలలో శిక్షణా కార్యక్రమాలకు కూడా క్యూబా తోడ్పడుతోంది. లాటిన్ అమెరికాలో లక్షలాది మందికి కనుచూపునిస్తున్న కంటి శస్త్రచికిత్సలు క్యూబా ప్రత్యేకత.

కూలంకషంగా అధ్యయనం చేసాక ప్రపంచం మొత్తం మీద క్యూబాలోనే మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు లభిస్తున్నాయనే నిర్ధారణకు వచ్చాను. పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన ప్రయివేటు ఆస్పత్రులను తొలగించి దేశవ్యాప్తంగా నెలకొల్పిన పాలీక్లినిక్‌లు, కుటుంబవైద్యుల కార్యాలయాలే ఈ విజయానికి కారణం.

హవానా వంటి పెద్ద నగరాలలో ప్రతి పాలీక్లినిక్ 22,000 మందికి సేవలు అందిస్తుంది. గతంలో అప్పటి పరిస్థితులవల్ల పరస్పర ప్రయోజనం కల ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పవలసి వచ్చింది. అవి నెలవారీ రుసుముతో నడిచిన సహకార సంస్థలని యువతరానికి తెలియచేస్తున్నాను. కానీ రుసుము చెల్లించలేని చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల వంటివారికి అవి అందుబాటులో ఉండేవి కావు. పెట్టుబడిదారీ సూత్రాలు వర్తించే చోట సమాజం తిరోగమనంలో ఉంటుంది. కనుక వాటిని అమలు చేయటం తప్పనిసరైనపుడు సామ్యవాదం జాగ్రత్తగా మసలుకోవాలి. వ్యక్తి స్వేచ్ఛ మాత్రమే మనుషులను నడిపిస్తుందనే భ్రమలో పడి దారి తప్పే వారు ఉంటారు.

వైద్యనిపుణులకు డిమాండు పెరగడంవల్ల తలెత్తిన బూర్జువా ధోరణులకు విప్లవం అడ్డుకట్ట వేసింది. పట్టభద్రులైన డాక్టర్లు ప్రయివేటు ప్రాక్టీసువైపు మళ్లకుండా పై చదువులు చదివి, దేశంలో నిపుణులైన వైద్యుల కొరత లేకుండా చేసారు.

1959లో విప్లవ విజయానంతర కాలంలో ప్రజలు రాజధానిలో సుదూరాన ఉన్న ఆస్పత్రులలో విప్లవం ఉచితంగా అందిస్తున్న సేవలకోసం ఎగబడేవారు. అనుభవజ్ఞులైన వైద్యులు లేని పాలీ క్లినిక్‌లకు పోయేవారు కారు. సదుపాయాలు మెరుగుపడి, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులోకి రావడంతో ప్రజలు పాలీ క్లినిక్‌లకు పోవడం ప్రారంభించారు. తరువాత దశ కుటుంబ వైద్యుల కార్యాలయాలు. ఆరేళ్ల శిక్షణ పూర్తి చేసుకుని అక్కడ సేవలందించే యువ వైద్యులు చదువు కొనసాగిస్తూ వైద్య నిపుణులుగా రూపొందుతారు. పాలీక్లినిక్‌లు వారికి అవసరమైన సదుపాయాలు, లేబరేటరీలు సమకూరుస్తాయి. క్యూబాలో నెలకొల్పిన 20 వైద్య కళాశాలనుంచి ఏటా వేలాదిమంది వైద్య పట్టభద్రులు బయటకు వస్తున్నారు. కొత్త పాలీక్లినిక్ భవనాల నిర్మాణం, పాతవాటికి మరమ్మత్తులు, నిరంతరం జరుగుతూనే ఉన్నాయి.

పాలీక్లినిక్‌లలో వ్యాధి నిర్ధారణ, అత్యవసర సేవలు, దంతవైద్యం, సమగ్ర పునరావాస సేవలు, మాతా శిశు సంరక్షణ, నర్సింగ్, క్లినికల్ అండ్ సర్జికల్ కేర్, వృద్ధులకు సేవలు, మానసిక ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, అంటు వ్యాధుల నివారణ వంటి పది అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారు. 32 ప్రత్యేక విభాగాలలసేవలందించే విధంగా ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది. పంటి నొప్పి నుంచి, గుండె పోటు వరకు దేనికైనా వాటిలో 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయి.

ఏ స్థాయి వారికైనా పనిచేసే చోట అందుబాటులో ఉండే వస్తువులను కైంకర్యం చేయడం తగదు. వినిమయ వస్తువుల ఉత్పాదనకు, సేవలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన పరికరాలు అవసరం. వాటిని వాడేటప్పుడు, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, ప్రమాదాలు సంభవించి మరణానికి కూడా దారితీయవచ్చు. ఆ ప్రమాదాల నివారణకు చేయదగినంతా చేస్తున్నాం. చరిత్రలో వెనకబడి పోకుండా ఉండాలంటే, అత్యాధునిక పరిజ్ఞానం, భారీ పెట్టుబడులు, ఖరీదైన ముడి వస్తువులు, సమృద్ధిగా విద్యుత్తు, మానవ వనరులు అవసరం. నేను జరిపిన అధ్యయనంలో క్యూబాలోని ఆర్థిక ఉత్పాదన, సేవల రంగంలో పనిచేస్తున్నవారిలో 20 శాతం వైద్యవిద్యా రంగాల్లోనే ఉన్నారని తెలిసింది.

కుటుంబ ఆదాయన్ని పెంచేందుకు తోడ్పడేలా రిటైర్మెంటు వయసు పెంచాలని నిర్ణయించాం. ఇది అధిక మొత్తంలో డబ్బు చలామణీలో ఉండకుండా చూసేందుకు కూడా ఉపయోగపడుతుంది. తమ బాగోగులు పట్టించుకునేవారే లేరని ఎవరూ అనుకోకుండా తుఫాను బాధితులను ఆదుకోవడానికి కూడా ఈ నిర్ణయం ఉపయోగిస్తుందని నా అభిప్రాయం.

సంగీత వాయిద్యం వాయించేవానికీ, ఒక వెల్డరుకూ శారీరక, మానసిక శ్రమలో తేడా ఉండదు. వారి ఆలోచనల్లో తేడా ఉండచ్చు. కారణం మొదటి వాని పనికి ప్రశంస లభిస్తుంది. అలాంటివారు (రచయితలు, నటులు వగైరా) తమ పలుకుబడితో పాత సమాజాల నుంచి సంక్రమించిన దురాచారాలను రూపుమాపడానికి తోడ్పడగలుగుతారు.

ప్రస్తుత ఆర్థిక సంక్షోభం నోబుల్ బహుమతి పురస్కారం అందుకున్న ఆర్థిక శాస్త్రవేత్తలను కూడా కలవరపెడుతోంది. సమస్య పరిష్కారం కోసం ఐరాసలో వివిధ దేశాల నేతలు, అధికార ప్రతినిధులు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. ప్రతి అంశాన్ని తిరిగి మూల్యాంకనం చేయడం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని నా అభిప్రాయం. కీలక రంగాల్లో మానవ శక్తి వృధా కాకుండా, ఉత్పాదకతను పెంచాలి. *

సిఇసి వ్యవహారం రాజ్యాంగ వ్యతిరేకం



ఎ కోటిరెడ్డి
రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. సర్ పేరుతో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష చర్యలు తీసుకుంటున్నది. ఇందులో ముఖ్యపాత్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ది. ఏ రాజకీయ పార్టీతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా పని చేయాల్సిన ఎన్నికల కమిషన్‌ను సిఇసి ఆర్ఎస్ఎస్-బిజెపి ప్రభుత్వ అనుబంధ సంస్థగా మార్చాడు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావటానికి వీలుగా అక్రమాలకు అవకాశం ఇచ్చింది. ఎన్నికల వ్యవస్థను పక్షపాతంతో పని చేయిస్తున్నది. 2025 జూన్ నెలలో బీహార్‌లో "ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ" ప్రారంభించింది. తర్వాత దేశ వ్యాపితంగా 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో జరిగిన ఓటర్ల జాబితా సవరణలో 13 కోట్లమందికి పైగా ఓటర్లను తొలగించింది. తన ఇష్టం వచ్చినట్లుగా ఓటర్లను చేర్పించటం, తొలగించటంలో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు దేశవ్యాపితంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పూర్వరంగంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక జరిపిన పరిశోధనలో వెల్లడైన విషయాలు ప్రజలను విస్మయానికి గురిచేశాయి.

కొత్త ఓటర్లను నమోదు చేయటం, గతంలో ఉన్న ఓటర్లను తొలగించటానికి చేస్తున్న మార్పులు, చేర్పులను గురించి నిర్ణయాలు తీసుకొనేటపుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ మిగతా ఇద్దరు కమిషనర్‌లతో సంప్రదించటం లేదనీ, వారితో నిమిత్తం లేకుండానే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటున్నాడనీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బయట పెట్టింది. కొత్త ఓటర్లను చేర్పించటం కోసం ఉపయోగించే ఫారం 6లో చేసిన మార్పులు "అనధికారికం, చట్ట వ్యతిరేకం" అని వారిరువురూ వ్యతిరేకించినప్పటికీ సిఇసి తన వైఖరి మార్చుకోలేదు. కొత్తగా ఓటర్లుగా చేరేవారిని తీవ్ర కడగండ్లకు గురిచేసే ఈ సవరణలను మొండిగా అమలు జరపటానికి పూనుకున్నాడు. రాష్ట్రస్థాయి అధికారులతో సంబంధం లేకుండా, ఓటర్లను చేర్పించటం, తొలగించటాన్ని కేంద్రీకృతం చేయటాన్ని గురించి కూడా వారు సిఇసికి భిన్నాభిప్రాయం తెలిపినట్లు అందులో పేర్కొన్నారు. ఓటర్లను చేర్పించటానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రాల ఎన్నికల అధికారులతో సంబంధం లేకుండా ఢిల్లీలో కేంద్రీకరించటానికి చేసిన మార్పులను వారు కేంద్ర కేబినెట్ కార్యదర్శి దృష్టికి కూడా తీసుకెళ్ళారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అధ్యయనం వెల్లడించింది. ఇది జరిగిన నాలుగు మాసాల తర్వాత సెప్టెంబరు 9వ తేదీన ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయి సమావేశం జరిగింది. ఈ అంశాలను పరిశీలించినపుడు చట్టాలను పక్కన పెట్టి, బిజెపికి లబ్ధి కలిగించటం కోసం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని స్పష్టమౌతున్నది.

ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరగాలి. గత 10 నెలల కాలంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు కమిషనర్‌లు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు రాతపూర్వకంగా తమ అభ్యంతరాలను తెలిపారు. ఒకేరోజు నాలుగు సార్లు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోలేదు. గోవాలో ఓటర్లను నమోదు చేస్తున్న అధికారులు 97 మంది ఓటర్లకు సంబంధించి ఏడు రోజులలో ఎనిమిది ఈమెయిల్స్ పంపినప్పటికీ ఇసి వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చలేదు. దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపటం కోసం ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైంది. అటువంటి సంస్థలో ఇటువంటి పరిస్థితి నెలకొనటం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం క్షేమం కాదు. ఎన్నికల కమిషనర్‌లను ఎంపిక చేసే కమిటిలో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయటం ఎన్నికల కమిషన్ బిజెపి ప్రభుత్వానికి రబ్బరు స్టాంపుగా మారటానికి ప్రధాన కారణం

గతంలో ఎన్నికల కమిషనర్‌లను ఎంపిక చేసే కమిటీలో ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేవారు. ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని నియమించేలా 2023లో కేంద్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. దానితో ప్రధాని, కేంద్రమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉండే కమిటీలోని ముగ్గురిలో ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులు ఉంటారు. ముగ్గురు సభ్యుల కమిటీలో ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులు ఉంటే అది ప్రభుత్వ కమిటీ అవుతుంది మినహా స్వతంత్ర కమిటీ కాదు. కమిటీ ఏర్పాటులో ఈ మార్పులు చేసిన తర్వాత 2024లో ప్రస్తుతం ఉన్న ముగ్గురు ఎన్నికల కమిషనర్‌లను నియమించారు. ఎన్నికల కమిషనర్‌ల నియామకం సందర్భంలో కమిటీలో సభ్యునిగా ఉన్న ప్రతిపక్ష నాయకుని అభ్యంతరాలను లెక్కచేయలేదు. ఈ నియామాకాల అనంతరమే కమిషన్ అక్రమాలకు కేంద్రంగా మారింది. ఇపుడు ఎస్ఐఆర్ పేరుతో పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారు.

పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఎన్నికల కమిషన్ తరఫున 16.10 లక్షల అప్పీళ్ళను దాఖలు చేయాలన్న నిర్ణయం గురించి సంధు, జోషిలతో పాటు పశ్చిమ బెంగాల్ సిఇవోకు కూడా తెలియదు. మరి ఈ నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ఎన్నికల కమిషన్ తరఫున ఈ అప్పీళ్ళను పంపటానికి ఎవరు అధికారం ఇచ్చారని సంధు ప్రశ్నించాడు. ఈ ప్రభుత్వం నియమించిన సభ్యులే సిఇసి తీసుకున్న నిర్ణయాలతో తీవ్రంగా విబేధిస్తున్నారనీ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా సిఇసి వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వ మద్దతుదారులకు

కూడా మింగుడు పడటం లేదనీ ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు, ఎన్నికల కమిషన్‌లో నెలకొన్న విబేధాలు వెల్లడైన తర్వాత జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలనీ, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలనీ ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. జ్ఞానేశ్‌కుమార్ దేశద్రోహానికి పాల్పడుతున్నాడని కాంగ్రెస్ విమర్శించింది. సిఇసి రాజీనామాను డిమాండ్ చేస్తూ కార్యాచరణను రూపొందించటం కోసం సెప్టెంబరు 30వ తేదీన ఇండియా బ్లాక్ పార్టీలు ఢిల్లీలో సమావేశం జరుపుతున్నాయి. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబరు 2వ తేది నుండి దేశవ్యాపిత ఆందోళన చేయనున్నట్లు సిజెపి ప్రకటించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక, సమగ్ర సవరణలో ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుపై ప్రతిపక్ష పార్టీలు, పౌరసంస్థలు, ప్రజలలో నెలకొన్న తీవ్ర అసంతృప్తి వెల్లువలా పొంగే వాతావరణం నెలకొన్నది. ప్రజలను తమ విధానాల పరిధిలో కట్టిపడవేయటం కోసం ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం వేస్తున్న పాచికలు పారే పరిస్థితి లేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

❝ ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు, ఎన్నికల కమిషన్‌లో నెలకొన్న విబేధాలు వెల్లడైన తర్వాత జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలనీ, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలనీ ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. జ్ఞానేశ్‌కుమార్ దేశద్రోహానికి పాల్పడుతున్నాడని కాంగ్రెస్ విమర్శించింది. సిఇసి రాజీనామాను డిమాండ్ చేస్తూ కార్యాచరణను రూపొందించటం కోసం సెప్టెంబరు 30వ తేదీన ఇండియా బ్లాక్ పార్టీలు ఢిల్లీలో సమావేశం జరిపాయి. ❞



భారత ప్రజాస్వామ్యానికి పట్టిన దుష్ట గ్రహాలు

స్వప్రయోజనాల కోసం ఇసి, న్యాయవ్యవస్థలోని వారి కుమ్మక్కు

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన వ్యవస్థలలో పైస్థాయిలో ఉన్నవారు పక్షపాతంతో వ్యవహరిస్తూ తమకు, తమ వారికి ప్రయోజనం కలిగేలా పని చేస్తుంటే ఆ వ్యవస్థలు ఏ విధంగా భ్రష్టుపట్టిపోతాయనే దానికి ఇసి, న్యాయవ్యవస్థలోని కొందరు వ్యవహరిస్తున్న తీరు స్పష్టమైన ఉదాహరణగా ఉన్నది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ కుమార్తె మేధారూపమ్ నోయిడా జిల్లా మేజిస్ట్రేట్‌గా ఉన్నారు. గత ఏప్రిల్‌లో నోయిడాలో కార్మికులు, ఉద్యోగులు వేతనాల పెంపుకోసం పోరాటం చేస్తున్న సమయంలో వారికి మద్దతు తెలిపిన ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని ఆకృతి చౌదరిని జాతీయ భద్రతాచట్టం కింద అరెస్టు చేయమని రూపమ్ ఆదేశించారు. ఆ చట్టం కింద కేసు నమోదు చేసి, ఆమెను ఐదు మాసాల పాటు జైలులో నిర్బంధించారు. ఈ అంశంపై దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ జరిపి, ఆమె నిర్బంధం అక్రమం అని పేర్కొంది. తక్షణమే ఆమెను విడుదల చేయటంతో పాటు ఐదు లక్షల రూపాయలు పరిహారంగా ఇవ్వాలని, దానిని అధికారుల జీతాల నుండి మినహాయించాలని కూడా చెప్పింది.

ఈ తీర్పును వ్యతిరేకిస్తూ మేధారూపమ్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మేధా రూపమ్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు బెంచ్‌కు జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ నాయకత్వం వహించారు. రోస్టర్ ప్రకారం హెబియస్ కార్పస్ పిటిషన్లతో ముడిపడిన కేసులు జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ బెంచ్‌కు రావని, కానీ రూపమ్ కేసును సతీశ్‌చంద్ర శర్మ ఉన్న బెంచ్ ముందుకు వచ్చేలా పాక్షిక దృక్పథంతో లిస్టింగ్ చేశారని లాయర్స్ ఆసోసియేషన్ ఫర్ కాన్స్టిట్యూషన్ సంస్థ పేర్కొంది.

2023లో ఎన్నికల కమిషనర్‌లు, ప్రధాన ఎన్నికల కమిషన్ నియామక చట్టాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి పంపాలా లేదా తామే తీర్పు ఇవ్వాలా అన్న అంశంపై అదే రోజు సతీశ్‌చంద్ర శర్మ జస్టిస్ దీపాంకర్ దత్తాతో విబేధించారు. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అంశంపై తామే తీర్పును వెలువరిద్దామని ప్రతిపాదించగా, రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని సతీశ్‌చంద్ర శర్మ చెప్పారు. బెంచ్‌లో భిన్నాభిప్రాయం వ్యక్తం కావటంతో ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు ఉన్నది. జస్టిస్ శర్మ కుమారుడు మధ్యప్రదేశ్ హైకోర్టులో ఎన్నికల కమిషన్ తరఫున వాదించే లాయర్ల గ్రూపులో ఒకరుగా ఉన్నాడు. కాబట్టి ఆకృతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునర్విచారణతో పాటు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి గతంలో దాఖలైన పిటీషన్లను కూడా సుప్రీంకోర్టు బెంచ్ తిరిగి విచారించాలనీ, ఈ కేసులను విచారించే బెంచ్‌లో జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ఉండకూడదనీ లాయర్స్ ఆసోసియేషన్ ఫర్ కాన్స్టిట్యూషన్ డిమాండ్ చేసింది. ఈ కేసులకు సంబంధించిన లోపాలోపాలపై తాము వ్యాఖ్యానించటం లేదని, కానీ న్యాయం చేయటమే కాకుండా న్యాయం చేసినట్లు కనిపించటం కూడా ముఖ్యమేనని

“చైనాను కూడా ఈ విధంగానే బెదిరి స్తుంటే ఆ దేశం అమెరికాకు దీటుగా సమా ధానం చెబుతున్నది. అమెరికా తమ సరుకులపై విధించిన మేరకు తాము కూడా అమెరికా సరుకులపై అధిక సుంకాలు విధిస్తున్నది. దానితో గత్యంతరం లేని పరిస్థితులలో అమెరికా చైనాతో రాజీపడుతున్నది. జిన్‌పింగ్ అమెరికా పర్యటన సందర్భంగా ఉభయులూ 3,000 కోట్ల డాలర్ల-2.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా-సుంకాలు తగ్గించు కున్నారు.”

గతంలో వివిధ సందర్భాలలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను వారు ఉదహరించారు. ఈ రెండు కేసులలో ఉన్న వ్యక్తులు, ఇచ్చిన తీర్పుల దృష్ట్యా ఇది కూడా ముఖ్యమైన అంశంగా ఉన్నది.

రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలలో ఉన్నతస్థానాలలో ఉన్నవారు ఒకరికొకరు ప్రయోజనం కలిగించుకొనేలా ఏ విధంగా వ్యవహరిస్తున్నారో ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయి. సిఇసి కుమార్తెకు ప్రయోజనం కలిగేలా జస్టిస్ సతీశ్‌చంద్రశర్మ హైకోర్టు తీర్పును తలక్రిందులు చేయగా, ఎన్నికల కమిషన్ తరపున హైకోర్టులో వాదించే లాయర్ల గ్రూపులో శర్మ కుమారుని చేర్చారు. కాబట్టి ఎన్నికల కమిషనర్‌లను నియమించే కమిటిలో సిజెఐ స్థానంలో కేంద్రమంత్రిని నియమించటానికి ఆటంకం లేకుండా శర్మ వ్యవహరించాడు. ఇటువంటి వారిని అత్యున్నత స్థానాలలో కూర్చోబెడుతున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సంస్థల మనుగడకు పెను ప్రమాదంగా మారింది.

100 శాతం టారిఫ్‌లు విధించినా నోరు మెదపని మోడీ

రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకొంటున్నందున మనదేశం నుండి అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా కాంగ్రెస్ ట్రంప్‌కు కట్టబెట్టింది. అమెరికన్ కాంగ్రెస్ నూతనంగా ఆమోదించిన రష్యన్ శాంక్షన్స్ లాను అనుసరించి ఈ విధంగా సుంకాలు విధించటానికి ట్రంప్‌కు అధికారం దఖలు పడింది. ట్రంప్‌తో పాటు అమెరికా అధికారులు మనదేశాన్ని బెదిరిస్తూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ కిమ్మనటం లేదు. రష్యా నుండి దిగుమతుల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నది. అమెరికా ఒకవైపున తనకు అవసరమైన ఇతర ఉత్పత్తులతో పాటు ప్రధానంగా యురేనియం, విలువైన లోహాలు, ఎరువులు, పల్లాడియంలను రష్యా నుండి దిగుమతి చేసుకుంటున్నది. మరోవైపున మనకు అవసరమైన మినరల్ ఫ్యూయల్స్, ముడి చమురు, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంటే మనపై అధిక సుంకాలు విధిస్తున్నది. రష్యా నుండి సరుకులు దిగుమతి చేసుకోవటం అంటే ఉక్రెయిన్‌తో ఆ దేశం చేస్తున్న యుద్ధానికి అవసరమైన ధనాన్ని అందించటమేనని, యుద్ధం ఆగిపోవాలంటే రష్యా ఆర్థిక వనరులను స్తంభింపచేయాలని అమెరికా చెబుతున్నది. కానీ నాటోలోని యూరోపియన్ దేశాలతో పాటు అమెరికా కూడా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలు, ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. అందువలననే ఇంతకాలం తర్వాత కూడా ఉక్రెయిన్ ఇంకా యుద్ధం చేస్తున్నది. ఈ దేశాలు ఏ రోజు సహాయం ఆపివేస్తే ఆ రోజే యుద్ధం ముగుస్తుంది. తన ప్రపంచ వ్యూహంలో భాగంగా ఉక్రెయిన్‌కు అన్ని విధాల సహాయం చేస్తున్న అమెరికా రష్యాకు మనం సహాయం చేస్తున్నట్లు సామ్రాజ్యవాద దురహంకారంతో బెదిరిస్తున్నది.

చైనాను కూడా ఈ విధంగానే బెదిరి స్తుంటే ఆ దేశం అమెరికాకు దీటుగా సమా ధానం చెబుతున్నది. అమెరికా తమ సరుకులపై విధించిన మేరకు తాము కూడా అమెరికా సరుకులపై అధిక సుంకాలు విధిస్తున్నది. దానితో గత్యంతరం లేని పరిస్థితులలో అమెరికా చైనాతో రాజీపడుతున్నది. జిన్‌పింగ్ అమెరికా పర్యటన సందర్భంగా ఉభయులూ 3,000 కోట్ల డాలర్ల–2.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా–సుంకాలు తగ్గించు కున్నారు. 2025, ఏప్రిల్‌లో అమెరికా చైనా దిగుమతులపై 145 శాతం వరకు సుంకాలు విధించింది. దీనికి ప్రతిగా అమెరికా దిగుమతులపై చైనా 125 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. చర్చల ద్వారా అమెరికా వాటిని ప్రస్తుతం 30 శాతానికి తగ్గించగా, చైనా 10 శాతంకు తగ్గించింది. బెదిరింపులను దీటుగా ఎదుర్కొంటే అమెరికా ఎలా కాళ్ళ బేరానికి వస్తుందో చైనాతో ఆ దేశం వ్యవహరిస్తున్న తీరు స్పష్టం చేస్తున్నది.

మోడీ ప్రభుత్వం అమెరికా బెదిరింపులను తిప్పికొట్టటానికి బదులుగా పూర్తిగా లొంగిపోతున్నది. సుంకాలు విధిస్తామని అమెరికా బెదిరిస్తుంటే మౌనంగా అంగీకారం తెలుపుతున్నది. అమెరికా బెదిరింపులకు లొంగి రష్యా, ఇరాన్‌ల నుండి ముడి చమురు దిగుమతులను తగ్గించింది. వెనిజులాతో కూడా గతంలో ఈ విధంగానే చమురు దిగుమతులను తగ్గించింది. బిజెపి ప్రభుత్వ లొంగుబాటు విధానాలతో దేశ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. మన దిగుమతులపై అమెరికా అధిక సుంకాలు విధిస్తే మన వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తులు అమెరికా మార్కెట్‌లో పోటిపడలేవు. అమెరికాతో చేసుకొంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వలన అమెరికా సరుకులు మన మార్కెట్‌లోకి రావటంతో మన వ్యవసాయం, పాలు ఉత్పత్తి చేసే రైతులు నష్ట పోతారు. పారిశ్రామిక రంగం కుదేలవుతుంది. అమెరికా బెదిరింపులకు లొంగిపోతున్న మోడి ప్రభుత్వం ఇంటా, బయటా మనదేశ ప్రయోజనాలకు నష్టకరంగా వ్యవహరిస్తున్నది. వికసిత్ భారత్ అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం దేశ ప్రయోజనాలను అమెరికా సామ్రాజ్య వాదులకు తాకట్టు పెట్టటానికి ఏ మాత్రం సందేహించటం లేదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. *

‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి. మీ లేఖలు అందాల్సిన చిరునామా!

ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,
పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977

ఎకె గోపాలన్

(2వ పేజీ తరువాయి)

కాదని అతను గట్టిగా నమ్మాడు. ఈ ఆలోచనతోనే ఎకెజి రెండు రైతు కుటుంబాల జీవన స్థితిగతులను స్వయంగా అధ్యయనం చేశాడు. భూస్వాములు మోసపూరితంగా పేద రైతుల భూములను ఎలా కబ్జా చేశారో అర్థమైంది. "భూమి దున్నేవాడిదే" అనేది కేవలం నినాదం కాదు, న్యాయపు సారాంశమని గ్రహించాడు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరిన ఎకెజి కార్మిక సంఘాలు స్థాపించ డం, సమ్మెలు నిర్వహించడం నేర్చుకున్నాడు. కార్మికుల ఆహారం తినేవాడు. వారి భాషలో మాట్లాడేవాడు. వారి బాధలను పంచుకునే వాడు. పత్తి, కొబ్బరి పీచు, బీడి, పెంకుల పరిశ్రమ, సబ్బు తయారీ, మున్సిపల్ సర్వీసు.. ఏ రంగంలో సమ్మె జరిగినా ఎకెజి అక్కడే ఉండేవాడు. సమ్మె మొదలైన చోటికి పరుగెత్తేవాడు, నిధులు సేకరించేవాడు, వాలంటీర్లను నియ మించేవాడు, పని చేయడానికి వెళ్తున్నవారిని అడ్డుకుని నచ్చజెప్పేవాడు.

కమ్యూనిజం వైపు అడుగు

రెండో ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు గోపాలన్ శ్రీలంక, సింగపూర్, మలేసియా, బర్మాలలో మలయాళీ కార్మికులను కలవడానికి విదేశాల్లో ఉన్నాడు. తిరిగి వచ్చాక కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో నాయకత్వ వైఖరిపై అసంతృప్తి పెరిగింది. కమ్యూనిస్టులను పార్టీ నుంచి బహిష్కరించడంతో, జాతీయోద్యమం నుంచి ఎదిగివచ్చిన ఎకెజి వంటివారు కమ్యూనిజానికి మరింత దగ్గరయ్యారు. తమిళనాడులో దక్షిణ రైల్వే కార్మికుల మధ్య పనిచేస్తూ, రహస్య సమావేశాలు నిర్వహిస్తూ, ఆయన పూర్తిగా కొత్త జీవితంలోకి అడుగుపెట్టాడు. బహిరంగంగా అరెస్టుకు సిద్ధపడే సత్యాగ్రహి నుంచి, పట్టుబడకుండా పనిచేసే అజ్ఞాత కార్యకర్తగా మారాడు. సామ్రాజ్యవాదానికి తనను జైల్లో బంధించడం అవసరం అయితే, పట్టుబడకుండా పనిచేయడం తన బాధ్యతగా భావించాడు. 1941 మార్చి 24న అరెస్టయి వెల్లూరు నిర్బంధ శిబిరానికి తరలించబడ్డాడు. అక్కడ ఫస్ట్‌క్లాస్ ఖైదీలకు ఇచ్చే విలాసవంతమైన సౌకర్యాలు. ఉదయం బ్రెడ్డు కాఫీ, మధ్యాహ్నం నెయ్యి, పెరుగుతో కూడిన భోజనం, సాయంత్రం మాంసాహారం, పడుకునే ముందు పాలు, టెన్నిస్, వాలీబాల్, రేడియో వంటివి ఉన్నా.. గోపాలన్‌కు అవేమీ పట్టలేదు. హిట్లర్ సోవియట్‌పై దాడి చేసిన నేపథ్యంలో యుద్ధ పరిణామాలు వేగంగా మారుతుండగా, తాను బయటకు వెళ్లి పనిచేయాలన్న తపన అతన్ని నిలవనివ్వలేదు. 1941 సెప్టెంబర్ 25 రాత్రి, ఎకెజి మరికొందరితో కలిసి తమ సెల్ గోడకు రంధ్రం చేసి తప్పించుకున్నాడు.

కారాగారమే ఓ పాఠశాల

కేరళలో పుట్టిన ఎకెజికీ కడలూరు జైలు ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలతో బలమైన బంధం వేసింది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా కాంగ్రెస్ పాలకులు కమ్యూనిస్టులను కాల్చిచంపుతున్న రోజులవి. ఆంధ్రాలో నిప్పులు కురిపిస్తున్నట్టుగా నిర్బంధకాండ సాగుతోంది. 1948 సెప్టెంబర్ 13న జరిగిన ఒక ఘటన నేపథ్యంలో, ఆంధ్రా-తెలంగాణ ఖైదీలందరూ జైళ్లలో "యూనియన్ ఖైదీలు"గా మారారు. అప్పటికి ఆంధ్ర, మలబార్, మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న కాలంలో, ఆ ఖైదీలతో పాటే కడలూరు జైల్లో కామ్రేడ్ ఎకె గోపాలన్, ఎన్ఆర్ వెంకట్రామన్ కూడా బంధించబడ్డారు. కామ్రేడ్ ఎకెజి అందరితో ఎంత చనువుగా మెలిగేవారంటే, జైలు జీవితంలో అదొక గొప్ప స్ఫూర్తిగా నిలిచిందని స్వయంగా బిటి రణదివే గుర్తుచేసుకున్నారు. ఎకెజి నేర్చుకున్న తెలుగు మాటలను తర్వాత తన ఆంధ్రా పర్యటనలో ప్రసంగాల్లో ఉపయోగించేవారు. డిటెన్యూలకు సేవ చేయడానికి జైలు అధికారులు రోజూ బయటి జైలు నుంచి కొంతమంది ఖైదీలను తీసుకువచ్చేవారు. వారిద్దరూ తమిళులు వారిని ఒకే చోట చేర్చి, ఎకెజి చదువు చెప్పేవారు, రాజకీయ పాఠాలు బోధించేవారు. ఆ క్రమశిక్షణతో చైతన్యవంతులైన ఖైదీలు, వంట చేయడంలో, బట్టలు కుట్టడంలో, ఉతకడంలో, శుభ్రం చేయడంలో ఎంతో సాయం చేసేవారు. ఆ ఖైదీలు " ఎఎజి అన్న" అంటూ అపారమైన ప్రేమ చూపేవారు.

ఆంధ్రా పార్టీకి తోడ్పాటు

ఎకెజి అంటేనే జైలు అధికారులకు వణుకు పుట్టేది. ఏ ఖైదీపైనైనా అధికారులు చేయి చేసుకుంటే, కామ్రేడ్ ఎకెజి వారిపై విరుచుకుపడేవారు. ఆ బెబ్బులి ముందు మేక పిల్లల్లా అధికారులు జారుకునేవారు. కడలూరు జైలు నాలుగు గోడల మధ్య నిర్బంధించిన ఆంధ్రా డిటెన్యూలకు ఎకెజి ఎంతో అండగా నిలిచారు. ఆంధ్ర ప్రాంతంలో మలబార్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ ప్రజలపై సాగించిన రాక్షస హింసాకాండ, అత్యాచారాల గురించి డిటెన్యూల నుంచి తెలుసుకున్న గోపాలన్, తాను విడుదలైన వెంటనే, 1951లో హుటాహుటిన విజయవాడకు చేరుకున్నారు. అప్పటికి నాయకులంతా రహస్య జీవితం నుంచి బయటికి వస్తున్నారు. అయితే వారి మీటింగ్‌లకు వెళ్లాలంటే జనం భయపడిపోతున్న ఆ దశ అది. అలాంటి పరిస్థితుల్లో ఎకెజి ధైర్యంగా ఆంధ్రా పర్యటన చేపట్టి, పోలీసుల కిరాతక త్వాన్ని బాహాటంగా దుయ్యబట్టారు. అమావాస్య చీకటి నుంచి ఆంధ్రాలో రాజకీయం వెలుగు లోకి రావడానికి, పార్టీ మళ్లీ నిలదొక్కుకోవ డానికి ఆయన పర్యటన ఎంతగానో తోడ్పడింది.

జై ఆంధ్రా ఉద్యమం వంటి ప్రాంతీయ, వేర్పాటువాద ఉద్యమాలు ప్రజలను దారి తప్పి స్తున్న సమయంలో పార్టీ నిర్వహించిన సమైక్యతా సభలకు ఎకెజి అండగా నిలిచారు. పాలకొల్లులో కేంద్ర కమిటీ సమావేశానికి పెద్ద ర్యాలీ జరగ డంలో ఆయన పాత్ర ఉంది. 1972లో హైదరాబాద్‌లో జరిగిన కూలీల సమీకరణకు, అలాగే ఖమ్మం, నల్గొండలలో రైతు ఉద్యమానికి ఆయన తోడ్పడ్డారు. ఎన్నికల ప్రచార సభల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. సిపిఎం ఏర్పడినప్పుడు అందులో ఎకెజి ముఖ్యపాత్ర పోషించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలి పొలిట్‌బ్యూరో "నవరత్నాల"లో ఆయన ఒకరిగా నిలిచారు. ప్రజా ఉద్యమాల్లో అంతటి ఆరితేరిన నేతకు ఆరోగ్యం ఎప్పుడూ ఆందోళనకరంగానే ఉండేది. 1949-50లో ఆయన కాళ్లు ఉబ్బిపోయేవి. 1953లో అనారోగ్యం కారణంగా ఎనిమిది నెలలపాటు మాస్కోలో చికిత్స పొంద వలసి వచ్చింది. 1958లో అమృత్‌సర్ మహాసభ కు ముందు ప్రీతినగర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సమావేశం జరుగుతోంది. చర్చలు కొనసాగు తుండగానే ఎకెజి నెమ్మదిగా నేలమీద ఒరిగి పోయారు. వెంటనే ఆయనను ఆసుపత్రిలో చేర్చారు.

జాతీయోద్యమ నిర్మాణంలో భాగస్వామి అయిన ఆ మహనీయుడు, ఆ ఉద్యమ ఆశయా లను వమ్ము చేసిన కాంగ్రెస్ పాలకులపై నిరం తరం పోరాడారు. ఇందిరాగాంధీ నిరంకుశ ఎమర్జెన్సీ పాలన ఎప్పుడు అంతమవుతుందా, కొత్త ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడుతుందా అని ఎదురుచూస్తూ, 1977 ఎన్నికల పోరాటం మధ్యలో కామ్రేడ్ ఎకెజి కన్నుమూశారు.

కడలూరు జైలులో ఆంధ్ర-తెలంగాణ ఖైదీలతో ఏర్పడిన ఆ పరిచయం, ఎకెజిని తెలుగు గడ్డపై కూడా చిరస్మరణీయుడిగా నిలిపింది. భాష వేరైనా, ప్రాంతం వేరైనా అణచివేతకు గురైన ప్రజల బాధ ఒక్కటేనని ఆయన జీవితం చాటిచెప్పింది. ఉద్యోగాన్ని వదిలి సత్యాగ్రహం లోకి అడుగుపెట్టిన ఆ యువకుడి ప్రయాణం, చివరకు లక్షలాది ప్రజల ఆశలు, పోరాటాలతో ముడిపడిన ప్రజానాయకుడి జీవితంగా విస్తరించింది. కాలం మారినా, అన్యాయం ఎదురైతే మనం ఏ వైపు నిలబడాలి? అన్న ప్రశ్నకు ప్రజల పక్షాన నిలిచిన ఎకెజి జీవితమే చెప్పిన సమాధానం. *

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 22, issue: 5 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

వర్గపోరాటాలద్వారానే ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారు



– వి.ఐ. లెనిన్

అన్ని రకాల నైతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక ప్రకటనల వెనుకా, హామీల వెనుకా ఏదో ఒక వర్గ ప్రయోజనం దాగి ఉన్నదన్న విషయం తెలుసుకోనంతవరకూ రాజకీయాల్లో ప్రజలెప్పుడూ మోసగించబడుతూ, తమనుతాము మోసగించుకుంటూ ఉంటారు. అలాగే సంస్కరణల ద్వారా సమాజాన్ని మార్చగలమనీ, అభివృద్ధి చేయగలమనీ భావించేవారు కూడా ఈ సమాజంలో మనకు కనిపించే పాతసమాజపు ప్రతి సంస్థనూ – అది ఎంతటి క్రూరమైనదైనా, ఎంతగా కుళ్లిపోయినదైనా– దాన్ని కొన్ని పాలకవర్గాలు రక్షిస్తూ ఉంటాయన్న విషయం తెలుసుకోనంతవరకూ పాత సమాజపు సంరక్షకులచేత మోసగించబడుతూనే ఉంటారు. అయితే ఈ వర్గాల ప్రతిఘటనను సమూలంగా నాశనం చేసే మార్గం ఒక్కటే ఉంది. మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతదాన్ని నాశనం చేసి, కొత్తదాన్ని సృష్టించగలిగే సామర్థ్యం కలిగి ఉన్న శక్తులను – తమ సామాజిక అస్థిత్వం ద్వారా అటువంటి సామర్థ్యాన్ని స్వంతం చేసుకున్న శక్తులను– గుర్తించి, చైతన్యపరిచి, పోరాటంలోకి సమీకరించడమే ఆ మార్గం.

ఇప్పటివరకూ పీడితవర్గాలన్నీ అనుభవించిన, ప్రస్తుతం కార్మికవర్గం అనుభవిస్తున్న మానసిక బానిసత్వం నుండి దాన్ని బయటపడేసే మార్గాన్ని... మార్క్స్ ప్రతిపాదించిన తాత్విక భౌతికవాదం మాత్రమే చూపించగలుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సాధారణ క్రమంలో కార్మికవర్గపు వాస్తవ స్థితి ఏమిటో చెప్పింది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం మాత్రమే.

కార్మికవర్గపు స్వతంత్ర సంస్థలు అటు అమెరికా నుండి ఇటు జపాన్ వరకూ, అటు స్వీడన్ నుండి ఇటు దక్షిణాఫ్రికా వరకూ అన్ని చోట్లా అనేక రెట్లుగా పెరిగిపోతున్నాయి. కార్మికవర్గం తన వర్గపోరాటంలో రాటుదేలి చైతన్యం పొందుతోంది, ఎడ్యుకేట్ అవుతోంది. బూర్జువా సమాజపు చీకటితెరలనుండి బయటపడుతోంది. ప్రతి నిత్యం మరింత సంఘటితమవుతోంది. విజయం సాధించడం ఎలాగో నేర్చుకుంటోంది. ఉక్కుశిక్షణతో రాటుదేలుతోంది. నిరాఘాటంగా అభివృద్ధి చెందుతోంది.”

(లెనిన్ రాసిన “మార్క్సిజం యొక్క మూడు మూలాలు, మూడు అంశాలు (1913)” అన్న గ్రంథం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)

చిరునామా
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422

చందా వివరాలు
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చందాదారుని చిరునామా

పోస్టు స్టాంపు

ఇంటినెంబరు.....
వీధి.....
గ్రామం.....
మండలం లేదా పట్టణం.....
జిల్లా.....

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.